# మాస్టర్ సి.వి.వి.

## (జన్మదిన సందేశము)

**మాస్టర్ కె. పార్వతీకుమార్**

ధనిష్ఠ

విశాఖపట్నం

ప్రథమ ముద్రణ : 2005
ప్రతులు : 1,000

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **30-00**

*ప్రాప్తిస్థానము :*
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

*ముద్రణ :*
ఎక్సెలియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"**, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించియున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. “పరహితము పరమధర్మ” మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

## ముందుమాట

**మా**స్టర్ సి.వి.వి. అందించిన భృక్తరహిత తారకరాజ యోగమును ఖండాంతరవ్యాప్తిని గావించిన వారు, 16 సంవత్సర ములుగా పరమగురువు సి.వి.వి. బోధనలను ఐరోపా, ఉత్తర, దక్షిణ అమెరికా ఖండములందు వ్యాప్తి గావించుచు 'మే కాల్' ఉత్సవములను, 'డిసెంబరు కాల్' ఉత్సవములను, 'ఈక్వినాక్స్ సోలిస్టిస్' ఉత్సవములను భౌగోళికముగ స్థిరపరచినవారు, మాస్టర్ పార్వతీకుమార్‌గారు.

వారు మాస్టర్ సి.వి.వి. గారిని గూర్చి చేయు ప్రసంగములు నిత్యనూతనములు, స్ఫూర్తిదాయకములు. వారు మాస్టరు గారిని గూర్చి చేసిన ప్రసంగములన్నియు పాశ్చ్యాత్యులు పదిల పరుచు కున్నారు. ఆంధ్రదేశమున కూడ అట్లే జరుగుచున్నది. వారి ప్రవచనములందు మాస్టరు సి.వి.వి. యోగ రహస్యములు మణులవలె వ్యక్తమగుచుండును. వానిని లిఖిత పూర్వకముగ పాఠకుల కందించవలెనని శ్రోతలు ఎప్పటికప్పుడు వత్తిడి చేయు చున్నారు.

మాస్టర్ పార్వతీకుమార్‌గారు 'నావాణి' ద్వారా అందించు మాస్టర్ సి.వి.వి. మాట, భృక్తరహిత తారక రాజయోగము పాఠకుల కెంతయో స్ఫూర్తి కలిగించుచున్నది.

2004 ఆగష్టు, మాస్టరు సి.వి.వి. పుట్టిన రోజు సందర్భముగ హైదరాబాదు గురుపూజలలో చేసిన ప్రసంగములు సాధకులకు చాలా ఆనందము కలిగించినవి. వారు ప్రసంగములను రికార్డు చేసి, లిఖితము గావించి ధనిష్ఠ కందించినారు. వారి అభిమతాను సారము ప్రసంగములను ప్రచురించుట ధనిష్ఠ తన బాధ్యతగా భావించి మాస్టర్ సి.వి.వి. జన్మదిన సందేశముగ సోదరబృందము నకు అందించుచున్నాము.

ధనిష్ఠ ప్రచురించిన 'ఎక్వేరియన్ మాస్టర్', 'మాస్టర్ సి.వి.వి. యోగము', 'మర్మమంత్రములు', నావాణిలో ప్రచురించ బడుచున్న 'మాస్టరు సి.వి.వి. మాట', 'భృకరహిత తారక రాజయోగము'లను కూడ ఈ గ్రంథముతోపాటు పాఠకులు పఠించగలరు.

- ధనిష్ఠ

# మాస్టర్ సి.వి.వి.

## (జన్మదిన సందేశము)

**మ**హాత్ముల జన్మదినములు ఉత్సవములుగా వారి అనుయాయులు నిర్వర్తించుకుంటూ ఉంటారు. మన ప్రజ్ఞ, మన చేతన ఊర్ధ్వగతికి పయనించి స్వస్థానం చేరుకోవటం కోసం జరుపుకునేవన్నీ ఉత్సవాలు అవుతాయి. మానవ ప్రజ్ఞ స్వస్థానం నుండి కొంత సంస్మరణం చెందటంచేత, అతడు సహజముగా నరుడై ఉండటంచేత జీవాత్మ సంస్మరణం చెంది దేహాత్మ భావనతో జీవిస్తూ ఉండటం చేత ఈ భూమిపై జీవనము కొంత బంధములతో కూడి ఉన్నట్లుగా కనిపిస్తు ఉంటుంది. తానున్నటువంటి సహజమైన స్థితి నుంచి అవస్థితి చెందటం చేత అవస్థితి కారణంగా బంధములు ఏర్పడుతూ ఉంటాయి. మహాత్ములు ఈ అవస్థితి నుంచి నిజస్థితికి మనలను మళ్ళీ కొనిపోవటానికి మార్గాన్ని ఇచ్చి తదనుగుణమైన స్ఫూర్తిని యిచ్చి, మనతో జీవించి, మనలో ఒకరిగా ఉండి, శ్రద్ధాళువుకి ఆ విద్యను నేర్పి, ఉత్తారణము లేక తారణము, ఉద్ధారణము కలిగించి వారు నిష్క్రమిస్తూ ఉంటారు. ఇది మామూలుగా జరిగేటువంటి భూమి మీద కథ.

మనం ఎన్ని రకాలుగా దైవాన్ని ఆరాధన చేస్తున్నప్పటికీ ఎన్ని విద్యలు దైవీ పరంగా మనం నేర్చుకున్నప్పటికీ, ఎంత జ్ఞానము సముపార్జన చేసినప్పటికీ, తదనుగుణమైన వైరాగ్యము పొంది నప్పటికీ కూడా తారణము లేక మరల అదే స్థితిలోకి పునర్జన్మ పొందటం జరుగుతూ ఉంటుంది. అంటే భక్తి, జ్ఞాన, వైరాగ్యములు యోగ విద్యతో మేళవించనప్పుడు, జీవుడు మరణము దాటలేడు. మరణము దాటనివాడికి మరలా మరుపు వస్తూ ఉంటుంది. అందుచేత యోగవిద్యను తారణవిద్య అన్నారు.

యోగము ఎప్పుడూ తారణమే. తారణము అంటే దాటుట అని అర్థం. మనము ఈ సంవత్సరమును శ్రీతారణ నామ సంవత్సరం అని పిలుచుకుంటున్నాము. తారణమునకు ఏది ఉపాయము, తరింపునకు ఏది ఉపాయము అంటే దైవమే "యోగము" అని తెలిపాడు. అతడే యోగవిద్యను మరలా అందించాడు. మనకి మొట్టమొదటగా యోగశాస్త్రమును బోధించిన వాడు అనంతుడు, శేషుడు. ఆయన వేయి ముఖములతో యోగ విద్యను తెలిపితే ప్రజ్ఞావంతులు కూడా దానిని అవగాహన చేసుకోలేక అతనిని ప్రార్థించారు.

నీవెల్లప్పుడూ నారాయణుని నీ హృదయమునందు నిలుపుకుని ఉన్నావు, నీ యందే నారాయణుడు ఉపస్థితుడై ఉన్నాడు. అలా మేము కూడా ఉండే మార్గము చూపించుము అంటే ఇది 'యోగము' అని పలికారు. యోగము అంటే జతపడి ఉండటము. నారాయణుడు అనంతుడితో జతపడి ఉన్నాడు. ఆదిశేషువుతో జతపడి ఉన్నాడు కదా! ఆ జతపడి ఉండటమును యోగము అంటాము. అలా

ఉండటానికి నేర్వవలసిన విద్య బోధింపుమని ప్రార్థిస్తే అతడు వేయి ముఖములతో ఈ విద్యను బోధిస్తే అది అనంతమైన అవగాహనకి కూడా మించి ఉండటం చేత ఋషులు ప్రార్థిస్తే ఆయన మానవ రూపాన్ని ధరించి మరల యోగశాస్త్రమును ఇచ్చారు. ఆయనే 'పతంజలి' మహర్షి. అందుచేతనే పతంజలి మహర్షిని ఒక సర్ప ఆకారంలో చిత్రీకరించి మనకు ఇస్తారు. అతడు కాలస్వరూపుడు. కాలమునకు తెలియనిది ఏమీ లేదు. సృష్టి అంతయూ కాలానుగుణంగా రూపుకట్టుకుని మళ్ళీ లయ మవుతూ ఉంటుంది. ఇందులో జీవులు దిగివస్తూ ఉంటారు. గ్రహములు ఏర్పడుతుంటాయి. మళ్లీ లయమయిపోతుంటాయి.

మొత్తం సృష్టి జ్ఞానము, జీవుల యొక్క పరిణామ కథ తెలిసినవాడు కాబట్టి అతను ఆ విధంగా జ్ఞానాన్ని అందించాడు. అదే యోగవిద్యను మరలా భగవంతుడే కృష్ణుడై దిగివచ్చి 18 సోఫానములలో భగవద్గీతగా మనకు అందించటం జరిగింది. ఈ యోగము యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే జీవుడు తాను మరణించడు అని తెలియాలి. అది అనుభవైకంగా తెలియాలి. రమణ మహర్షికి ఆ విధంగా తెలియటం వల్లనే ఆయన భగవాన్ రమణ మహర్షి అయ్యారు. అలా తాను మరణించను అని తెలియటం అంటే, తాను తన శరీరం నుండి విడివడి దివ్యమైన శరీరములో ఈ రక్తమాంసాదులతో కూడిన, ఈ శరీరాన్ని దర్శించగలగాలి. అప్పుడు కదా మనం ఇది కాదు అని తెలుస్తుంది. "ఇది మనము కాదు" "ఈ దేహం నిత్యం కాదు" అని మాట్లాడు తుంటే తెలియదు. ఇందులో నుండి వెలుపలికి వచ్చి దీన్ని చూడాలి.

అదియే అక్షరపరబ్రహ్మ యోగంలో కూడా భగవంతుడు అందించాడు. అందుచేత దీని నుండి బయటకు వచ్చి దాన్ని దర్శిస్తే తప్ప ఇది మనం కాదు అని తెలియదు. అలా దర్శించటానికి ఇవ్వబడిందే యోగము.

మనకు ఈ భౌతికశరీరానికి ఆధారమై సూక్ష్మ శరీరం ఉన్నది. దానికి ఆధారమై కారణశరీరం ఉన్నది. ఈ శరీరములన్నీ అంతః కరణమందు ఉన్నవి. అందుచేత ఉల్లిపాయ పొరలవలె ఒక పొర విడిపోతే ఉల్లిపాయ వెళ్ళి పోయిందా? లేదుగా! ఏడు పొరలతో కూడిన శరీరం ఇది. ఒక పొర తీసేస్తే, రక్తమాంసాదులతో కూడిన శరీరం పోయినంత మాత్రన నీవు పోవు. నీవు నరుడవు. నరుడనగా నశించనివాడు అని అర్థం. 'ర' అంటే నశించుట. 'న' అంటే దానికి నెగిటివ్ అందుచేత నశించుట లేక ఉన్నవాడు అతడు జీవుడు అందుచేత ఈ జీవుడు తాను నశించని వాడని తెలిస్తే తా నా దేహాన్ని *"వాశాంసి జీర్ణాని యదా విహాయ"* అని వింటుంటాం. అందుచేత ఆ విధంగా ఈ శరీరమను చిరిగిన వస్త్రాన్ని వదిలేసి మళ్ళీ వస్త్రాన్ని వేసుకుంటూ ఉంటే మనం ఎవరో మనకు తెలుస్తుంది. పొద్దున్న ఇక్కడ నేను మీకు కనిపించినప్పుడు ఒక దుస్తుల్లో ఉన్నాను. ఇప్పుడు ఇంకొక దుస్తుల్లో ఉన్నాను. నేనే కదా! అలా శరీరములు మార్చినా తామెవరో తమకి తెలిసిన వారు యోగులు అటువంటి పరంపర ఒకటి ఉన్నది. సృష్టి ఏర్పడు తూంటేనే ఆ పరంపర కూడా దిగివచ్చింది. ఏడు లోకాలకి గురువు లున్నారు. అది మనకి విభూతి యోగంలో భగవంతుడు ఇచ్చాడు. వీరంతా గురుపరంపర అని తెలియచెప్పటానికి సనక సనందనాది

కుమారులు, నారదుడు, సప్తర్షులు వీరందరూ అన్ని లోకములలో గురుత్వం వహించి జీవులు తరించటానికి మార్గాన్ని ఇవ్వటానికి దిగవచ్చిన యోగపరంపర. దైవమే వారి రూపంలో ఈ లోకాల్లో తిరుగుతుంటాడు. అందుచేత మనకి ఈ శరీరము పడిపోయినంత మాత్రాన మనం లేకపోము అనేది ప్రస్ఫుటమైన అనుభవైకమైన జ్ఞానంగా తెలియాలి.

నిన్న చదువుకున్నది ఇవ్వాళ మనం మర్చిపోము కదా! నిన్న ఏం తిన్నామో మనకి గుర్తుంటుంది. నిన్న ఎక్కడ తిరిగామో, ఏమి చేశామో మనకి గుర్తు ఉంటుంది. దానికి కొనసాగింపుగా ఇవ్వాళ చేసుకుంటున్నాం. అలాగే జన్మల తరబడి, ముందు మరణాన్ని జయించి అటుపైన అమృతత్త్వాన్ని పొందాలి. అంటే ముందు అమరత్త్వం, తర్వాత బ్రహ్మత్త్వం అని మనకు శాస్త్రము బోధిస్తోంది. మానవుడు అమరత్త్వాన్ని, బ్రహ్మత్త్వాన్ని ఈ రెండింటినీ ఈ మానవ దేహంతో సులభంగా పొందవచ్చు. అందుచేత ఈ విద్యని తారణ విద్య అన్నారు.

మనం ఎప్పుడు యోగం గురించి మాట్లాడుకున్నా ఒక కథ చెప్పుకోవాలి. అది ఏమిటయ్యా అంటే, ఒక పడవ నడిపే వాడు ఈ ఒడ్డు నుంచీ ఆ ఒడ్డుకు మనుష్యులని చేరవేస్తూ ఉంటాడు. అటువంటి పడవలోకి ఒక సాయంకాల సమయంలో ఒక పండితుడు ఎక్కుతాడు. వెళ్తూంటే చీకటి పడుతుంది. నక్షత్రాలు కనపడుతూ ఉంటాయి. కొన్ని గ్రహములు కూడా వెలుగుతో ప్రకాశిస్తూ ఉంటాయి. పండితుడు ఆకాశాన్ని చూశాడు. ఆనందిస్తున్నాడు. అన్ని మండలాలూ చూస్తున్నాడు. కృత్తికా మండలాన్ని చూస్తున్నాడు. కృత్తికలను

చూస్తున్నాడు. సప్తఋషులను చూస్తున్నాడు. బృహస్పతిని చూస్తున్నాడు. ఆకాశంలో రాత్రిపూట గోచారం ప్రకారం ఏ గ్రహాలు కనిపిస్తాయో అవన్నీ చూస్తున్నాడు. ఆనందం పొందుతున్నాడు. గంగానదివలె గోదావరి నది చాలా పెద్దది. సగం దారిలోకి వెళ్ళేసరికి పండితుడు పడవ నడిపే వాడిని "ఏమిరా నీకు ఈ ఆకాశంలో నక్షత్రాల గురించి తెలుసా" అని అడిగాడు. 'నాకు తెలియదు' అని చెప్పాడు. "నాకు ఈ పడవ నడపడం ఒక్కటే తెలుసు" అంటాడు. అటుపైన అవి కొన్ని గ్రహములు, కొన్ని నక్షత్రములు, సూర్యమండలములు ఇది తెలియదా, అది తెలియదా అని ఆయనకు తెలిసిన విజ్ఞాన శాస్త్రములన్నీ వల్లె వేశాడు. నాకేం తెలియదు. నాకు ఇటునుంచి అటు దాటించటమే తెలుసు అని చెప్పాడు.

సరే ఇన్ని రకాలలో ఏమీ తెలియకుండా నీ జీవితం వ్యర్థం అయిపోయింది. నువ్వు మానవ శరీరం ధరించావు. ఎన్నో శాస్త్రములు ఉన్నాయి. నీవు ఏదీ చదువుకోలేదు. నీ జీవితం వ్యర్థం అయిపోయింది అంటూ ఉంటే ఈ లోపల పడవకు ఒక చిల్లు పడటం, పడవవాడు స్వామీ మీకిన్ని శాస్త్రములు తెలుసు, మీరు ఈత నేర్చుకున్నారా, ఈత వచ్చునా అని అడుగుతాడు. ఈత రాదు అంటాడు. అయితే ఏం చేద్దాం ఇప్పుడు మన పడవ మునిగిపోతోంది, నది మధ్యలో ఉన్నాం, ప్రవాహం చాలా తీవ్రంగా ఉన్నది. చీకటి పడింది. సగం దూరమే వచ్చాం. ఇంకా సగం దూరం వెళ్లాలి. పడవ మునిగిపోతున్నది. మీకు ఈతరాదు. ఎలా చేరుకుంటారు అవతల ఒడ్డు అని అడుగుతాడు. అప్పుడు ఆ పండితుడు చాలా కంగారుపడ్డాడు. కంగారుతో 'ఎలారా?' అని

అడుగుతాడు. ఆ పడవవాడు 'ఎలా ఏముంది? నాకు ఈతవచ్చు, నేను ఈదుకుంటూ వెళ్ళిపోతాను. మరి మీ సంగతి మీరు చూసుకోండి. అమ్మమ్మ అలా కాదు నన్ను కూడా నీవే మోసుకెళ్ళు అంటాడు.

"మీ శాస్త్రాలు మిమ్మల్ని అటు చేర్చలేవా' అని అడుగుతాడు. చేర్చలేవు కదా! 'లేవు చేర్చలేవు' నీవే నాకు గతి అంటాడు. సరే వీపున ఈయనని కూడా వేసుకుని అవతల ఒడ్డుకి వెళ్ళిపోతాడు. వెళ్ళిపోయిన తర్వాత అప్పుడు ఆ పడవవాడు అడుగుతాడు. ఏమి ఉపయోగము నీ శాస్త్రముల వలన నీకు? నీవు ఇటునుంచి అటు వెళ్ళలేవు కదా! మధ్యలో మునిగిపోతావు కదా! మునిగిపోయే వాడికి శాస్త్రాలు తెలిస్తే ఏమిటి? తెలియకపోతే ఏమిటి? అందుచేత నీవు నేర్చుకున్న విద్యలు నీకు పనికిరావు. "నీవు ముందు నేర్చుకోవలసింది. దాటే విద్య నేర్చుకో" అంటాడు.

ఎప్పుడన్నా యోగము, యోగవిద్య ఉన్నదని విన్నావా ? కపిలుడు సహితము యోగవిద్య మూలసూత్రముగా భక్తి, జ్ఞాన, వైరాగ్యములను పెంపొందించుకుంటూ వెళ్ళమని చెప్పాడు. అది సాంఖ్యం. అందుచేత అప్పుడు ఆ పడవ అతను ఒక మహాత్ముడిగా దర్శనం ఇచ్చి నీవు నేర్వవలసింది యోగము. నీవు నేర్చుకున్నది పాండిత్యము నిన్ను రక్షించదు, ఇది నిన్ను రక్షిస్తుంది అని చెప్పాడు. నిన్ను తరింపచేస్తుంది.

ఈ సంసారము అనే సాగరము నుండి నిన్ను ఆవల ఒడ్డుకి తీసుకువెళ్ళే విద్య. ఇదే మార్కండేయ పురాణము, ఇదే నచికేత

విద్య, కఠోపనిషత్తు, ఇదే సావిత్రీ ఉపాఖ్యానము. నచికేతుడు తండ్రి పంపిస్తే యముడి వద్దకు వెళ్ళాడు. తనకుగా తాను వెళ్లలేదు. తండ్రి పంపిస్తే యముడి వద్దకు వెళ్ళి యముడి దగ్గర ఈ విద్య నేర్చుకుని మరణాన్ని దాటాడు. అది మనకు కఠోపనిషత్తుగా ఇచ్చారు. మార్కండేయుడు యోగవిద్యను తానుగా ఉపాసించి మృత్యుంజయుని ఆరాధన చేసుకుంటూ మరణాన్ని దాటాడు. సావిత్రీదేవి తన మరణం దాటటం కోసం కాకుండా తన భర్త మరణాన్నుంచి అతన్ని దాటించటం కోసం తానుగా సూక్ష్మరూపాన్ని ధరించి యముని వద్దకు వెళ్ళి తన భర్తని మళ్ళీ తిరిగి తెచ్చుకుంటుంది.

ఈ కథలు ఏమిటి? అంటే ఈ శరీరం ఉండగానే మనం వేరే ఇంకొక శరీరము ఏర్పరచుకొనవచ్చు. అది పటిష్టం చేసుకుంటే దాన్ని ఉపనిషత్తులలో అంగుష్టమాత్ర పురుషుడు అన్నారు. అట్లా నీవు శాశ్వితుడవు. నీవు దానిని కనుక ఈ శరీరం ఉండగానే దర్శించి, అది నీవుగా పరిణతి చెందితే ఇది రాలిపోయినా నీకు మళ్ళీ జన్మ ఎత్తినా అప్పుడు నీకు అది పునర్జన్మ కాదు.

దిగి రావటం వేరు, పుట్టటం వేరు. కృష్ణుడు దిగి వచ్చాడు కదా! అందుచేత దిగివచ్చిన వారుంటారు. శరీరాలలో చచ్చిపోయి పుట్టినవాళ్ళుంటారు. ఈ చచ్చిపోయి పుట్టినవాళ్ళకి చావని మార్గాలు చెప్పటం కోసం పెద్దలు ఎప్పటికప్పుడు దిగి వస్తూంటారు. "పుట్టనీ, చావునీ త్రోవ వెదకుకొనుట దొడ్డబుద్ధి" అని చెప్పి ప్రహ్లాదుడు సహాధ్యాయులకు చెపుతాడు. అది యోగమార్గం, తారణ మార్గం. అందుచేత యోగం అంటే ఏమిటో తెలియకుండా యోగం చేస్తుంటే

ఏమిటి ఉపయోగం? అసలు యోగము ఎందుకు? యోగవిద్య ఎందుకు ఇచ్చారు. యోగంలో ఏమి ప్రతిపాదింపబడి ఉన్నది. యోగం ఏం చెపుతుందంటే అసలు నీవు ఉన్న స్థితియే ఒక యోగము. ఎందుచేతనంటే నీ యందు దైవము ఉపస్థితుడై ఉన్నాడు. నీవు జీవుడిగా ఉంటే నీ యందు దైవము ఉపస్థితుడై ఉన్నాడు. సర్వాంతర్యామి అయిన దైవము నీయందు కూడా ఉన్నాడు. అతనికి తొడుగు లేక వాహికగా నీవున్నావు. నీకు తొడుగు లేక వాహికగా నీ రక్తమాంసాదులతో కూడినటువంటి ఈ శరీరము, కొన్ని సూక్ష్మ శరీరాలున్నాయి. జీవుడు దైవాంశ సంభూతుడు. దైవము మొత్తం అంతర్యామిత్వం చెంది ఉన్నవాడు. సృష్టిలో మొత్తం సృష్టిని నడిపే పురుషుడుగా కూడా ఉన్నాడు.

అందుచేతనే పురుష సూక్తంతో అతన్ని మనం కీర్తిస్తూ ఉంటాము. తత్త్వమును దేవతలు చక్కగా వండి ఒక పురుషుని తయారు చేశారు. అతడికి చెవులు ఇవి, కళ్లు ఇవి, ముక్కు ఇది, నోరు ఇది. "ముఖాదింద్రశ్చాగ్నిశ్చ" అంటూంటాం. ఇలా రక రకాలుగా పురుషుడు ఒకడు మొత్తం సృష్టినంతా వ్యాపించి ఉన్నాడు. అతడు చతుర్భుజుడు, అది సత్యము. అతని రూపం నుంచి ఈ రూపం వచ్చింది. అతని తేజోమయ రూపం నుంచి అంతర్యామి రూపం ఆ విధంగా ఒక విష్ణురూపంగా ఏర్పడింది. అంతకు ముందు అది లింగాకారము, అండాకారము. అది తేజోమయ రూపాన్ని ధరించింది. ఆ రూపం ఆధారంగా జీవులు కూడా అదే రూపంతో దిగి వచ్చారు. ఇది చెప్పటానికే God made Man in his own Image and Likeness అతని యందు ఏఏ శక్తులు

స్థాపితం చేసి ఉన్నవో అవే శక్తులు మానవుని యందు కూడా ఉన్నాయి. కాకపోతే అవి మేల్కొనని వారి యందు నిద్రాణమై ఉన్నాయి. అందుచేత మనకి మహాన్యాసం చదువుకుంటూ ఉంటే శివాభిషేకం చేసేటప్పుడు ఎంతమంది దేవతలు ఎక్కడెక్కడ మన శరీరంలో ఉన్నారో స్పృశిస్తాం. ఆ దేవతలు మేల్కొంచితే నీవు మహత్తరమైనటువంటి పురుషుడవు. అందుచేత విరాట్పురుషుడు ఎవరైతే ఉన్నారో మొత్తం సృష్టి కాధారంగా అతనికి ప్రతీకగానే నువ్వు వచ్చావు. నీకు మళ్ళీ ఇంకొక శరీరం వచ్చింది. నీకు ఒక దేహం ఏర్పడింది. కాబట్టి అంతర్యామి దైవము, అటుపైన అతడు నీ యందు ఉండటం రెండవ స్థితి.

ఇదే భగవంతుడు మనకి భగవద్గీతలో "ఇమం వివస్వతే *యోగం ప్రోక్తవాన్ అహమవ్యయం, వివశ్వాన్ మనవే ప్రాహః మనురిక్ష్వాకవే ఉ బ్రవీత్*" అని చెప్పాడు. యోగము నేను సూర్యుడికి తెలిపాను. సూర్యుడు వైవస్వత మనువుకి తెలిపాడు. వైవస్వతమనువు తన కుమారుడైన, భూమికి రాజైన ఇక్ష్వాకునికి తెలిపాడు అంటాడు. ఇక్ష్వాకుడు భూమికి రాజు. భూమికి రాజుంటే శరీరానికి ఒక రాజున్నాడు. వాడే మనస్సు. ఇంద్రియములకు అతడు అధిపతి. ఈ శరీరాన్ని, ఇంద్రియాలను మనస్సు నడుపుతుంది. ఈ ఇక్ష్వాకుడికి తండ్రి ఒకడున్నాడు. అతడు వైవస్వత మనువు. అతడు సూర్యునికి కుమారుడు. మన సూర్యుడు పేరు వివస్వతుడు. అతని కుమారుడు అవటం చేత వైవస్వతుడు అయినాడు. వైవస్వత మనువు సూర్యుడి యొక్క కుమారుడు ఎందుచేతనంటే సూర్యుడు మొత్తం వెలుగుతున్నటువంటి ఆకాశంలో ప్రజ్ఞగా గోచరిస్తున్నాడు. ఒక

బింబంగా గోచరిస్తున్నాడు, మొత్తం వెలుగే. మళ్ళీ అందులో ఒక వెలుగు, అంటే అంత గోళం ఉంటే అక్కడ ఒక చుక్క పెడితే దాన్ని చూస్తాం కదా! ప్రత్యేకంగా అలా మొత్తంలోంచి ఒకటి ఏర్పడితే దాన్ని ప్రత్యేగాత్మ అంటారు. ఒకడుగా ఏర్పడ్డావు, నీవు కూడా ప్రత్యేగాత్మయే.

సూర్యుని వెలుగున్నది. అలాగే నీ జీవాత్మకి సంబంధించిన వెలుగు నీకున్నది. అది నీ బుద్ధి. ఆ బుద్ధి నుండి నీ మనస్సులో ఆదేశములు వస్తే జీవుడుగా నీవు నిర్వర్తించవలసిన కర్తవ్యాలు దేహంతో నిర్వర్తించవచ్చు. అందుచేత అంతర్యామి నుండి జీవునకు, జీవుని నుండి బుద్ధికి, బుద్ధి నుండి జీవుని మనస్సునకు, ఆ ప్రజ్ఞా ప్రసారం అలా జరుగుతుంటే ఆ యోగవిద్యకి కారణము దివ్య సంకల్పము, దివ్యప్రణాళిక భూమి మీద అవతరిస్తుంటుంది. నీవు ఒకడిగా కన్పిస్తున్నప్పటికీ నీయందు దైవమున్నాడు. నీ యందు ఉన్న దైవము మొత్తము నందు కూడా ఉన్న దైవమే. నీ యందు కూడా మొత్తము నిండియున్న దైవము ఒక (మొదటి) స్థితి.

నీ యందున్న దైవము 2వ స్థితి. నీవు 3వ స్థితి. నీ శరీరం 4వ స్థితి. ఈ విధంగా 4 విధములు. అందుకనే అన్నీ 4 స్థితులలో ఉన్నాయి. అని చెపుతారు. ఆ 4 స్థితులు అని చెప్పాటానికే మనకి + గుర్తు వచ్చింది. ఆ + గుర్తు మనకి ఇప్పుడు క్రైస్తవ మతానికి సంబంధించిన సంకేతం అని అనుకుంటున్నాం. కానీ మనం నాలుగురం కలసి ఒకడిగా ఉన్నాం. మన యందు ముగ్గురు ఉన్నారు. ఈ ముగ్గురికీ ఆధారంగా ఒకడు ఉన్నాడు. ఇది తెలిసి నీవిప్పుడు "ఎక్కడ ఉన్నావు?" నీవు, నీ శరీరమే నీవు అనుకుంటు

న్నావు. 'నీ మనస్సుకి తోచినది నీవు చేస్తున్నావు.' నీ బుద్ధికి, 'మనస్సుకి వంతెన' లేదు. ఆ వంతెన కడితే నీవు బుద్ధి లోకంలోకి వెడితే ఈ భౌతికమైన విషయములకన్నా అద్భుతమైన విషయములు మనకి అనుభూత మవుతాయి. మరి ఆ వంతెన నిర్మాణం దేని ద్వారా జరుగుతుందంటే కేవలం యోగవిద్య ద్వారానే.

యోగవిద్య ద్వారా బహిఃకరణముల నుండి అంతఃకరణ శరీరంలోకి ప్రవేశిస్తావు. మన యందు బహిఃకరణములతో కూడిన ఈ రక్తమాంసాదులతో ఉన్నటువంటి మనస్సుచేత, ఇంద్రియముల చేత నడిపింపబడుచున్న సప్తధాతువులతో కూడిన శరీరం ఒకటుంటే దీనిని దైవీపరంగా నడిపించటానికి మనయందు బుద్ధి ఉన్నది. అందుచేతనే గాయత్రీ మంత్ర గానము నందు, ధ్యానము నందు మనం ఏం కోరుతాం? మన బుద్ధుల్ని ప్రచోదనం చేయమని. బుద్ధి కర్మని అనుసరించి వెళ్ళకుండా బుద్ధి దివ్యప్రణాళికను అనుసరించి వెళ్ళేట్లుగా 'బుద్ధిః కర్మానుసారిణే' అంటారు కదా! అందుచేతనే తెల్సినప్పటికీ కూడా కొన్ని పిచ్చి పనులు చేస్తూంటాం బలహీనత చేత. తెలియదా మనకి ప్రొద్దున్నే లేవాలని, ఆరాధన చేయాలని, ధ్యానం చేయాలని, చేయలేకపోతున్నాం కదా! తెలియదా! మనం పొల్లు మాటలు మాట్లాడకూడదని, తెలుసు కదా! తెలిసినా చేయ లేము కదా!

మనకి తెలియటం వేరు, ఆచరణ వేరు. రెండింటికి మధ్య దూరం ఒకటి ఉన్నది. దానికి మనం వంతెన నిర్మించుకోవాలి. ఆ నిర్మాణము అయితే అంతఃకరణ శరీరంలోకి ప్రవేశిస్తాము. ఈ బహిఃకరణ శరీరంలోంచి అంతఃకరణ శరీరంలోకి ప్రవేశిస్తే బుద్ధికి

సంబంధించిన శరీరంగా ఉంటుంది. అక్కడ నీకు అవగాహన కానీ, పెద్దల మాటల యొక్క లోతుగానీ తెలుస్తుంది. ఎక్కువ మనస్సులో కూర్చున్నవాళ్ళకి, ఇంద్రియాలతో కూర్చున్నవాళ్లకి చెవికి ఎక్కదు. ఎందుకంటే ఇక్కడే ఉంటారు, మనస్సు ఎక్కడో ఉంటుంది. అందుచేత బుద్ధిలోకి ప్రవేశించినవాడు అక్కడ నుంచి తాను జీవుడుగా తనని తాను దర్శనం చేయవచ్చు. తాను జీవుడుగా, తేజోమయ శరీరంతో ఎలా ఉంటాడో తనని తాను దర్శనం చేయవచ్చు. అలా దర్శనం చేసిన తర్వాత తాను ఇటువంటి రూపమే కలిగిన మహోత్తర రూపంలో భాగమని తెలిసి దానితో అనుసంధానం చెందుతాడు. అదీ దైవయోగము అంటే.

'దైవయోగమున' చేసి అని పోతనామాత్యులు చాలాసార్లు వాడతారు భాగవతంలో. 'దైవయోగమున' చేసి అంటే నీవు దైవముతో యోగము చెంది ఉండటం ద్వారా నీ నుండి పనులు అవుతాయి. బుద్ధిలో ప్రవేశించిన వాడికి ఒకటి తెలుస్తుంది. మొత్తం జరుగుతుంది. మనం కూడా అందులో ఉన్నాము. జరిపేవాడు ఒకడున్నాడు, అని తెలుస్తుంది. చేస్తున్నాను అన్న భావన పోతుంది. ఎందుచేతనంటే రజోగుణం నుంచి సత్వగుణంలోకి ప్రవేశిస్తాడు అందుచేత చేస్తున్నాం అనేటువంటి జాతులు ఈ భూమి మీద చాలా ఉన్నాయి. అవన్నీ సంకర్షణ వ్యూహములు అని పెద్దలు చెప్పారు. సంకర్షణ వ్యూహం అంటే ఏమిటంటే అహంకార వ్యూహం. పాశ్చాత్యులకి అది ఎక్కువ. వారు చేతలనే నమ్ముతారు. చేతయందే నమ్ముతారు. Sense of Achievement అనేది పాశ్చాత్యులకి ఎక్కువ. మనవాళ్ళు కూడా ఇప్పుడు కొత్తగా నేర్చుకుంటున్నారు. Sense

of BE ness అనేది ఈ భూమి యొక్క ప్రత్యేకమైన విద్య ఉండటమే. మహాత్ములు ఒక చోట కూర్చుని భూగోళం అంతా వ్యాప్తి చెందట్లా? చెందుతున్నారు. షిరిడి, పుట్టపర్తి, రామకృష్ణ, అరవింద ఇవన్నీ ఏమిటి? వీరు తిరిగారా? తిరగక్కర్లేదు. నీవు సత్యమునందు ఉపస్థితుడై ఉంటే ఆ సత్యము క్రమశః తన చేతన సత్యంలోంచి వ్యాపనమున్నది. ఆ వ్యాపనం చేత అందరూ స్ఫూర్తి చెందు తుంటారు. అందుచేత వశిష్టుడు ఏమీ చేయనట్లుగా కనబడ్డప్పటికీ విశ్వామిత్రుడు చాలా చేస్తున్నట్లుగా కనబడ్డప్పటికీ, ఈ విశ్వామిత్రుడు, ఆ వశిష్టుడిని అవగాహన చేసుకోవటానికి ఎన్నో జన్మలు సాధన చేయవలసి వచ్చింది.

అందుకని చేయటంలో కన్నా ఉండటంలో ఉండే గొప్పతనం తెలియాలంటే రజస్సులోంచి సత్త్వంలోకి రావాలి. మనస్సులోంచి బుద్ధిలోకి రావాలి. ఇలా మనం ఈ గుంపుగా ఉన్నటువంటి మనం ఈ దేహంలో బంధింపబడి ఉన్నాం. దేవుడు జీవుడిలో ఉంటే జీవుడు దేహంలో ఉన్నాడు. జీవుడు దేహంలో ఉండవచ్చు కానీ అతని సంబంధము దైవముతో ఉంటే శరీరము తనకు అనుకూలిస్తుంది. అతని సంబంధం శరీరంతో ఉంటే శరీరం బంధిస్తుంది. దైవము అదృశ్యుడవుతాడు. అదే గజేంద్రమోక్షం కథ. గజేంద్రమోక్షంలో గజేంద్రుడిని మొసలి పడుతుంది కదా! గజేంద్రుడు ఎవరు? కథ ముందుకెళితే ఓంకార స్వరూపుడే. అంటే జీవుడే. అతడు మొసలి అంటే మకరము కదా! మకరం పట్టింది. మకరము అంటే 5 అంకె ప్రధానంగా గల రూపము మనది. మన శరీరమును మకరము అంటారు. పంచప్రాణములు, పంచేంద్రియములు, పంచ

తన్మాత్రలు, పంచ కర్మేంద్రియములు కలిగినటువంటి శరీరములో ఈ జీవుడు ఉన్నాడు. ఉండటం వేరు, బంధింపబడడటం వేరు.

గజేంద్రుడు బంధింపబడ్డాడు. దైవం నుంచి మనం వస్తే మన నుంచి మన శరీరం వచ్చింది. మన స్వభావం నుంచి మన శరీరం, ఎవరి వాసన బట్టే వారి శరీరం. అందుకనే ఎవరి వాసన వారికుంటుంది. శరీరాల్లో కూడా ఎవరి వాసన వారిది. మహాత్ముల దగ్గర వాసనే ఉండదు. సుగంధం ఉంటుంది. మరణించిన తర్వాత కూడా శరీరం 3, 4, 5 రోజులు, నెలరోజులు కూడా సుగంధమే వ్యాప్తి చెందుతుంది. అందుచేత అటునుంచి వచ్చిన వాళ్ళం కాబట్టి తొడుగులో దిగాం కాబట్టి దాన్ని అధిష్టించి ఉండాలి. ఈ అధిష్టించి ఉండాలంటే ముందు మనం జీవులమని, దైవం యొక్క అంశ అని, శరీరంలోకి దిగి వచ్చామని ముందు తెలిసి శరీరంని అధిష్టించి గుఱ్ఱం మీద కూర్చోవాలి. అప్పుడు ప్రయాణం. ఇది (శరీరం) గుఱ్ఱం లాంటిది. ప్రాణాలతో ఉంది. ప్రాణాన్ని అశ్వము అంటారు వేదంలో. అందుచేత ఈ ప్రాణాన్ని అధిష్ఠించి పంచప్రాణాలని, పంచేంద్రియములను, పంచతన్మాత్రలను అధిష్టించి జీవుడు ఉండా లంటే బుద్ధిలో ఉంటే ఉంటాడు. బుద్ధిచేత నడపబడే మనస్సుకి ఆదేశములు వస్తుంటే అది యోగము. బుద్ధి మాట వినకుండా మనస్సే తన ఇష్టం వచ్చినట్లు చేస్తుంటే అది అవయోగము. అందుచేత ఈ అవయోగం నుండి మళ్ళీ యోగములోకి వెళ్లి బుద్ధి నుంచి జీవాత్మగా తనను తాను గ్రహించి ఈ దేహాత్మ భావన నుంచి విడివడితే తాను బంగారు రంగులో తన చిన్న శరీరంలో ఉన్నట్లుగా తనకి గోచరిస్తుంది. అపుడు తాను జీవాత్మ భావనతో

దైవాన్ని ఆరాధన చేయాలి. దేహాత్మ భావనతో దైవాన్ని చేసే ఆరాధనల వలన దైవము ప్రతిస్పందించదు. నీవు జీవాత్మ అయి పరమాత్మను ఆరాధన చేయాలి. నీవు దేహమునందు బంధింప బడినప్పుడు దేహము నుంచి నీవు విముక్తి కోరాలి. ఆ దేహము నందు విముక్తి కోరడం ఒక రకమైన మోక్షము. అటుపైన జీవుడు దైవముతో ఏకీభావము చెందటం, ఈ మొత్తం విద్య అష్టాంగ యోగంగా ఇచ్చారు. ఈ మొత్తం విద్య భగవద్గీతలో కూడా ఉన్నది. ఇదే విద్య రకరకములుగా భాగవతాది గ్రంథములలో ఉన్నది. గజేంద్రుడు ఏం చేస్తే మొసలి విడిచింది. మొసలితో పోట్లాడితే మొసలి విడిచిందా? మకరము తన కన్నా బలమైనదని వేయి సంవత్సరముల పోరాడి తెలుసుకుంటాడు.

> *"పృథుశక్తిన్ గజమాజలగ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి, సం*
> *శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి, మిథ్యామనో*
> *రథ మింకేటికి, దీని గెల్వ సరి పోరంజాలరా దంచు స*
> *వ్యథమైయిట్లనుఁ బూర్వపుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తితోన్"*

అని అప్పట్నుంచి ఎవ్వనిచే జనించు అని మొదలు పెడతాడు. అంటే దైవము వైపు తిరిగాడన్నమాట. జీవుడు దైవం వైపు తిరిగితే ఆ దైవంతో అనుసంధానం చెందుతుంటే ఈ దేహం పట్టు విడుస్తుంది. దేహం గురించే భావిస్తూ దేహంతోనే, మనస్సుతోనే జీవిస్తూంటే జీవుడిని బంధిస్తుంది. అందుచేత యోగవిద్య యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యం ఏమిటంటే తారణ మార్గము. శరీరంలో ఉండవచ్చు కానీ బంధింపబడకుండా నీవు దేహంలో ఉంటే అది నీకు గృహము అయింది కదా!

ఇంట్లో ఉండే వాళ్ళం పనుంటే బైటకి వెళతాం ఇచ్ఛానుసారం. మళ్ళీ పని అయిపోగానే ఇంట్లోకి వస్తాం. అలా శరీరం లోంచి వెళ్ళగలిగేటువంటి విద్య ఒకటి ఉన్నది. అది నేర్చుకోమని పెద్దలు చెప్పారు. శరీరంలోంచి బైటకి వెళ్ళటం, శరీరంలోకి రావటం జరుగుతూనే ఉంది ప్రతిరాత్రీ నిద్రలో. ప్రతిరాత్రీ నిద్రలో మనకి తెలియక అది జరుగుతోంది. మనకి తెలిసి జరుపుకుంటే మనకి మరపు, మరణము ఉండదు. అందుచేత ఈ విద్య నేర్చుకోమని చెపుతారు పెద్దలు. మరణాన్ని దాటమంటారు. మరణాన్ని దాటి అటుపైన నీవు మరపులేని వాడివి అవటం చేత క్రిందటి జన్మలో కార్యక్రమము ఈ జన్మలో కొనసాగించవచ్చు. అలా అయితే నీకు చాలా సమయం కలసి వచ్చింది కదా! అందుచేత ముందు నీకు అమరత్వం, అటుపైన నేను బ్రహ్మత్వం ఇస్తాను అని మాస్టర్ సి.వి.వి.గారు వాగ్దానం చేసారు.

యోగము నందు ఉన్నది ఆ 'విషయం'. ఇది కొత్త విషయం కాదు, కాకపోతే ప్రతి మహాత్ముడు తాను ఈ యోగమునందు రకరకములుగా పరిశీలన చేసి అది జీవులకు సులువు చేసి పెడదాం అనే తపన వారికుంటుంది. ఎందుచేతనంటే దైవమును దర్శించి, స్పర్శించి, భాషణంచేసి తాదాత్మ్యం చెంది మరల అటునుంచి తిరిగి వచ్చినవారికి అపరిమితమైన ప్రేమ, దయ, జీవుల మీద ఉంటుంది. ఎందుకని? తానంత అపరిమితమైన ఆనందాన్ని పొందాను అది వీళ్ళకి కూడా దక్కితే బాగుంటుంది. అనే అపరిమితమైన ప్రేమ. అందుచేతనే వాళ్ళు పోనీ వీళ్ళకూడా చెపుదాం ఈ విషయం అని చెప్తు వస్తూంటారు. ఈ కథ అనాదిగా జరుగుతున్న కథే.

ఎప్పట్నించీ జరుగుతోంది? మాటిమాటికీ. జీవులలో లక్షణాలన్నిటిని బట్టి కొంతమందికి కొన్ని కొన్ని పద్ధతులు నచ్చుతాయి. ఆకలి తీరటం అనే అంశం ఒక్కటే అయినప్పటికీ రకరకములుగా వండుకు తింటారు కదా! అలాగే యోగానికి కూడా మహాత్ములు రకరకము లగా సుళువు చేసి, ఇలా చేసుకోండి అని ఇచ్చారు. ఎందుకని? తాను ఆ మార్గాన్ని సుళువు చేసి మళ్ళీ అందిస్తాడు. అందుచేత మనము ముందు మాస్టరుగారి యోగము, మాస్టరుగారి యోగము అనే లోపల అసలు ఈ యోగము ఏమిటి? దేని గురించి యోగము?

దేని గురించి యోగము అంటే నిన్ను నీవు జీవుడుగా దర్శించుటకు, నీ స్వస్వరూపము నీవు దర్శించుటకు. నీవు ఈ దేహము కాదు అని నీకు స్పష్టముగా తెలియుటకు. నీవు ఒక వెలుగు రూపము అని నీకు తెలియుటకు. ఇపుడు మీరు పుట్టపర్తి వెళితే అక్కడ ఆయన బంగారూ, బంగారూ అంటూంటారు అందర్నీ. ఎందుకని బంగారూ అంటారు. నీవు బుద్ధిలోకంలో ప్రవేశిస్తే నీ శరీరము బంగారు శరీరమయమై ఉంటుంది. దాన్నే రుక్మిణి అంటారు. రుక్మిణి పిలిస్తే కృష్ణుడు వచ్చాడు గానీ, మరి ఇంకొకరు పిలిస్తే వస్తాడా? రాడు. ఎందుచేత? ఇది భౌతికము. అది దివ్యము. అందుచేత ఈ దివ్యమైన శరీరాన్ని నిర్మాణం చేసుకోవలసిన ఒక బాధ్యత ఉన్నది. అందుకే ఈ యమ, నియమ, ఆసన, ప్రాణాయామాది కార్యక్రమములు. అది జరిగి నీవు అంతర్ముఖుడవై అంతఃకరణ శరీరమందు ప్రవేశించి దాని నిర్మాణం జరిగితే అపుడు కథ మొదలవుతుంది. అందుచేత అసలు యోగ మంటే ఏమిటో అర్థం చేసుకోవాలి.

యోగము, ముందు చిత్తవృత్తి నిరోధమును గావించటానికి. మనకు మాస్టరుగారి ప్రార్థన చేసి దణ్ణం పెట్టుకుంటూ ఉంటే మీ చిత్తవృత్తులు క్రమశః అదుపులోకి రావాలి. మాటిమాటికీ ఇటు పరిగెత్తి, అటు పరిగెత్తితే అలా ఉండదు. అలా జరగటానికి కొన్ని నియమాలు, దీక్షలు ఉంటాయి. ప్రతి సద్గురువు కొన్ని దీక్షలు అందిస్తాడు. తాను చెప్పిన దీక్షాయుతమైన జీవితం జీవించేవారికి ఆ మార్గంలో తారణము ఉంటుంది. అందరు సద్గురువులు కూడా వారు చూపించే యోగమార్గానికి కొన్ని దీక్షలను ఇస్తారు. ఆ దీక్షకు కట్టుబడి ఉండేవారికే ఆ యోగము సాగుతుంది. దీక్షకు కట్టుబడకపోతే సాగదు. అంటే నిన్ను నీవు ఆ మార్గానికి సమర్పణ చేసుకుందామా, వద్దా అనేది నీకుగా నీవు నిర్ణయం చేసుకోవాలి. నిర్ణయం చేసుకున్నప్పుడు ఆ మార్గంలో వెళ్ళటానికి కావలసిన నియమాలు నీవు పాటించాలి. ఆ నియమాలు తూ.చ. తప్పకుండా పాటిస్తుంటే ఈ యమ, నియమాది, ఆసనాది అంగములన్నీ కూడా అప్రయత్నంగా నీకు సిద్ధిస్తూ వస్తుంటాయి.

దీక్షలేని వారి చేత ఏమీ చేయించలేరు. దీక్ష ఎటువంటిదంటే పశుప్రాయము, పశుప్రవృత్తి కలిగిన మన మనస్సుకి, శరీరమునకు ఏం కావాలో దాని కోసమే పని చేస్తుంది. మనస్సు, బుద్ధి జీవునకు ఏం కావాలో చూస్తుంది. జీవుడు శరీరాన్ని తీసుకున్నది తన కర్తవ్యం నిర్వర్తించడానికి వచ్చాడు. శరీరంలోకి దిగిన దగ్గర్నించీ శరీరం తన పనులు చేయించుకుంటూ ఉంటుంది. మన పనులు చేయించుకోవటానికి మనం ఒక పనివాడిని పెట్టుకుంటే, పనివాడు వాడి పనులు మన చేత చేయించుకుంటున్నాడు. ఎట్లా ఉంటుంది?

యజమాని పనివాడు అయిపోయాడు. పనివాడు యజమాని అయి పోయాడు. తల క్రిందులు అయిపోయింది. అందుచేత మళ్ళీ మనం సరిచేసుకోవటానికి ఒక దీక్ష. ప్రతివారికి దీక్ష అనేది ఇస్తారు. దీక్ష ఏమిటి? పశువుకి ముక్కుకు త్రాడు వేసినట్లు. ఎద్దు ఉన్నది. "ఎద్దల్లే అలా తిరుగుతూంటావు" వాడు దున్నపోతల్లే తిరుగుతూంటా డండి అంటాము. అంటే ఏమిటి? ఏ గమ్యము లేక బ్రతుకు తూంటాడు. ఆ ఎద్దు చేత అద్భుతమైన సత్కార్యాలు చేయించవచ్చు కదా! ఎలా చేస్తావు. ఎద్దు ముక్కుకి తాడు ఎక్కించాలి కదా! దానికి మెడ మీద దున్నటానికి కావలసిన పరికరములు పెట్టాలి. ఇంకో ఎద్దుని తోడు చేయాలి. రెండింటి చేత దున్నించుకోవాలి. అపుడు పొలం పండుతుంది. అలాగే ఎద్దుకి తాడు వేసినా, గుఱ్ఱానికి కళ్ళెం వేసినా, కుక్క మెడకి గొలుసు వేసినా ఈ విధంగా మనం శిక్షణ ఇస్తాం కదా! ఊరకుక్కకి, జాతికుక్కకి తేడా లేదూ? ఏది జాతి కుక్క, ఏది ఊరకుక్క? శిక్షణ పొందింది జాతికుక్క. శిక్షణ లేనిది ఊరకుక్క.

చిన్నప్పట్నుంచి కుక్కని పెంచే వారు ఆ కుక్కకేదో ఒక చోట అల్పాచమనం చేయించి, అది వాసన చూపిస్తే ఎప్పుడైనా అక్కడికే వెళ్ళి పోస్తుంది. అల్పాచమనం అక్కడే వదులుతుంది. అలాగే మలమూత్రాదులు కూడా. ఇంట్లో ఎంతదూరం వరకు రావచ్చు. ఎంతవరకూ రాకూడదు దానికి అలవాటు చేస్తే అదే అలవాటవు తుంది. రమ్మన్నా రాదు. అలాగే దానికి ఆహారము ఒక చోట పెడితే అక్కడే తింటుంది. కూర్చోమంటే కూర్చుంటుంది. నించో మంటే నించుంటుంది. బంతి వేస్తే తీసుకువస్తుంది. ఇవన్నీ ఎలా

వచ్చాయి కుక్కకి. దానంతట అవే వచ్చేశాయా? రాలేదు కదా! ఆ జంతువు ఎటువంటిదో నీ శరీరం అటువంటిది. అందుచేత దీనికి ఒక దీక్షాబద్ధమైన పద్ధతి ఇవ్వాలి. అది ఇస్తేనే యజమానికి లొంగు తుంది. అది ఇవ్వకపోతే లొంగదు. అందుచేత సద్గురువులు ఏం చేస్తారంటే దీక్ష చాలా క్లుప్తంగా ఇస్తారు. ఎక్కువ ఇవ్వరు. ఎందుకంటే ఏదో రెండో, మూడో చేస్తే, చేద్దాం అన్న ఉత్సాహం వస్తుంది తప్ప వంద చెప్పాం అనుకోండి మళ్ళీ రాదు. 2, 3 కనుక మనం నిజంగా దీక్షగా చేస్తుంటే ఏం జరుగుతుందంటే మనలోంచి స్ఫూర్తి పుడుతుంది. ఇంకోటి చేద్దాం, ఇంకోటి చేద్దాం అని మనం పెంచుకుంటాం. ఎందుకని?

దీక్షలోంచి వచ్చే స్ఫూర్తి కారణంగా నీకుగా నీవు పెంచు కుంటావు. నియమాలు పెంచుకుని చేసుకుని, నీకిష్టమైంది కదా! ఇష్టమైతే కష్టం లేదుగా. ఇష్టం లేకపోతే అంతా కష్టమే. ఇష్టం ఉంటే అది ఎంత కష్టమైనా కష్టమే కాదు. అమ్మాయి పెళ్లికి మూహూర్తం రాత్రి 2 గంటలకట అంటే ఏ కష్టం ఉండదు. ఎందుకంటే అమ్మాయి పెళ్లి కదా! లేకపోతే ఇంట్లో వాళ్ళకెవరికో చావుబ్రతుకుల మీద ఆసుపత్రిలో ఉన్నారు. మనం అహర్నిశలూ అక్కడ కూర్చుని జాగ్రత్తగా చూసుకోవాలనుకోండి అంటే కష్టం అన్పించదు. ఇంకా ఎవరికోసమో రాత్రి 2 గంటలకి వెళ్ళి సికింద్రాబాద్ స్టేషన్‌లో వాడిని తీసుకురావాలట అంటే చాలా కష్టంగా ఉంటుంది. ఇష్టం లేదు కదా! అందుచేత సద్గురువు ఏం చేస్తాడంటే ఇష్టపడే పద్ధతిలో కొంత దీక్ష ఇస్తాడు. దానిని నీవు చక్కగా శ్రద్ధాభక్తులతో నిర్వర్తిస్తూంటే అందులోంచి నీవే పెంచు

కుంటుంటావు కార్యక్రమం. ఎవరూ పెంచరు. ఎందుచేత? స్ఫూర్తి కలగటం చేత రప్పించుకుంటావు. అలా నీవు ముందు ఈ శరీరాన్ని నీ ఆధీనంలోకి తీసుకుని నీ బుద్ధి వలన నీ మనస్సు నడిచేట్లుగా నీవే ఏర్పాటు చేసుకోవాలి. అది మొదటి మెట్టు.

అప్పుడు ఆ స్థితిని 'స్థిరసుఖమాసనమ్' అంటారు. అంటే మనస్సు స్థిరంగా బుద్ధి చెప్పినట్లు వింటుంది. ఇక్కడ కూర్చో మాట్లాడకుండా అంటే కూర్చుంటుంది. అంతటితో అయిపోలేదు యోగం. అక్కడ్నుంచి ప్రారంభం. అంతం కాదిది ఆరంభం అంటాం చూసారా! అపుడు ప్రారంభం అవుతుంది అసలు కథ. అపుడేం చేయాలి? ఆ మనస్సుని లోపలికి తెచ్చుకోవాలి. లోపలికి ఎట్లా వెళ్ళాలి? నీలో జరిగే ప్రాణప్రవృత్తుల ఆధారంగా ఉచ్ఛ్వాస నుండి లోపలికి వెళాతావు. మళ్ళీ నిశ్శ్వాస నుండి బయటకు రావటం. అక్కడ మనం నాలుగవ అంగంలోకి ప్రవేశిస్తాం. మాస్టరుగారు యోగం గురించి అవగాహన ముందు ఇచ్చి, దీన్ని ఏ విధంగా సులువు చేసి ఇచ్చారు అనేది చెప్పుకోవాలి. అంతా ఒక్కసారే చెప్పటానికి కుదరదు. అందుచేత ముందు యోగం అన్నది ఏమిటో తెలుసుకుంటే అది సి.వి.వి. గారు ఏ విధంగా సులభం చేసి ఇచ్చారో మనం తెలుసుకోవచ్చు. అందుచేత ఈ విధంగ ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు చేస్తూ ప్రాణాయామం చేసేస్తున్నాం అనుకోబోకండి. ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసల ఆధారంగా నీవు ముందుకు సాగితే ఒక స్థితిలో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలు ఆగిపోతాయి. ఆగిపోవటం ప్రాణా యామము. ప్రాణం నియమింపబడినది Prana regulated. ఇటు వంటి రహస్యాలు ఆదిశంకరులు ఇచ్చారు. అదే విధంగా మనకి

మళ్ళీ మాస్టరుగారు ఇచ్చారు. 'స్థిరసుఖమాసనమ్' అంటే మీరు ఎన్ని పుస్తకాలు వెతుక్కున్నా ఏముంటుందో తెలుసా? స్థిరంగా సుఖంగా ఉండేటువంటి ఒక పద్మాసనమో, వీరాసనమో బాసింపట్టు వేసుకుంటాం అట్లా కూర్చోవటం అనుకుంటాం. అది కాదు స్థిరసుఖమాసనమ్. అది The reference is not to the Physical body. ఇది మూడో అంగం కాబట్టి యమ, నియమములు మనస్సుకి సంబంధించినవి. శరీరము, ఇంద్రియములకు సంబంధించినది. ఆ మనస్సుకి స్థిరము, సుఖము రావటం అనేది మూడో అంగం. మనస్సుకి స్థిరము, సుఖము వస్తే నువ్వు నేల మీద కూర్చున్నావా? కుర్చీలో కూర్చున్నావా? పడుకుని చేసుకుంటూన్నవా? సాధనలో పడుకోవటం, కూర్చీలో కూర్చోటం మనస్సుకి లేవు. శరీరానికి యోగం నీ ప్రజ్ఞలో ఉంది. నీ ప్రజ్ఞ ఎక్కడుంది? నీ మనస్సులో ఉంది.

మనస్సులో ఉన్న ప్రజ్ఞని నీవు ఏం చేయాలి? బుద్ధిలోకి ప్రవేశపెట్టాలి. దానికి సద్గురువు సహకారం అందిస్తాడు. అందుచేత ఎందులో కూర్చున్నావు అనేది ఏం చెపుతారంటే మనస్సు వెళ్ళి హృదయంలో కూర్చోవాలి. అది స్థిరము, సుఖము అయినటువంటి ఆసనము అని చెపుతారు. మీరు ధ్యానయోగం తీసుకుంటే భగవద్గీతలో కొంచెం ఎత్తైన ప్రదేశంలో అంటారు. ఏమిటది ఎత్తైన ప్రదేశం. మనం ఉండేది మూలాధారంలో. హృదయము ఎత్తైన ప్రదేశం. సమతులంగా ఉండేట్లుగా చూసుకుని ఒంటరిగా, ఒంటరియై లోపలికి వెళతాను కదా! రహస్యంగా ఏకాకివై ఎత్తైన ప్రదేశంలో కూర్చుని ధ్యానం చేయమంటాడు. ఎత్తైన ప్రదేశం

అంటే ఎత్తైన పీట వేసుకుని అని కాదు. ఎందుకంటే స్థూలమైన అర్థాలు చాలా కన్పిస్తాయి. నీలో బుద్ధి ప్రచోదనం జరుగుతున్న కొద్దీ రహస్యాలు తెలుస్తాయి. అందరికీ పుస్తకాలు చదివినంత మాత్రాన అన్నీ అర్థమైపోవు. భగవద్గీత మహాత్ములు చదువుకుంటే ఒకలా ఉంటుంది. మామూలు వాళ్ళు చదువుకుంటే ఒక రకంగా ఉంటుంది. అదే సాధకుడు చదువుకుంటే వాడికి అపుడేది అవసరమో అది కనిపిస్తుంటుంది. మన మాస్టరుగారికి కూడా పరమగురువులు, ఆయన భగవద్గీత ఈ మూల నుంచి ఆ మూల వరకు పిండికొట్టినట్టు నాకంతా వచ్చు అన్నా. మళ్ళీ చదువు అని చెపుతారు.

ఆయన మళ్ళీ చదివితే ఆ దారి వేరు. సద్గురువు స్పర్శ వలన కనిపించేది వేరు. అందుచేత స్థిరము, సుఖము అయిన ఆసనము, అదే ఇపుడు మనకి Transcendental Meditation అంటారు. స్థిరముగాను, సుఖముగానున్న మనస్సు మాత్రమే ప్రాణముల మీద నిలుపగలవు. స్థిరంలేని మనస్సు ప్రాణం మీద నిలిపితే మాత్రం ఉంటుందా? నాలుకకి అప్పచెపుతుంది. పోతుంది కదా! మనం అష్టోత్తర శతనామాలు చదివినా అక్కడ నిలవదు మనస్సు. 24 నామాలతో కూడినటువంటి కేశవనామాలు చదివినా 24 నామాలు చదివే వరకు మనస్సు అక్కడ ఉంటుందా? ఉండదు. 24 నామాలు ముందు సాధన చేయండి. అంతసేపు అక్కడ ఉంచండి. ఒక పాట పూర్తిగా వినేంతవరకు మనసు ఆ పాట మీద పూర్తిగా ఉంటుందా? మరి స్థిరము సుఖము అంటే అట్లా ఉండిపోవాలి. అది ముందు ఏర్పాటు చేయండి. ఏర్పాటు

చేసినటువంటి మనస్సు, అటువంటి మనస్సుని మీరు ఇలా చేయండి, అలా చేయకుండా కూర్చోండి ఫర్వాలేదు. అదే ప్రాణ ప్రవృత్తి నీలోనూ జరుగుతోంది కదా! మనం చేయకుండా మనలో జరిగేది ఇది ఒకటి ప్రస్ఫుటంగా కన్పిస్తోంది కదా! మనం చేయట్లేదు. మనలో జరుగుతోంది. మనలో జరిగేది ఒకటుంటే అది ఆధారంగా చేసేవి మనలో చాలా ఉన్నాయి కదా! అరే మనం చేయకుండా జరుగుతోందే ఎవరు జరిపిస్తున్నారు అన్న ప్రశ్న ఒకటి వస్తుంది.

మనస్సుకి కుతూహలం ఎక్కువ. అందుచేత ఇది జరిపించేది ఎక్కడ ఉన్నది అని దాని వెంటపడిపోతాడట. అది యోగము. అలా వెంటపడిపోతే లోపల ఉచ్ఛ్వాస నిశ్వాసలు నిర్వహించే కేంద్రం ఒకటి గోచరిస్తుంది. ఆ కేంద్రం దగ్గరికీ మాటిమాటికీ వెళుతూంటాడు. అక్కడ ఏ ప్రజ్ఞ దాన్ని నడిపిస్తోంది అని తెలియ టానికి ఈ శోధన. ఈ శోధన, పరిశోధన మనస్సుకి కావాలంటే మనస్సుకి ఇతరములైన విషయాల మీద కన్నా దీని మీద ఆసక్తి పెరగాలి. ఆసక్తి పెరగాలంటే అతను తీసుకున్న దీక్షని నిర్వర్తించే పద్ధతుల్లో ఆసక్తి వస్తుంది. దీక్ష ఎటువంటిదంటే ఒక యజ్ఞశాలలో మష్టి అని చెప్పి ఒక గుంజ నాటుతారు. ఆ గుంజకు పశువును కడతారు. అటుపైన యజ్ఞం అంతా అయిన తర్వాత పశువుని బలి ఇస్తారు. ఇదంతా సంకేతార్థం అంటే నీ శరీరము, ఇంద్రియ ములు, మనస్సులతో కూడిన వాహనం పశువు దాన్ని అక్కడ పాతాలి. ఆ గుంజకి కట్టాలి. గుంజకి కడితే పశువు ఎంతో దూరం పోదు. అందుకని దీక్ష.

గుంజకి కట్టకపోతే నీవు తెల్లవారి చూసేసరికి గేదె అక్కడుండదు. ఎక్కడికో వెళ్లిపోతుంది. అందుచేత గుంజకి కట్టి దానికో తాడు ఏర్పాటు చేస్తే అది పరిధి దాటిపోదు. అది అక్కడే తిరుగుతుంటుంది. అక్కడే మేస్తూంటుంది. అలా జీవుడు ఎక్కడకి పడితే అక్కడికి విచ్చలవిడిగా వెళ్ళిపోకుండా తనను తాను నియమించుకోవటానికి దీక్ష అనే గుంజకి కట్టుకోవాలి. అప్పుడు అన్నిచోట్లకూ వెళ్ళడు, అన్నీ కావాలనుకోడు. ఎంతవరకు తన సాధనకు అంతరాయం కలగకుండా కార్యక్రమాలు జరుగుతాయో అంతకు మించిపోడు. అంటే ఆ పరిధిని దాటిపోడు, అది దీక్ష. అందుకనే ఆ దీక్షని పొందుతున్నటువంటి మనస్సు శిక్షణ పొందింది కాబట్టి క్రమశః స్థిరము, సుఖము అయిన ఆసనం పొంది అది ఆధారంగా అంతర్ముఖం అయితే, అంతర్ముఖంలో ఈ హృదయం అనే ఒక గుహ ఉన్నది. అందులోకి అతడు ప్రవేశించటానికి ప్రాణములు ఆధారంగా లోపలకి వెళ్ళటం, బైటకి రావటం చేస్తూ కుతూహలం కలగటం చేత అక్కడ వేచి ఉంటాడు. అక్కడ ఆసక్తి కలిగినకొద్దీ, మనస్సు కరుగుతున్నకొద్దీ శ్వాస కూడా తగ్గుతూ వస్తుంది. సూక్ష్మము అయిపోతుంది. అందుకని మహాత్ములకి మిగతా వాళ్ళలాగా శ్వాస బుసలు కొడుతున్నట్లు ఉండదు. బాగా రజోగుణంతో ప్రపంచాన్ని దున్నేయాలి, పూడ్చేయాలి అనుకున్న వాళ్ళ శ్వాస బుసలు కొడుతూ ఉంటుంది. ప్రశాంతంగా ఉన్న జీవుని శ్వాస ప్రశాంతంగా అసలు జరుగుతోందా అన్నట్లు ఉంటుంది. అది ఎలా ఉంటుందంటే, మరీ మహాత్ముల శ్వాస నాడి చూస్తే అసలు అందదు కూడా. అంత సూక్ష్మంగా కొట్టు

కుంటుంది. ప్రాణము సూక్ష్మస్థితిలో ఉన్నది, కారణ స్థితిలో కూడా ఉన్నది. అన్ని లోకములలోనూ ప్రాణము ఉన్నది. అందుచేత మనస్సు కరిగి హృదయంలోకి ప్రవేశిస్తున్న కొలది శ్వాస కూడా తగ్గుతుంది. స్పందనము బాగా పెరుగుతుంది. అక్కడ ఉండే ఆ గుహలోకి ప్రవేశిస్తే అక్కడ ఉండే అనుభూతే నీవొక బంగారు రూపంలో ఉన్నట్లుగా గోచరింప చేస్తుంది. అప్పుడు నీవు మనస్సుని దాటి బుద్ధిలోనికి ప్రవేశించిన వాడివి అవుతావు. అది ఒక వంతెన.

అపుడు నీవు హృదయంలో కూర్చుని శిరస్సు, మీదనున్నటు వంటి అక్కడ ఒక గుహ ఉన్నదట. పెద్దలేం చెప్పారంటే ఇది ఎలుగుబంటి గుహ (శిరస్సు). సప్తఋషులు అందరూ అక్కడున్నారు. ఇదేమో సింహపు గుహ (హృదయం) ఇపుడు చూడండి శమంతక మణి కథలో సింహాన్ని చంపి ఎలుగుబంటి. మళ్ళీ అక్కడికి వెళ్ళిపోతే ముందు గుఱ్ఱంమీద బయలు దేరుతాడు కదా! గుఱ్ఱం, సింహం, ఎలుగుబంటి– గుఱ్ఱం అంటే ప్రాణము. సింహం చంపేస్తుంది అంటే అక్కడకు వెళ్లేటప్పటికి ఆ ప్రాణములు హరింపబడ్డాయి. అక్కడ నుంచి సింహం ప్రయాణం చేస్తూంటే ఎలుగుబంటి దాన్ని మింగేసింది. మింగేసి గుహలో పెట్టిందట మణి. ఈ కథ అంతా కూడా మనకి సంబంధించిన కథే.

శిరస్సు నందు దైవం ఉంటాడు. అది అతని స్వస్థానం దైవమునకు హృదయం జీవుని యొక్క స్వస్థానం. మూలాధారం దేహాత్మకి స్వస్థానం. దేహాత్మ, జీవాత్మ, పరమాత్మ ఇవి మూడూ మనకి మూలాధారం, అనాహతం, సహస్రారం ఇలా ఏర్పడు తున్నాయి. అందుచేత మనం ఇక్కడ నుండి ఇక్కడికి చేసే

ప్రయాణం. అప్పుడు జీవుడు దైవంతో యోగం చెందటానికి చేసే ప్రయాణంగా ఉంటుంది. అపుడు నీకు లోనుండి రకరకములైన జ్ఞాన, విజ్ఞానములు అన్నీ అంతర్ముఖంగా స్ఫురిస్తూ వస్తూంటే, బహిర్ముఖంలో గ్రంథాలలో అవి మనకి Confirmation దొరుకు తూంటాయి, నిర్ధారణ జరుగుతుంటుంది. రకరకముల అనుభూతులు కలుగుతాయి. అంతకుముందు కలిగే అనుభూతులు కేవలం వ్యామోహము, భ్రమ, భ్రాంతియే. అనుభూతులు మామూలుగా, మనం ఇపుడు చేతిలో ఒక పుష్పము పట్టుకుంటే ఎంత స్పష్టంగా మన చేతిలో ఉన్నదన్పిస్తోందో అంత స్పష్టముగా అనుభూతులు కలిగినవారు, ఈ అనుభూతి నిజమేనా అని అడిగే పరిస్థితి ఉండదు. ఎందుచేతనంటే మధ్యాహ్నం భోజనం చేశానా అని నేను మిమ్మల్ని అడిగితే ఎట్లా ఉంటుంది. చేశానో, లేదో నాకు తెలుసుగా. అందుచేత ఆ అనుభూతి కూడా అంత స్పష్టంగా ఉంటుంది, సుస్పష్టంగా ఉంటుంది. ఆ అనుభూతిలోకి ప్రవేశించినవాడికి ఇక ఈ లోకం అంతా కూడా ఏదో పిచ్చిలోకంగా ఉంటుంది. కర్తవ్యం మేరకు బయటకి వస్తూంటాడు. ఆ విధంగా ముందుకు సాగిపోతున్న కొద్దీ రంగు మారుతూ ఉంటుంది.

బంగారు రంగు నెమ్మదిగా కాంతివంతమైన, ఇంకా కాంతి వంతమైన తెలుపు, నీలం అయిపోతూ ఉంటుంది. ఆ ఊర్ధ్వముఖం చెంది ఇక్కడ నుండి బైటకి వచ్చేస్తాడు. వచ్చేసి తనొక చతుర్భుజమైనటువంటి రూపంగా విష్ణుమూర్తిలా కన్పిస్తాడు. అంటే ఈ జయ విజయులు కూడా విష్ణుమూర్తి రూపాలుగానే ఉంటారు. అపుడు తనకి తను స్వస్వరూప సంధానమున అనుభూతి, అటుపైన

బ్రహ్మత్వానికి ప్రయత్నం. ఈ లోపల ఈ శరీరం నుండి బయటకి రావటం తెల్సి తనకి తను దర్శనం ఇస్తాడు. అంటే తాను అది అయి, శరీరం వేరుగా కన్పిస్తుంది. రమణమహర్షికి ఆ విధంగా జరిగింది. యోగులందరికీ అలాగే జరుగుతుంది. అలా బయటకి వచ్చి ఇతరదేహాల్లో ప్రవేశించి కార్యక్రమం నిర్వర్తించిన మహత్తర యోగి ఆదిశంకరులు. పరకాయప్రవేశ విద్యలు ఇవన్నీ యోగంలో భాగం. అందుచేత మన కథ ఎక్కడ నుంచి అంటే దేహాత్మ భావన లోంచి ముందు జీవాత్మ భావనలోకి ఉద్ధరింపబడి, జీవాత్మ భావన లోంచి, శరీరం లోంచి బయటకు వచ్చి అక్కడ నుంచి బ్రహ్మ లేక పరతత్త్వం చేరటం. అందుచేత మాస్టరుగారు ఏమిచ్చారంటే అందరికీ అమరత్త్వం, అందరికీ బ్రహ్మత్త్వం అన్నారు. అది ఉద్దేశింపబడి ఉన్నది సృష్టిలో. అందుకొరకే సృష్టి కూడా. అందుచేత ఆ విధంగా మనం యోగాన్ని ముందుగా అవగాహన చేసుకోవాలి. ఈ మార్గాన్ని నడిపించడానికి సద్గురువులు వస్తారు. అది రుచి చూసినవారు, వారిలో ఉద్భవించే అవ్యాజమైన ప్రేమ, దయ, కరుణ కారణంగా. ఎందుచేతనంటే మంచి సినిమా చూస్తే మనవాళ్ళని కూడా తీసుకు వెళదాం అనుకోము? మంచి దోశ ఒక హోటల్‌లో తింటే వచ్చే ఆదివారం నా భార్యని, పిల్లలని కూడా తీసుకువచ్చి దోశ తినిపించాలి అనుకోమూ? అనుకుంటాం. మనవారు కదా !

మరి బ్రహ్మమును స్పృశించి, బ్రహ్మాన్ని అనుభూతి చెందిన వారికి మనవారంటే సృష్టి జీవులందరూ మనవారే. అందుచేత ఆయన తాపత్రయ పడతాడు. వాళ్ళకు తాపత్రయం ఉంటుంది. ఏమిటి వాళ్ళ తాపత్రయం, ఇంత అపరిమితమైన ఆనందం

వీళ్ళందరికీ పంచాలి. ఆ పంచటానికి వాళ్ళు దిగి వస్తారు. అలా దిగివచ్చిన వారే మాస్టర్ సి.వి.వి. ఒక మహత్తరమైనట్టి వెలుగు. వారు 42వ సంవత్సరంలో ఏదో తోకచుక్క ముట్టుకుంటేనో, లేకపోతే రెండోసారి పెళ్ళి చేసుకుంటేనో జ్ఞానం వచ్చిందని చెపుతుంటారు. అంతకన్నా భయంకరమైన వాక్యాలు ఎక్కడా ఉండవు. అది పరిపూర్ణ అజ్ఞాన పూరితము. ఆయన ఒక దివ్యమైన ప్రణాళికను గ్రహించి వచ్చారు. అగస్త్యమహర్షి గురించి మీకేం చెప్పాలి. "అగస్త్యో *భగవాన్ ఋషిః*" అగస్త్యుడు చేయలేని పని ఏముంది? అవతారమూర్తి అయిన రాముడికే సహాయకారిగా నిలబడతాడు. విష్ణు ధనుస్సు రాముడికి అగస్త్యుడు ఇచ్చాడు. ఎన్నో అస్త్రాలు, శస్త్రాలు ఇచ్చాడు, చిట్టచివరికి ఉపదేశం ఇస్తాడు. అగస్త్యుడు ఎప్పుడూ సృష్టిలో అత్యవసర పరిస్థితుల్లో దిగివచ్చినట్టుగా మనకు కన్పిస్తుంది. అగస్త్యమహర్షి కథ ఎప్పుడూ చదువుకోవాలి. ఆయన ఎప్పుడు సృష్టిలో కొంత పనిచేసి వెళ్ళారో అని చూస్తే అది అత్యవసర పరిస్థితి కలిగినపుడే ఆయన వస్తారు. మిగతా సమయాల్లో సప్త ఋషులు పని చేస్తూంటారు.

అందుకనే మీరు ఋషిపంచమి నాడు సప్త ఋషులకు వారి భార్యలకు, లోపాముద్ర అగస్త్య మహర్షులకు షోడశోపచార పూజ చేస్తారు. అలా చేసేటప్పుడు చేసే ప్రతి ఉపచారము ముందు సప్త ఋషులకు చేసి తిరిగి లోపాముద్ర అగస్త్యమహర్షులకు ప్రత్యేకంగా మళ్ళీ చేస్తారు. ఆ ఏడుగురూ, ఈ ఒక్కరూ తూకంలో వేస్తే ఆ ఏడుగురికీ ఈయన ఒక్కరూ సమానం అని చెపుతారు. మనకి కథలు కూడా ఉన్నాయి. అట్లా పార్వతీకళ్యాణం, అపుడు మొత్తం

సప్తఋషులందరూ, దేవతలు, కిన్నెరలు, కింపురుషులు, గంధర్వులు, యక్షులూ అందరూ వచ్చారు. చాలా సంతోషంగా, సందడిగా జరుగుతుంటే అపుడు ఎవరో ఒకరు రానివాళ్ళని చూస్తుంటాం కదా మనం! పెళ్ళి ఇంట్లో ఉన్న నలుగురు సభ్యుల్లో ముగ్గురు వచ్చారనుకోండి! వచ్చిన ముగ్గురి సంగతి ఎవరికీ అక్కర్లేదు. ఆ రానివాడి సంగతి అడుగుతారు. ఆయన రాలేదా అంటారు. ముగ్గురం వచ్చాం కదా! అది చూడడు. వచ్చినవాడి సంగతి ఎలాగూ వచ్చాడు కదా పెళ్ళికి చూసేదేమిటి? రానివాడి సంగతి అంటాడు.

అలాగే అగస్త్యుడు రాలేదు అన్నమాట వస్తుంది. అగస్త్యుడు రాలేదు. శంకరుడికే పెళ్ళి జరుగుతూంటే అగస్త్యుడు రాలేదు అనే మాట ఆ నోటా, ఈ నోటా పరమశివుడి వరకూ వచ్చింది. ఆయన వస్తే మనం ఉండమయ్యా సృష్టి అంతా కలిసి పోతుంది. ఆయన అటు దక్షిణంలో కూర్చుంటే, మనం ఉత్తరంలో ఈ కార్యక్రమం చేసుకోవచ్చు. తక్కెడలో ఒక పక్క రాళ్ళు వేసి ఇంకో పక్క వంకాయలు వేస్తే రాయి తీసేస్తే ఏమవుతుంది? వంకాయలున్న తెక్కడ క్రింద పడిపోతుంది. అందుచేత ఉత్తరము సప్త ఋషులతో నిర్వర్తింపబడుతుంటే దక్షిణము అగస్త్యునితో నిర్వర్తింపబడుతుంది. అందుకనే ఆయన దక్షిణానికి వెళ్ళి కూర్చున్నాడు. దాక్షిణ్యమూర్తి అపుడప్పుడు మరీ భయంకర పరిస్థితి వచ్చినప్పుడే కదులుతాడట. మరి వింధ్యపర్వతం అంటే మన బొడ్డు అది అలా పెరుగుతూంటే అంటే పై భాగం పెరిగింది. కింద భాగం పెరక్కుండా అది ఆపేస్తోంది సూర్యరశ్మి పడకుండా అగస్త్యుడు వచ్చి దాన్ని నియమించి కింద దక్షిణాన ఉన్నాడు అని చెబుతారు.

అందుచేత అదే విధంగా కాలకేయులనే రాక్షసులు రాత్రంతా విధ్వంసం చేసి పగలెల్ళి సముద్రంలో దాక్కుంటూ ఉంటే ఎవరూ వాళ్ళని సంహరించ లేకపోతారు. రాత్రి వచ్చి అందర్ని సంహరించి సముద్రంలోకి వెళ్ళిపోతారట తెల్లవారేలోపల. ఎలా వాళ్ళతో యుద్ధం చేయాలో తెలియక చివరికి ఏమన్నారంటే సముద్రం నీరంతా ఎవరన్నా తాగేస్తే అప్పుడు వెళ్ళి వారిని సంహరించవచ్చు. ఆ తర్వాత మళ్ళీ నీళ్ళన్నీ అందులోకి వదిలేయాలట. అపుడు అగస్త్యుడు వచ్చి ఆ నీరంతా పీల్చాలని (త్రాగాలని) ప్రార్థన చేస్తే, ఆ నీరంతటినీ పుక్కిట పట్టాడట ఆయన. నేను నోట్లో పెట్టుకుని ఉంటాను. మీరు వాళ్ళని సంహరించండి. మళ్ళీ నేను సముద్రాన్ని ఉమ్మేస్తాను అని చెప్పినవాడు అగస్త్యుడు. అంటే సృష్టికి విపత్కర పరిస్థితుల్లో వస్తూంటాడు. అట్లా విపత్కర పరిస్థితి వచ్చింది. ఏమొచ్చిందంటే కుంభయుగం వచ్చింది. మనుష్యులు మాత్రం ఇంకా నాసిగా ఉన్నారు. కుంభయుగం అంటే ఏమిటో తెలుసా! కుంభరాశి అంటే వాయుతత్త్వపు రాశి. మనిషి గాలిలో ఎగరాలి వాడికి వాడుగా. విమానాల్లో ఎగరటమే కాదురా! మీరు ఎగరవచ్చు అని చెప్పారు. మాస్టరు సి.వి.వి. గారు.

అందుకని అలా ఎగిరే ఒక కాలం వచ్చింది. మన పురాణా లలో ఉంటాయి. ఆయన ఎగురుకుంటూ వెళ్ళాడని. ఎగురుకుంటూ వెళ్ళటం ఎట్లా వీలు పడుతుంది? యోగవిద్య ద్వారానే వీలుపడు తుంది. మనుష్యులు ఎగిరి తిరిగే సమయం వచ్చేసింది. వీళ్ళు ఏమో నేలమీద పాకుతూ ఉన్నారింకా. మరి ఈ సమయంలో ఏం చేయాలి, అంటే పరిణామ కథ ఓ పక్క గురుపరంపర నడుపు

తున్నప్పటికీ మనం కొంచెం వెనకబడి ఉన్నాము. చూడండి వెనకబడి ఉన్న పిల్లలకి Special Class పెడతాం కదా! 9వ, 10వ తరగతులకు Special Classes? అటుపైన ఇంజనీరింగ్ EAMCET లోకే వెళ్ళటానికి Special Classes? అంటే Special Classes లు పెట్టాల్సిన పరిస్థితి. తొందర తొందరగా వీళ్ళందర్నీ తరమటానికి కొంత అవసరం కుంభయుగంలో ఏర్పడింది. కుంభయుగం 1875 లో ప్రవేశించింది. జ్యోతిష్యపరంగా తీసుకుంటే అప్పట్నించి కుంభయుగం. అంతకు ముందు మీనయుగం. కుంభ యుగం అంతా వైజ్ఞానికమైన యుగం. 2160 సంవత్సరములు ఉంటుంది. 2160 సంవత్సరాలలో మనిషి యొక్క పరిణామ కథ చాలా వేగవంతమయినది. నువ్వు ఊహించనటువంటి వేగవంతం. ఎందుకంటే శతాబ్దాల పాటు జరగని పరిణామం దశాబ్దంలో జరుగుతోంది. శతాబ్దాల పరిణామం దశాబ్దంలో అయ్యేట్లుగా తయారైంది. అంతేకాదు దశాబ్దాల పరిణామం సంవత్సరాలలో జరుగుతాయి. అంతేకాదు పది జన్మల పరిణామం ఒక్క జన్మలో జరుగుతుంది. అది ఇప్పుడున్న కథ. మొత్తం అంతా వేడెక్కిపోయింది. వేగమెక్కువైంది. కారణాలు చాలా ఉన్నాయి. దీని వెనకాల సృష్టి కథ ఒకటి ఉన్నది. సృష్టి కథలో భాగంగా మహాత్ములు దిగివస్తారు. అంతేకాని వెంకమ్మగారిని పెళ్ళి చేసుకునేసరికి ఆయనకి యోగం వచ్చింది. అదేదో తోకచుక్క ముట్టుకుంటే అంతవరకూ ఏదో మనలాంటి వాడు ఇట్లా చెప్పుకుంటూ ఉంటే కొంచెం దుఃఖంగా ఉంటుంది. ఎందుచేతనంటే దీనికి సంబంధించిన వాఙ్మయం అంతా కూడా తమాషాగా దివ్యజ్ఞాన సమాజానికి చెందిన ఇద్దరు ఉపాసికలు వారికిచ్చారు. వారు ముందే వ్రాసి ఉంచారు. ఈ మాస్టరు సి.వి.వి.

గారికి వ్యాఖ్యానం చెప్పాలంటే దానికి పుస్తకాలు, వేరే గ్రంథాలలో, వేరే దేశాలలో, వేరే భాషల్లో ఉన్నాయి. మీకు నా గురించి ఏం తెలియదు. అంతా పాశ్చాత్యుల దగ్గర్నుంచి మీ దగ్గరికి వస్తుంది. అపుడు మీరు ఆశ్చర్యపోతారు. అందుచేత ఆయన వినూత్నంగా కొత్త పద్ధతిలో మనకి కొంత త్వరితగతిన మనలో పరిణామం జరగటం కోసం, ఎటువంటి వాడినైనా త్వరగా మెరుగు పెట్టేస్తారు. అలా ఒక యోగ విధానం మాస్టరు సి.వి.వి. గారు ఇచ్చారు. అది మనకు అనుభూతి నిస్తుంది. మనకి ఉత్తీర్ణత కలిగిస్తుంది. అర్థంలేని చదువు వ్యర్థం, అలాగే అర్థం తెలియకుండా యోగం ఏం చేస్తున్నామో తెలియకుండా యోగం అంటే ఎట్లా? తెలుసుకుని చేయటం అనేది కుంభయుగపు మొదటి లక్షణం. తెలియకుండా యాంత్రికంగా చేయటం కుదరదు. ఎందుకు చేస్తున్నావని పిల్లవాడు అడిగితే నువ్వు చెప్పలేకపోతే వాడు చేయడు కదా! మనం చాలా విషయాలు ఎందుకు చేస్తున్నాం అంటే కుదరదు. పెద్దవాళ్ళు చేస్తే నువ్వు చెయ్యాలా? అని అడుగుతున్నారు. ఎందుకు చేస్తున్నావో తెలియకుండా చేస్తున్నావేమిటి మూర్ఖుడివి అన్నట్లుగా ఉంటుంది. అందుచేత అర్థవంతంగా యోగమును నిర్వర్తించుకోవాలి. ఏ శిష్యుడైనా అతని సద్గురువుని అనుసరించే విధానంలో నమ్మకంతో పాటు అవగాహన కూడా పెంచుకోవాలి. అవగాహన లేకపోతే ముందుకు వెళ్ళలేరు. గుర్తు పెట్టుకోండి. అందుచేత యోగము యొక్క వినియోగము ఇలా ఉన్నది. అటుపైన ఆ యోగాన్ని నిర్వర్తించుకోవటానికి రకరములుగా దైవము తన దూతలని పంపిస్తాడు. వారే సద్గురు పరంపర. అందులో మన జీవలక్షణానికి ఎవరు నచ్చితే వారిని చేరుకుంటాం. ఎవరూ నచ్చకపోతే అలా

తిరుగుతూంటాం. ముక్కుకి త్రాడు వేసుకుని పశువులా. అందుచేత మనకి రుచి కలిగింది కాబట్టి వచ్చాం ఇక త్రాడు వేయించు కోవటమే.

త్రాడు వేసుకుంటే ఇహ అక్కడ నుంచి మనకి మనం శిక్షణ ఇచ్చుకోవటమే. అటు ద్వారా, తద్వారా మనల్ని మనం అందుకనే "ఉద్ధరే ఆత్మాన ఆత్మానం" అన్నాడు. భగవద్గీత 6వ అధ్యాయంలో ఆత్మయే ఆత్మకు శత్రువు. ఆత్మయే ఆత్మకు మిత్రుడు. ఆత్మ చేత ఆత్మను ఉద్ధరించుకోవాలన్నాడు. ఏమిటి ఇన్ని ఆత్మలు ఎక్కడున్నా యంటే నీవు జీవాత్మవు. దేహాత్మగా అవస్థితి చెంది ఉన్నావు. నీవు నీకు జీవాత్మగా గుర్తుకు తెచ్చుకుని నిన్ను నీవు మూలాధారం నుంచి హృదయానికి ఉద్ధరించుకో. అలాగే జీవాత్మ, దేహాత్మ, పరమాత్మతో అనుసంధానం చెంది దైవమును చేరు. ఇదంతా నీకుగా నీవు చూసుకోవాలి. ఎట్లా చేసుకోవాలో నేను చెపుతా. లేదా చెప్పటానికి వస్తారు మహాత్ములు. కృష్ణుడంతటి వాడు అర్జునుని చేతే చేయించాడు, చెప్పాడు ఎట్లా చేసుకోవాలో అంతే కానీ చేసిపెట్టలేదు. అందుచేత సద్గురువు చెపుతాడు. ఆచరించుకుంటూ ముందుకు సాగితే చెప్పిన ప్రతి వాక్యము సత్యము అని తెలుస్తుంది. ఆ విధంగా మనం ముందు యోగాన్ని అవగాహన చేసుకుని, యోగాన్ని పెద్దవాళ్లు రకరకాలుగా ప్రతిపాదిస్తూంటారు. కాలాన్ని బట్టి, దేశాన్ని బట్టి, జీవుల యొక్క స్థితిని బట్టి "ఏకం సద్విప్రా బహుదావదంతి" అందుచేత ఆ సత్యాన్ని ఈ విధంగా ప్రతిపా దించారు. మాస్టర్ సి.వి.వి. గారు దాన్ని ఎలా ప్రతిపాదించారు?

అది ఏ విధంగా మనయందు భాసిస్తుంది? అనేది తెలుసుకున్నారు. మళ్ళీ ఒక్కసారి నడుం కట్టుకుని దీక్షగా యోగాన్ని చేసుకుందాం.

మాస్టర్ సి.వి.వి. అగస్త్యాంశ సంభూతుడు. అగస్త్య ప్రజ్ఞ అత్యవసర పరిస్థితుల్లో సృష్టి పరిణామ దశలో తనవంతు కర్తృవాన్ని నిర్వర్తించి మరల స్వస్థానం చేరుకుంటూ ఉంటుంది. అటువంటి కథలు అగస్త్య మహర్షి గురించి మనకి పురాణములలో చాలా ఉన్నాయి. అగస్త్యుడు, వశిష్టుడు ఈ ఇద్దరు మహర్షులూ అశ్వినీ దేవతల యొక్క ప్రతిరూపాలు. ఒకే తత్త్వము-పరతత్త్వము. ఏదైతే స్త్రీ, పురుషుడు ఏ ఒక్కటీ కాక, రెండూ కలిగి, రెండూ అయి ఉన్నవో, ఆ తత్త్వము స్త్రీ పురుషతత్త్వము అంటే దేహము. అతని సంకల్పముగా ఏర్పడినప్పుడు ఆ తత్త్వము మరియొక దశలో రెండుగా ఏర్పడుతుంది. ప్రకృతిగానూ పురుషుడుగానూ, ప్రజ్ఞగానూ పదార్థముగానూ, ఇడ నాడిగానూ, పింగళ నాడిగానూ. అందుచేత ఒకే ఒక తత్త్వము రెండు సమభాగములుగా విడబడిన కథయే అశ్వినీదేవతల కథ. వారే అందులో మిత్ర అనే దేవత నుండి వశిష్ట మహర్షి, వరుణ అనే దేవత నుండి అగస్త్య మహర్షి ఉద్భవించినట్లుగా మనకు పురాణాలు చెపుతూంటాయి. ఈ మిత్రా వరుణులు లేక వశిష్ఠ అగస్త్యుల ప్రజ్ఞలే అన్ని మండలాలని నడిపి స్తుంటాయి. మొత్తం సృష్టి అంతా కూడా ప్రకృతీ పురుషుల యొక్క సమ్మేళనమే. వారి యొక్క నాట్యమే. వారి యొక్క లీలా విలాసమే.

మన భూమి గురించి గనక మనం ఆలోచించినట్లయితే ఈ భూమి, ఈ సూర్యమండలమునకు సంబంధించినది. ఈ సూర్య మండలాలు 5 ఉన్నాయి. ఈ 5 సూర్యమండలాలకి, జ్యేష్ట సోదర

భావంతో నడిపిస్తున్న 7 సూర్యమండలాలు ఉన్నాయి. ఆ 7 సూర్యమండలాలని మనం సప్తర్షిమండలం అని చెప్తాం. సప్తర్షి మండలం ఈ సూర్యమండలాలకి ఎప్పటికప్పుడు వలసిన పుష్టి, తుష్టి మార్గదర్శకత్వం వహిస్తూ ఉంటుంది. పరమగురువుల యొక్క మార్గంలో జ్యోతిష్యం గురించి ఏం చెప్పారంటే, ఈ సప్తర్షి మండలమే మన సూర్యమండాలనికి తండ్రి వంటిది. మనం ఏదైతే కృత్తికలు, లేక కృత్తికామండలము అని భావిస్తూ ఉంటామో ఆ కృత్తికా మండలం ఈ సూర్యమండలమునకు తల్లి వంటిది. కృత్తికలు అంటే ఋషి పత్నులు, అటుపైన ఋషులూ, వారు తల్లితండ్రులుగా 7 రకముల జాతులు ఈ భూమి మీద ఉద్భవించి, పరిణామం చెంది, మళ్ళీ ఉత్తరముఖంగా లేక ఊర్ధ్వముఖంగా వెళ్తూ ఉంటాయి. ఇది ఒక పెద్ద కథ. ఇది మన్వతంతరముల కథ.

ఈ మన్వంతర కథలో మన భూమిని నడిపిస్తున్న ఋషి వశిష్ఠుడు. అందుచేతనే వివాహం చేసుకున్న సందర్భంలో మనకి వశిష్టమహర్షి యొక్క దర్శనం చేయిస్తారు. ఆయన ధర్మపత్ని అయిన అరుంధతి దేవిని దర్శనం చేయిస్తారు. వారి ఇద్దరి యొక్క ప్రజ్ఞయే ఈ భూమి మీద మానవులయందు ప్రసరించి నడిపిస్తున్నది. అందుచేత వారు మనకి తల్లితండ్రులవంటి వారు. కృత్తికా మండలము తల్లిగా, సప్తర్షిమండలము తండ్రిగా, సూర్యమండలము సంతానముగా అభివృద్ధి చెందుతూ ఉన్నది. ఇది పరమగురువు జ్వాలాకూలుడు ఇచ్చినటువంటి జ్యోతిష్యము నందు మనకి గోచరిస్తుంది. అటుపైన తల్లి, తండ్రి ఉంటే ఇంకొకరి అవసరం కూడా ఉన్నది గురువు. ఆ గురుతత్త్వమే మనకి దత్తాత్రేయ

మండలంగా దక్షిణమున ఉన్నది. అక్కడ గురుతత్త్వంగా అగస్త్య ప్రజ్ఞ విరాజిల్లుతూ ఉన్నది. అక్కడ నుంచే మనకి సమస్త గురు పరంపర వచ్చి మనలని నడిపించి వెళుతుంటుంది.

మనం చేసే ఈ "గురుబ్రహ్మా గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః" అనే త్రిమూర్త్యాత్మకమైన గురుతత్త్వం దత్తాత్రేయుని ఉద్దేశించి చేసే ప్రార్థన. దత్తాత్రేయుని నుంచి సమస్తమైన గురు పరంపర దిగి వస్తుంటుంది. అది దత్తాత్రేయుని యొక్క అవతార ఘట్టంలో మనకి కనిపిస్తుంది. ఎప్పుడెప్పుడైతే జీవునికి అవసరం ఉంటుందో అపుడు సద్గురువు అతని జీవితమున ప్రవేశించి అతనికి ఉత్తమగతులను కల్పించటానికి మార్గాన్ని అందిస్తూంటాడు. అదే పద్ధతిలో అగస్త్యుడు దక్షిణమున ఉన్నటువంటి భూమికి దక్షిణమున ఉన్నటువంటి మండలం నుంచి ఈ భూమికి వలసినప్పుడు వచ్చి కొంత కళ్యాణమైనటువంటి కార్యములు నిర్వర్తించి వెళ్ళటం జరుగుతూ వచ్చింది.

వశిష్ట ప్రజ్ఞ నుంచి మనకి హిమాలయాల గురుపరంపర ఏర్పడుతూ వచ్చింది. వశిష్టుడు, శక్తి మహర్షి, పరాశరుడు, వేదవ్యాస మహర్షి వీరు మనకి వాఙ్మయాన్ని ఇచ్చి జాతికి ఒక మార్గాన్ని ఇచ్చిన వారు. వారు మన పరిణామ కథ నడిపిస్తూండగా అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు అగస్త్యులువారు ప్రమేయం కల్పించుకుని కొంత సర్దుబాటు చేసి వెళతారు. వారు సర్దుబాటు చేసి వెళ్ళటానికి ఊర్ధ్వలోకంలో జరిగిన నిర్ణయమే మాస్టర్ సి.వి.వి. గారి యొక్క అవతార కారణం. దివ్యజ్ఞాన సమాజము బాగా ఉధృతంగా పరమగురువుల యొక్క జ్ఞానాన్ని 19వ శతాబ్దం చివరి అంకంలో

ప్రచారం చేస్తున్న సందర్భంలో మేడమ్ బ్లావెట్స్కీ ఈ మాట చెపుతారు. ఒక అవతారమూర్తి దక్షిణము నుండి దిగి వస్తాడు. ఆయన మూలంగా ఈ భూమికి, భూమిజనులకు ఒక ఉద్ధారణ జరుగుతుంది. అతడు మళ్ళీ పురాణపురుషుడు అంతటివాడే అని తెలియపరచటం జరుగుతుంది. అది కారణంగానే మేడమ్ బ్లావెట్స్కీ అనుయాయులైన అనీబిసెంట్, లెడ్‌బీటర్ ఇత్యాది సాధకులందరూ ఒక మంచి వాహిక దిగివచ్చే ప్రజ్ఞ కోసం తయారు చేయాలని ప్రయత్నం చేస్తారు. శ్రీకృష్ణుడు దిగి వచ్చినప్పుడు కూడా అష్టమ గర్భంలో దైవం దిగివస్తోంది అని తెలిసినపుడు రకరకములైన ఊహలు, రకరకములైన ప్రయత్నములు పురాణ పురుషుడిని గుర్తించటానికి జరుగుతూ వచ్చాయి. కానీ అతడు అత్యంత రహస్య ముగా ఎవరికీ తెలియని పద్ధతులలో, కేవలం ఋషులకు మాత్రమే తెలిసే పద్ధతిలో దిగివచ్చాడు. అలాగే ఈ 20వ శతాబ్దంలో వెలుగుని ఇవ్వవలసినటువంటి దివ్యమూర్తి ఎవరు అనే ప్రశ్నకి సమాధానంగా కొన్ని వాహికలు తయారుచేయటం జరిగింది.

దివ్యజ్ఞాన సమాజము యొక్క సభ్యులు, పరమగురువుల మార్గాన్ని అనుసరిస్తున్న అనీబిసెంట్, లెడ్‌బీటర్ వంటి వారు ప్రయత్నం చేసారు. కాని దివ్యపురుషుడు దిగివచ్చేటప్పుడు తన సంకల్పాన్ని తానే నిర్వర్తించుకోవటానికి, తన వాహికను తానే ఎన్నుకొని వస్తాడు. అందుచేత మాస్టర్ సి.వి.వి. అవతరణము అగస్త్య ప్రజ్ఞ కాబట్టి, కుంభకోణము నందు జరిగింది. కుంభము అంటే కుంభరాశి ప్రజ్ఞకు సంబంధించినటువంటిది. కుంభకోణము అంటే కుంభమునకు సంబంధించిన చైతన్యాన్ని అందించే ఒక

కోణము. అది అప్పటికే కుంభకోణము. మాస్టరుగారు రాక ముందు నుంచే అది కుంభకోణము. ఎందుచేతనంటే, ప్రతి 2160 సంవత్సరాలకి ఒక్కొక్క యుగము వస్తూ ఉంటుంది. మీన యుగ మని, కుంభ యుగమనీ--. అట్లా 12 రాశులకి సంబంధించిన ఈ భూమి యొక్క ఇరుసు ప్రతిగమనమునకు అంటే 72 సంత్సరములకు ఒక డిగ్రీ చొప్పున వెనక్కి జరుగుతూ ఉంటుంది. అందుచేతనే మన మాస్టరుగారు మీరు లెక్కపెట్టుకునే నక్షత్రాలు నక్షత్రాలు కాదు అని చెప్పారు. ఆ నక్షత్రాలు ప్రస్తుతం 23 డిగ్రీలు మనం సర్దుబాటు చేయాలి అని చెపుతూ వచ్చారు. ఇది కారణంగానే వారి జ్యోతిష్యము సాయనగా ఏర్పాటు చేసుకుని దాని ద్వారా అందరికీ బోధించటం జరిగింది.

అందుచేత కుంభయుగం 1875వ సంవత్సరంలో రావటానికి సిద్ధపడింది. కాలం ప్రకారం కుంభయుగం వస్తోంది. కుంభయుగం వస్తే కుంభరాశి తత్త్వం ఈ భూమి మీద ఎక్కువ అవతరిస్తుంది. కుంభరాశి తత్త్వం అది వాయుతత్త్వపురాశి, వాయుతత్త్వపు రాశులు 3 ఉన్నాయి. మనకి జ్యోతిష్యంలో కుంభము, మిథునము, తుల, Aquarius, Gemini, Libra ఈ 3 వాయువులూ మనలో 3 స్థితులని బట్టీ కన్పిస్తాయి. తులకి సంబంధించిన వాయువు మనలో మన బొడ్డు ప్రాంతంలో ఉంటుంది. మన మణిపూరక ప్రాంతంలో ఉంటుంది. మిథునమునకు సంబంధించిన వాయువు మన విశుద్ధి ప్రాంతంలో ఉంటుంది. కుంభమునకు సంబంధించిన వాయువు మన ఫాలభాగముపైన ఉంటుంది అంటే ఫాలభాగము పైభాగము (జుట్టు మొదలు వెళ్ళు చోటు వరకు) ఎందుచేతనంటే కుంభరాశి,

ఉండటం, లేకపోవటం అనేటువంటిది నాసత్యస్థితి అంటారు. అశ్వినీదేవతలు నాసత్యులు అంటారు. నాసత్యులు అంటే ఏమిటి? సత్యము, అసత్యము నా అసత్యము. No Untrue Beings అన్నారు మాస్టరుగారు Spiritual Astrology లో. అంటే లేరా ? ఉన్నారుట. ఉన్నారా ? అంటే లేరుట. అలా మనికి ఉండి లేనట్లుగాను, లేక ఉన్నట్లుగానూ ఉండే ఒక స్థితి ఉన్నది. అది తెలిసిన వారే దృశ్యా దృశ్యులుగా ఉంటూ ఉంటారు. శ్రీకృష్ణుడు అప్పటికప్పుడు కనిపిస్తాడు. మళ్ళీ అప్పటికప్పుడు అదృశ్యం అవుతూ ఉంటాడు. ఈ రహస్యం ఎవరికి తెలుస్తుందంటే కుంభరాశి రహస్యం తెలిసినవారికి. అణువులు అప్పటికప్పుడు ఏర్పాటు చేసుకుని అవతరించటం, అణువులు అప్పటికప్పుడు లయం చేసుకుని అదృశ్యం అవటం. ఇటువంటివి అన్నీ పరమగురువులు కూడా చేయగలరు. దేవాపి మహర్షి మన మాస్టరుగారికి ఆ విధంగా తాను నిర్వర్తించి చూపించారు. గోడ లోంచి నడిచిరావటం, కనపడటం, అదృశ్యం అవటం ఇదంతా కుంభయుగము విద్య.

కుంభయుగంలో మానవుడు ముందుగా తెలుసుకోవలసినది మరణము అన్నది లేదు. పరమగురువు జ్వాలాకూలుని పుస్తకాలు చదువుకుంటే 200ల సంవత్సరములలో ఈ భూమి మీద మానవు నికి మరణం అంటే ఏం లేదు మన భయం తప్ప, మన భ్రమ తప్ప అని చాలా మందికి తెలిసిపోతుంది. అది కుంభరాశి యొక్క లక్షణం. మరణానికి అతీతంగా ఉండి రూపుకట్టుకోవటం, నువ్వు మళ్ళీ అక్కడ నుండి అదృశ్యం అవటం. అంటే దేహం ధరించటం, మళ్ళీ దేహం నుండి విడివడటం. ఈ విద్య బాగా రావాలి. ఇది

రావల్సిన సమయం అయితే వచ్చేసింది కానీ మనం మాత్రం సంసిద్ధులుగా లేము. 6 గంటలకి Time అయితే అయిపోయింది కాని, ఇంకా స్నానపానాదులే కాలేదు. అలా ఉంటుందన్నమాట. అప్పుడేం చేయాలి. కొంచెం త్వరపెట్టాలి. మనుష్యులకు వేగాన్ని పెంచాలి. ఎవరో కొంతమంది వచ్చి తొందరగా తెమలమని చెప్పకపోతే ముహూర్తాలు కూడా దాటి పోతుంటాయి. పెళ్ళిళ్ళల్లో కొంతమంది రేడియో ప్రకారం వాళ్ళ వాచీ ఏర్పాటు చేసుకొని కూర్చుంటారు. వాళ్ళు కాలం ప్రకారం నడుస్తోందో లేదో కార్య క్రమం చూస్తూ ఉంటారు.

మంగళగిరిలో మేము మాస్టరుగారితో ఒక పెళ్ళికి వెళ్ళినప్పుడు అక్కడ బొత్తిగా కాలం ప్రకారం పెళ్ళి జరపట్లేదు. అలా గనక ఆ వివాహ కార్యక్రమం ముందుకు సాగివుంటే ముహూర్తం అయిన తర్వాత 2 గంటలకి పెళ్ళి అయ్యేది. అంటే పెట్టిన ముహూర్తం కన్నా 2 గంటల తర్వాత. మాస్టరుగారు చూశారు. వీళ్ళు కొంత జడ్డిగా ఉన్నారోయ్. అందుచేత ఒక పని చేద్దాం. పెళ్ళికూతుర్నీ, పెళ్ళికొడుకునీ పీటల మీద కూర్చోమని జీలకర్ర, బెల్లం సరిగ్గా ముహూర్తానికి పెట్టించేసి, ఇంక మీ ఇష్టం వచ్చినప్పుడు పెళ్ళి చేసుకోండి అని చెప్పారు. పెద్దవాళ్ళు అడిగారు ఏమిటి మీరు ఇలా చేశారు అని. ముహూర్తానికయ్యా పెళ్ళి కావల్సింది. ముహూర్తం దాటాక నువ్వు చేస్తే ఏమిటి ఉపయోగం అని, ఆ ముహూర్తం యొక్క బలం ఆ దంపతికి దక్కుతుందా? దక్కదు. అలాగే కాలమును అనుసరించి జాతి నడుస్తూంటే జాతికి ఆ అనుభూతి దక్కుతుంది. లేకపోతే మనం దాన్ని కోల్పోయిన వాళ్ళం

అవుతాం. కుంభయుగం వచ్చేసింది. మనుష్యులు మీన యుగంలోనే ఉన్నారు. అంటే ఆవేశకావేశాదులలో ఉన్నారు. ఈ నాటికీ అలాగే ఉన్నారు. పరమగురువుల లెక్కప్రకారం 90 శాతం మానవజాతి ఆవేశము నందే జీవిస్తోంది. వారి ప్రేమ ఆవేశం, భక్తి ఆవేశం, వారి అనురాగములు ఆవేశం, వారి ఆశయములన్నీ ఆవేశములే. అంతా ఆవేశమే. సిద్ధాంతములన్నీ ఆవేశమే. అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువగా ఉండటం అనేది మీనరాశి తత్త్వం.

సినిమాలలో చూడండి ఒక భక్తుడో, భక్తురాలో భగవంతుడిని భయంకరంగా వేధిస్తే భగవంతుడు ప్రత్యక్షమైనట్లు ఉంటుంది. వేధించటం అంటే ఏడుస్తూ, కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటూ గద్గద స్వరం అయిపోయి అంటే Emotional approach. Aquarian age లో Emotion లేదు, Science ఉంటుంది. అందుచేత మొట్ట మొదట్లో మాస్టరుగారిని కలసిన సందర్భంలో ఈ భాగవత పద్యాలు, దాశరథీ శతకాలు సినిమా ఫక్కీలో చదివేవాడిని... చదువుతూంటే 'కుమార్' భక్తి, ఆవేశం కాదోయ్' అని మాస్టరుగారన్నారు. మాస్టరుగారి దగ్గర ఆవేశం లేదు. ఆవేశం లేక ఆలోచన కలిగి, ఉద్రేకం లేక ప్రేమ కలిగి, ఆలోచనతో కూడిన ఆశయం కలిగి ఉంటుంది. మాటిమాటికీ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలున్నటు వంటి ఆవేశం, రాగద్వేషాలు వీటితో కూడుకుని ఉన్నటువంటి వాళ్ళూ, మురుకినీరులో ఉన్నట్లు లెక్క. మరి మురికినీటిని ఉద్ధరించి మంచినీటిని చేయాలి కదా! మంచి నీరంటే ఈ నీరే కాదు. "ఆపోవా ఇదగ్ం సర్వం విశ్వాభూతాన్యపః" కదా! విశ్వాభూతాన్ ... మరి ఆకాశం కూడా జలమే. అంటే అది సూక్ష్మస్థితిలో ఉండే

జలం. ఇది భౌతికస్థితిలో ఉన్న జలం. ఏడులోకములయందు జలం ఉన్నది. జలం అంటే జీవం అని అదే నారము. దానిమీద ఆయన పడుకుని ఉంటాడు కదా! భగవంతుడు జీవచైతన్యము లేక ప్రాణము అనే అనంతమైన ప్రాణము. అందులో శయనించి ఉంటాడు ప్రజ్ఞగా. అందుచేత నారాయణలోకం నుంచి కూడా మనకి నారములున్నాయి కదా! నీలోనూ ఉన్నాయి కదా! ఆ నీరేమిటి? ఈ నీరు మురికినీరు. ఈ మురికినీరు తెచ్చి బైటపడేయ టానికి ఎవరాన్నా రావాలి. అదే అగస్త్యుడు. నీటిని మ్రింగి కాలకే యుడ్ని సంహరింపచేసి మరల స్వచ్ఛమైన నీటిని వదిలాడని చెపుతారు.

అంటే మురికినీటిని ఆవిరిగా మార్చింది, మురికి వదిలించు కుని మరల ఆ ఆవిరిని చల్లార్చుకుంటే స్వచ్ఛమైన నీరు వస్తుంది. అలా మనల్ని కూడా ఒక్కసారి మన అపవిత్రత నుండి ఉద్ధరించి పవిత్రులమై 7 లోకముల ప్రజ్ఞ మనం అనుభూతి చెందటానికి వలసిన సమయం వచ్చింది. సమయం వచ్చింది గానీ పాత పద్ధతులే, అవగాహన లేదు. అర్థం లేని చదువు వ్యర్థం. అర్థంగాని వేవీ తెలియకుండా, ఏం చేస్తున్నామో తెలియకుండా ఏదో చేస్తున్నా మనుకుంటూ యోగం అనుకుంటే ఎట్లా.

ప్రాణాయామము అంటే ఏమిటో తెలియదు. ఆసనం అంటే ఏమిటో తెలియదు. కానీ ప్రతివాళ్ళూ ప్రాణాయామము చేస్తున్నా మంటారు. ప్రాణాయామము చేసేది కాదు, జరిగేది. ధ్యానం చేసేది కాదు, జరిగేది. ఏదీ తెలియకుండా చేయటంవల్ల ఉపయోగం

లేదు. తెలియకుండా వంట చేస్తే తినటానికి వీలవుతుందా? తెలియక చేస్తే తెలిసినదానితో సమానం అవుతుందా? అందుకనే అవగాహనతో కూడి చేయటం, శాస్త్రము తెలిసి చేయటం నేర్వాలి.

సృష్టి అంతా ఒక శాస్త్రపరంగా అవగాహన చేసుకుని అటుపైన అనుభూతిపరంగా దాన్ని అనుభవింపవచ్చు. అందుకనే This is both Science and Art. మన శాస్త్రములన్నీ Scientific. అందుచేత అందులో వుండేటటువంటి దాని అవగాహన మనకి ముఖ్యం. మానవుడు శాశ్వతుడు. అతడు నరుడు. నశించనివాడు. అతడు దేహమునందున్నాడు. దేహము నశించేటటువంటిది. దేహము క్షరపురుషుడు. అతడు అక్షరుడు. ఈ క్షరుడికి, అక్షరుడికి మూలమైన వాడు పురుషోత్తముడు. ఈ మూడింటి యందు తత్సమానమైన పట్టు ఏర్పడితే, అది యోగమవుతుంది. కాబట్టి మనిషి ఇప్పుడు బొడ్డు నుండి ఉద్దరించబడాలి, బొడ్డు నుండి ఉద్ధరించబడాలంటే అవగాహనలోనే ఉద్ధరించాలి. మిధునరాశి వారు అవగాహన కోసం ప్రయత్నం చేస్తారు. తులారాశి వారు ఎంతసేపూ భోగమయమైన జీవితానికి ఆసక్తి చూపిస్తుంటారు. జీవునికి యోగజీవనము, భోగ జీవనము, రోగజీవనము ఈ మూడింటిలో ఏదో ఒకటి వుంటుంది.

అందుచేత ఈ తులారాశిలో వున్నంత కాలం మనకి ఇది తిందామా, అది తిందామా, ఇది చూద్దామా, అది చూద్దామా, ఇది కొనుక్కుందామా, అది కొనుక్కుందామా అని వుంటుంది. కనపడ్డదల్లా కొనుక్కోవాలనిపిస్తుంది. ప్రతీదీ ఇంట్లో తెచ్చి పెట్టుకోవా లనిపిస్తుంది. ఇల్లు నిండి పోతుంటుంది. సామాన్ల మధ్య మనం నడుస్తూండాలి. ఇట్లా తయారు చేసుకుంటారు. ఇదంతా ఎందుకూ?

అన్నీ తన దేహ పుష్టికోసము. దీన్నుంచి మనం వృద్ధి చెందాలంటే మనిషికి ఆలోచన కావాలి. అందుకనే మరువు మహర్షి వద్దకు వెళ్లి మమ్మల్ని ఏం నేర్చుకోమంటారూ అంటే, Learn How to Think అన్నారు. మనం ఏదో బాగా ఆలోచిస్తున్నామనుకుంటాం. ఏం వుండదు. దాన్లో ఆవేశమే, ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. వారందరికి ఎందుకూ ఏం చేస్తున్నామో తెలియదు. తెలియకుండా చేస్తుంటారు.

నేనెప్పుడూ చెప్తూంటాను A.P.S.R.T.C. Bus కథ. A.P.S. R.T.C. బస్సులలో ఎవరో ఊరు వెళుతున్నారు. ఎక్కడో దారిలో, అర్ధరాత్రి పూట, Tyre puncture అయ్యిందట, puncture ఐతే బస్సు డ్రైవరు, కండక్టరు కాసేపు ప్యాసింజర్సుని దిగి కాసేపు గాలి పీల్చుకోండి, ఈలోగా టైర్ మారుస్తాం అని చెప్పారుట. చెబితే సరే! ముందు ఒకాయన దిగాడట. దిగి బయటకు వెళ్ళి నక్షత్రాలని చూస్తున్నట్టుగా, ఒక చెయ్యి మెడమీద పెట్టుకుని వున్నాడుట. ఆయన ఏదో చూస్తున్నాడూ ఆకాశంలో, అని చెప్పి తరువాత దిగిన యాత్రికుడు కూడా అదే విధంగా చూస్తున్నాడట. ఇంకొకాయనా వచ్చాడట ఆయన కూడా చూస్తున్నాడట. అందరూ అట్లా ఆకాశంలో చూస్తూనే వున్నారు. ఈ లోపల బస్సు డ్రైవరు కండక్టరు పనిపూర్తిచేసి ప్యాసింజర్సు ఏమైపోయారు అని చూస్తే, వాళ్ళు అట్లా దూరంగా ఆకాశంలోకి చూస్తూ కనిపించారు. అప్పుడు కండక్టరు వెళ్ళి ఆ వెనకాల వున్న ఒకనిని ఏమిటీ అలా ఆకాశంలోకి చూస్తూన్నారు, ఏమైనా ప్రత్యేకంగా వున్నదా? అని అడిగాడట. ఏమీలేదు ముందువాడు చూస్తుంటే నేనూ చూస్తున్నా, అన్నాడు.

వాడ్నడిగితే వాడూ అదే. ఆ ముందు వాడ్నడిగితే వాడూ అదే. అందరూ కలసి మొదటి వాడ్నడుగుతారు. ఎందుకయ్యా నువ్వు అటు చూస్తున్నావంటే, ఏమిటి చూసేదీ, చూసేదేమీ లేదు, నాకు Spondylitis, బస్సులో వస్తూంటే మెడ నొప్పి పుట్టింది. అందుకని నేను మెడ సరిచేసుకుంటున్నా. అంతే తప్ప చూసేదేమీ లేదు అన్నాడు. అలా ఉంటాయి మనం చేసే కార్యక్రమాలన్నీ.

ఈ మాట చెప్పడానికి నాకు అర్హత ఉన్నది ఎందుకంటే నేను చాలా చూసాను, దేశాలు తిరిగాను. అందరూ ఏది ఎందుకు చేస్తున్నారో దాని యొక్క ఉద్దేశ్యం ఏమిటో తెలియకుండా చేస్తుంటారు. ఇందాక చెప్పినట్లే వంట తెలిసి చేస్తే రుచిగా వుంటుంది. తెలియక చేస్తే మనం ఒకటి చేస్తే అది ఇంకోటై కూర్చుంటుంది. అందుచేత ఆలోచనలు కావాలి. అందువలన మరువు మహర్షి Learn how to Think అన్నారు. ఆయన ఎప్పుడూ ఇలానే చెప్తూంటారు. Learn how to Desire ఏది కావాలో తెలుసుకో ముందు. Learn how to Sleep, learn how to Wakeup from Sleep. ఇవీ ఆయన మనకిచ్చే చిన్న చిన్న ఉపదేశాలు. నీ కివే తెలియవు. తెలుసుకుని చేయాలి. తెలుసుకుని చేసే యుగము కుంభయుగం. అందుకే శాస్త్రము Science, Scientific అంటారు. మాస్టరు సి.వి.వి. నా యోగం Scientific నీ కర్థం కాదు. అక్కడ తెల్ల వాళ్ళకి తొందరగా అర్థం అవుతుంది అంటారు. ఎందుకనీ?

మనం ఆలోచించడం మానేసాం. మానేసి అనుకరించడం మొదలుపెట్టేసాం. అనుకరణ కొంతకాలమే. చిన్నతనంలో అనుకరణే కదా! పసితనంలో తల్లిదండ్రులని, ఉపాధ్యాయులని అనుకరిస్తాం.

అటుపైన మనలో వివేచన పెరిగి, ఆలోచనాశక్తి పెరిగి అందులో నుంచి తెలుసుకోవాలి. విచక్షణ పెరగాలి, ఆలోచన రావాలి. అది మిథునం. మిథునరాశికి విచక్షణా జ్ఞానం ఎక్కువ. బుద్ధుడు దానికి అధిపతి. తెలిసి బుద్ధితో వివేచన చేసి అది ఎందుకు ఇలానే చేయాలి? ఇలా చేయకపోతే ఏమవుతుంది, చేస్తే ఏమవుతుంది? ఇంతకన్నా ఇంకోరకంగా చేసే పద్ధతి ఏమన్నా వున్నదా, ఇవన్నీ కూడా నిజమైన అన్వేషకుడు ఆలోచించే విషయములు. తొందర పడిపోయి దూకేయకూడదు.

నేను రాముడి దగ్గరనుంచి వచ్చాను అని హనుమంతుడు అంటే సీతమ్మవారు వెంటనే దూకేసిందా? పరీక్ష చేసింది. శిష్యుడు గురువును పరీక్ష చేసుకోవాలి. ఏమిటి మీరిస్తున్న యోగం అని తెలుసుకో. సీతాదేవి హనుమంతుణ్ణి చాలా పరీక్షలు చేసింది. అలాగే హనుమంతుడు కూడా సీతాదేవిని ఇలాగే పరీక్షగా పరిశీ లించాడు. అందుచేత మనకి సనాతనంగా గురుపరీక్ష వున్నది. శిష్యుడికి పరీక్ష వున్నది. ఒకరినొకరు బాగా పరిశీలించుకున్న తరువాతే పనిచేయడం జరుగుతుంది.

ఈ యుగము వచ్చేసింది. మనం అసలు ప్రజ్ఞ దిగి రావలసి వచ్చింది. పైగా అగస్త్యుడు కుంభసంభవుడు. వశిష్ఠుడు కూడా కుంభసంభవుడే. ఇద్దరూ ఒకే కుంభం నుంచే పుట్టారు రెండు భాగాలుగా. అదే ఒకటి ఇడా స్రవంతి, మరొకటి పింగళా స్రవంతి. ఒకరేమో ప్రకృతి యొక్క స్థితులను ఏర్పాటు చేసే విషయంలో అధిష్టించి వున్న ప్రజ్ఞ. మరొకరేమో ప్రజ్ఞ యొక్క స్థితులను సంబంధించిన వాటిని అధిష్ఠించివున్నటువంటి ప్రజ్ఞ. అది ఇడా

పింగళులుగా మనలో వున్నాయి. అందుచేత ఈ వశిష్ట ప్రజ్ఞ, అగస్త్య ప్రజ్ఞ ఈ రెండూ కుంభం నుంచి వచ్చినవే. అగస్త్యుణ్ణి కుంభ సంభవుడు అంటారు. అంటే కుంభరాశికి సంబంధించినవాడు.

కుంభయుగం వచ్చింది. Aquarian Age అంటే కుంభయుగం. కుంభ యుగం వచ్చినపుడు కుంభరాశి తత్త్వం ప్రకాశించాలి. అందుచేత అగస్త్య ప్రజ్ఞయే దిగిరావడానికి ఊర్ధ్వలోకాలలో ఒక సంకల్పం జరిగింది భూమికోసం, భూమి జీవుల కోసం. భూమికే పరిణామం వున్నది. భూమి జీవులకూ పరిణామము కలగాలి. అది దిగిరావటానికి దత్తాత్రేయ మండలం నుండి ఆ ప్రజ్ఞ 'సిరియస్' అంటారు. ఆంగ్లంలో 'Dog Star' అంటారు. అక్కడ ఉన్న నక్షత్రాన్ని మనవారు దానిని 'శారమేయ మండలము' అంటారు. శరమ అంటే కుక్క. Dog Star అన్నా కూడా అంతే. అక్కడ నుండి జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉంటుంది కుక్క. Watchfull eye కదా! జాతికుక్క ఇంట్లో ఉంటే ఎలా మసులుతున్నారో అన్నీ చూస్తూనే ఉంటుంది. అది చూస్తోందని తిరిగేవాళ్ళకి తెలియదు. అట్లానే భూమి, భూమి జీవులు, వీరి యొక్క పరిణామము కథ అంతా కూడా అట్లా అవలోకనం చేస్తుంటారు. చూస్తూ ఉంటాడు. ఆ విధంగా చూస్తూ ఉన్నటువంటి ప్రజ్ఞ దిగిరావటానికి సంకల్పం జరిగింది నారాయణ లోకంలో. అది కారణంగా ప్రజ్ఞ వృశ్చికరాశిలో ఉంటుంది. అది ప్రవేశించటం సింహరాశి నుంచి ప్రవేశిస్తుంది. అది ఉండటం మన భూమికి ఉండేటటువంటి వృశ్చికరాశి భాగంలో ఉంటుంది అని తెలియపరిచారు. సింహరాశిలో కూడా కొన్ని గుంపుల సూర్యమండలాలు ఉన్నాయి. మన సూర్యమండలాలు

12 ఉన్నాయి. అటువంటివి 12 కలిసి ఒక గుంపు. మళ్ళీ 12 సూర్యమండలాలు. 12, 12 సూర్యరాశి మండలాలు గుంపులుగా 12 గుంపులు ఉంటాయి. అందుకనే 12 × 12 ఒక groce అంటారు.

ఆ లెక్కలు ఇప్పుడు పోతున్నాయి. మనకి గుణింతాలు రావు. అందుకని Decimal System లోకి వచ్చేసాము. కానీ 3 దమ్మిణీలు ఒక కానీ, 4 కానీలు ఒక అణా, 16 అణాలు ఒక రూపాయి. అందులో ఆధ్యాత్మికత చాలా ఉంది. దశాంశ పద్ధతి ఒక రకమైన కొలత. సృష్టిలో ఇది మరియొక కొలత. అందుచేత ఈ కొలతల్లో మనం చూసుకున్నట్లయితే ఈ భూమికి ఈ విధంగా దిగివచ్చే సందర్భంలో కుంభరాశినుండి దాన్ని అందుకోవటానికి మనిషి దిగిరావాలి. ఆ దిగి రావాల్సిన మనిషి ఎవరా అని ఊర్ధ్వలోకాల్లో ప్రశ్న. అగస్త్యుడే దిగి రావాలి. అగస్త్యాంశ సంభూతుడై భూమి మీద జీవించాలి ఎవరైనా. ఇది వరకు కూడా అక్కడే దిగింది. ఈ కుంభచైతన్యము. ఈ ఇరుసు ఇట్లా ప్రతి 2,160 సంవత్సరాలు. 2,160 × 12 = 25,920 సంవత్సరాలు. దీన్ని 'గ్రేట్ ఇయర్' అంటారు. అంటే మహాసంవత్సరము. ప్రతి తరం మానవ జాతి దిగివచ్చినపుడు పరిణామ దశలో వారికీ కుంభయుగం వస్తుంది. ఊర్ధ్వగతికి వెళ్ళడానికి, మరణ రహస్యం తెలియటానికి; నచికేత విద్యలు, సావిత్రి ఉపాఖ్యానములు, మార్కండేయపురాణములు ఇత్యాదివన్నీ ఆ సమయంలో జరిగినవి. అందుచేత ఇదివరకు ఒకసారి కుంభయుగం వచ్చినపుడు కుంభచైతన్యము కుంభకోణంలో దిగింది అందుచేత అది కుంభకోణం. ఆది కుంభేశ్వరుడు వున్నాడు.

అక్కడ దిగి వచ్చినటువంటి చైతన్యమే అక్కడ ఆలయంగా ఏర్పాటు చేసుకుంది. మరల ఈ చైతన్యం అక్కడే దిగడానికి నిర్ణయం చేసారు. అంటే దివ్యజ్ఞాన సమాజం వాళ్ళద్వారా ఒక ప్రయత్నం జరుగు తుండగా, మేడమ్ బ్లావెట్స్కీ పరమగురువు స్పర్శ కలిగి యుండటం చేత, కాలజ్ఞానము చేత మళ్ళీ పురాణ పురుషుడు దిగి వస్తాడు అని చెప్పింది. దానికోసం మానవ ప్రయత్నం వారు చేసారు కానీ, ఈ లోపల ఈ ప్రజ్ఞ అక్కడ ముందే దిగి వచ్చి వున్నది.

కుంభయుగం 1875లో వచ్చింది. 1868లో నే మాస్టరుగారు శరీరం దాల్చడం జరిగింది. అంటే 7 సంవత్సరముల ముందే! శరీరం దాల్చిన తర్వాత ఏ ప్రజ్ఞనైతే ఈ భూమికి ప్రవేశపెట్టాలని ఊర్ధ్వలోకాలలో నిశ్చయం చేసారో, ఆ ప్రజ్ఞ 1910వ సంవత్సరంలో ఈ దత్తాత్రేయ మండలం నుండి సింహరాశిలో ఉన్న Hercules అనే సూర్యునిలో ప్రవేశించింది. సింహరాశిలో ప్రవేశించిన ప్రజ్ఞ కుంభరాశి తత్త్వాన్ని అందుకుంది. ఎందుకనీ? మనం కుంభరాశి పురుష రాశిగాను, సింహరాశి స్త్రీ రాశిగాను ఆ విధంగా ఒక దంపతిగా చెప్పుకుంటాము. అలాగే మనకు మేషము - తుల, వృషభము - వృశ్చికము, మిథునము - ధనుస్సు, కర్కాటకము - మకరము, సింహము- కుంభము, కన్య - మీనము ఇలా మనకు 6 దంపతులే 12 రాశులుగ ఉంటాయి. అంటే 6 చక్రముల యొక్క స్త్రీ భావము, పురుష భావము. ఇడా భావము, పింగళ భావము. రెండు భావములు రెండు రాశులుగా కనిపిస్తాయి తప్ప అవి ఒకదానితో ఒకటి అనుసంధానం చెందిఉంటాయి. ఎదురు బొదురుగా ఉంటాయి. అందుకనే మఖా నక్షత్రం సింహరాశిలో

ఉంటే మాఘమాసం దాని ఎదురులో ఉంటుంది. అలా మఘ మాసం, శ్రావణమాసం ఒక దంపతి. అందుచేతనే వచ్చే ప్రజ్ఞ సింహరాశి నుండే వస్తుంది. మాఘమాసపు ప్రజ్ఞ, కుంభరాశి ప్రజ్ఞ అందుకోవాలంటే ఏముండాలి? తను సింహరాశిలో పుట్టి, కుంభరాశికి చెందిన చంద్రుడు కలిగి ఉండాలి. సింహరాశిలో సూర్యుడుండి, కుంభరాశిలో చంద్రుడు ఉంటే అది శ్రావణ పౌర్ణమి.

అందుకనే మన మాస్టరుగారు వ్రాశారు ఒకచోట 'కుంభరాశి చంద్రుడుగా దిగి వచ్చి' అని. అక్కడక్కడ ఆయన అలాంటి ఎన్నో Key Points తెలియజేశారు. మనలో సంస్కారము పెరిగేకొలది అవి మనకి ఒకదానికొకటి జతకూడతాయి. అంతేగాని మనం జతచేయలేము. ఆగష్టు 4న, సింహరాశిలో, శ్రావణ పూర్ణిమ ఘడియలు సరిగ్గా పూర్తిఅవుతున్న సమయంలో, మాస్టరు సి.వి.వి. గారు జన్మించారు. ఇహ ముందు శతాబ్దములలో గురుపౌర్ణమి అనేది వైశాఖపౌర్ణమి నాడు కాదు, శ్రావణ పౌర్ణమి నాడే అని ఒక పుస్తకంలో జ్వాలకూల్ మహర్షి వ్రాసి ఉన్నారు. ఈ యుగానికి సంబంధించిన ప్రజ్ఞ శ్రావణ పూర్ణిమనాడు దిగి వచ్చింది. శ్రావణ పూర్ణిమ మనకు సింహరాశియందు జరుగుతుంది. కాబట్టి హృదయమును ముందు చేరడం అనేది ముఖ్యం. తుల నుండి సింహానికి చేరాలి. తులారాశి ప్రజ్ఞ భోగలాలసత్వం ఎక్కువ ఉంటుంది. Fashion passionate గా ఉంటుంది. Fashion కి Wisdom కి తేడా ఉన్నది. అందానికి ఆకర్షింపబడడానికి, జ్ఞనం యొక్క అందానికి ఆకర్షింపబడడానికి చాలా తేడా ఉన్నది. అంటే ఆవేశంలోంచి ఆలోచనలలోకి వస్తేనే నీవు జ్ఞానం సముపార్జించేది?

అందుచేత ఆయన సింహరాశిలో జన్మించాడు. ఆయన చంద్రుడు కుంభరాశిలో ఉన్నాడు. అంటే ఒక ఉత్తమోత్తమమైన ప్రజ్ఞ దిగి రావాలంటే కాలాన్ని అనుసరించి దిగి రావాలి. రాబోవు మన గురుపరంపర అంతా సింహరాశికి సంబంధించినదే! మాస్టర్ సి.వి.వి. మాస్టర్ ఎమ్. ఎన్. మాస్టర్ ఇ.కె. అలాగే అంతకు ముందు వచ్చిన మెడమ్ బ్లావెట్స్కీ, శ్రీకృష్ణుడు ఇలా అంతా సింహరాశివారే.

ఈ సింహరాశి ప్రజ్ఞ ప్రత్యేకమైన స్పర్శ జీవుల కివ్వడానికీ, బొడ్డులోంచి జీవులను హృదయములోనికి ఉద్ధరించడానికి ఏర్పడింది. శ్రావణ పౌర్ణమి ఘడియలలో గుర్తుపెట్టుకోండి, పౌర్ణమి తిథి అంతంలో పౌర్ణమి ఘడియలు పూర్ణంగా ఉంటాయి. అందుకనే ధ్యానం చేసేవాళ్ళు పౌర్ణమి ధ్యానం ఎప్పుడు చేయాలి? పౌర్ణమి తిథి అంతం అయిపోయి కృష్ణ పాడ్యమి ఘడియలు వస్తున్న సందర్భంలో 180 డిగ్రీలలో సూర్యచంద్రులు ఉంటారు. పరిపూర్ణ మైన పౌర్ణమి ప్రజ్ఞ, అప్పుడు పౌర్ణమి ధ్యానం చేయాలి. అలాగే అమావాస్య ప్రజ్ఞ తిథి ప్రారంభంలో ఉంటుంది. అందుచేత ఆ పౌర్ణమి ఘడియలు అంతమై పాడ్యమి ఘడియలు వస్తున్న సందర్భంలో మాస్టరుగారు జన్మించారు. ఆయన దిగి వచ్చినటు వంటి 7 సంవత్సరములలో కుంభయుగము ప్రారంభం అయినది. కుంభయుగము వచ్చిన ఒక కాలచక్రానికి అంటే దాదాపు 35 సంవత్సరాలకి తోకచుక్క Comet ఒకటిరావడం మొదలు పెట్టింది. అదే Halley's Comet. ఆ Comet ద్వారా ఈ భూమండలము నకు ఈ కుంభయుగ ప్రజ్ఞను దింపడం జరిగింది.

మనం చంద్రుడి వద్దకు వెడుతున్నాం, కుజుడి వద్దకు వెడుతున్నాం, శుక్రుడి వద్దకు వెడుతున్నాం అని అనుకుంటాం కదా! కాని మనం వెళ్ళినప్పుడల్లా మనం తిరిగి వచ్చేప్పుడు ఆ బండిలో కొంతమంది ఎక్కి వచ్చేస్తున్నారు. మనం ఉపగ్రహాలు ఏవో పట్టుకొని చంద్రుడి దగ్గరికి మనం వెళ్ళినప్పుడల్లా వాటిని ఆధారంగా చేసుకొని అక్కడ నుండి కొంతమంది సిద్ధులు దిగి భూమి మీద ఉన్నారిప్పుడు. చంద్రుడి నుండి వచ్చినవాళ్ళు, కుజుడి నుండి వచ్చిన వాళ్ళు ఉంటారు. ఇంగ్లీషు వాళ్ళకి మనకన్నా ఊహలు ఎక్కువ. వాళ్ళ సినిమాల్లో అది బాగా కనిపిస్తుంది. Mercury నుండి ఒకడు వస్తాడు. Mars నుండి వస్తాడు. వాళ్ళిద్దరూ కొట్టుకుంటున్నట్లుగా Terminater సినిమా తీసారు. వీటిలో సత్యం ఉంది. ఎందుచేతనంటే మీకు తెలియకపోయినా మీ యందు స్ఫూర్తి కలిగించేటువంటివి పట్టుకు వస్తారు. అందువలన వైజ్ఞానికమైన సినిమాలు అమెరికా నుండే వస్తాయి. ఎందుకంటే వారికి ఊహ చేయడం ఉంది.

మనం అన్నీ మర్చిపోయాం. guessing లేదు. ఇహ Imagination ఎక్కడ నుండి వస్తుంది? From guess to Imagination, Imagination to Visualisation అన్నారు మరువు మహర్షి. నీవు దైవమును గాని, గురువుని గాని నీ హృదయమునందు దివ్య కాంతితో, తేజోరూపంతో ఉన్నట్లుగా ఊహించి చూస్తూ ఉంటే కొన్నాళ్ళకి అది సత్యమై దర్శన మిస్తుంది. అసలు ఊహే లేని వాడికి ఏం వస్తుంది? ఇంతకీ అలా భూమిమీద ఇప్పుడు చాలా మంది Super Beings అంటే ఇతర గ్రహముల నుండి వచ్చిన ఉత్తమోత్తమమైన సిద్ధులు ఈ భూమి పరిణామానికి పని చేస్తున్నారు.

అలాగే Hallies Comet వచ్చినప్పుడు అది తీసుకువచ్చిన ప్రజ్ఞ ఈ శారమేయ మండలము, దత్తాత్రేయ మండలము లేక సీరియస్ లేక Dog Star నుండి వచ్చిన ప్రజ్ఞను మనభూమి కక్ష్యలోనికి ప్రవేశింప చేస్తే దాని తోక మార్చి 31వ తేది అర్ధరాత్రి సమయంలో భూమిని స్పృశించింది. స్పృశించిన సమయంలో కుంభకోణంలో డబ్బీరు వీధి అంతా కంపించింది. అక్కడే ఉన్న మాస్టరుగారున్న ఇంటిమీద ఆ పిడుగు పడ్డట్లు కనిపించింది. ఆ ఇల్లు, ఆ ఇంట్లో ఉండేవారు అయిపోయారనుకున్నారు అందరూ. అది చాలా పెద్ద వెలుగు. అది ఆ విధంగా దిగి వచ్చింది.

విద్యుత్ కాంతినే తట్టుకోలేము ఒక పిడుగు వచ్చి మీద పడితే ఎవరైనా తట్టుకోగలరా! గబగబా పరిగెత్తి వెళ్ళి చూస్తే సి.వి.వి. గారు ఏ చిత్రపటం అయితే మనం పెట్టుకుంటున్నామో అట్లా వీరాసనంలో నిశ్చలుడై, తేజోమూర్తియై కూర్చొని ఉన్నారు. ఆయనకి అంతకు ముందు ఏమీ తెలియదు, అప్పుడే ఏదో అయిపోయింది అనేట్లయితే అర్ధరాత్రి పూట అట్లా కూర్చోరు కదా! శివరాత్రినాడు లింగోద్భవం అర్ధరాత్రి 12 గంటలకు అంటే మనం కళ్ళు నులుముకుంటూ ఎప్పుడౌతుందా అన్నట్లు కూర్చుంటాం. అదీ లింగోద్భవం కావచ్చు. కాని మనకి అయ్యిందా లేదా చూసు కోవాలి. ఇంతకీ ఎంత తెలిసి ఉండకపోతే ఆ మహాత్ముడు ఆ సమయంలో ఆ విధంగా మేల్కొంచి సంసిద్ధులై, వీరాసనంలో కూర్చొని ఉండి ఉంటారూ? డబ్బీరు వీధిలోనివారు, కిటికీ లోంచి ఆయన తేజోమయమైన రూపం చూసి 'ఏదో అయిపోయింది అనుకున్నారు, ఏమిటి ఈయన ఇలా కూర్చొని ఉన్నారు' అనుకొని వెళ్ళిపోయరుట.

ఆ రోజు నుండి ఆయన కథ మొదలు. అంటే అంతకు ముందు కథ వేరు. ఆ తర్వాత కథవేరు అన్నది సత్యం. అయన అంతకు ముందు ఏం తెలియదనా? తెలియకపోతే ఆయన అలా కూర్చొనేవారా! ఈ రోజు రాత్రి ఏదో జరుగుతుందట అంటే మనమందరమూ కూర్చోమూ? ఎందుకూ మొన్నటికి మొన్న సూర్యుని మీదుగా శుక్రుడు వెళ్ళాడు కదా దాని ప్రభావం మన మీద ఏమిటీ, ఈ భూమి మీద ఏమిటీ అని ఆలోచన చేశారా ఎవరన్నా? అందులో చాలా పెద్ద ప్రణాళిక పరమ గురువులు అందించి భూమికిమ్మన్నారు. సూర్యుడికి, శుక్రుడికి, భూమికి అనుసంధానం జరిగింది. అంటే భూమి ప్రజ్ఞలో శుక్రప్రజ్ఞను మరింత ఎక్కువగ ప్రవేశింప చేశారు. శుక్రుడు సూక్ష్మపదార్థానికి, సూక్ష్మప్రకృతికి ప్రతీక. భూమి స్థూల ప్రజ్ఞకి ప్రతీక. అంటే శుక్రుడు శ్రీదేవిలాంటిదైతే, భూమి భూదేవిలాంటిది. అంటే మన సూక్ష్మ శరీరానికి సంబంధించిన ప్రజ్ఞలో మార్పులు తీసుకురావడానికి, శుక్రప్రజ్ఞను మరింత తీవ్రంగా సూర్యుడి నుండి మనకి ఇచ్చారు.

ఇంకొకటి తెలుసుకోవాలి. ఇప్పుడు పాత జ్యోతిష్యం పని చేయదు. జ్యోతిష్యశాస్త్రం అంతా కూడా పండితులు పాతలెక్కలు కట్టుకుంటూ ఉంటే జరగదు. అదికూడ మాస్టరుగారే చెప్పారు. పోతరాజు నరసింహంగారు, సర్వేపల్లి రాధాకృష్ణన్ సహాధ్యాయి. వారు మహా పెద్ద పండితులు. వేదాంతంలో సరిసమానమైన జ్ఞానం కలిగినవారు. అందులో ఈ పోతరాజు నరసింహంగారు వారు ఒకసారి మాస్టరు సి.వి.వి. గారికి తన జాతకం పంపించి, నాకు ఈ రకమైన గ్రహస్థితి ఉన్నదని జ్యోతిష్యులు చెప్తున్నారూ, ఈ

విషయంలో మీ యొక్క అవగాహన కోరుతున్నానని వ్రాస్తే మాస్టర్ సి.వి.వి. గారు పోతరాజు నరసింహంగారికి ఒక ఉత్తరం వ్రాశారు. 'పాత జ్యోతిష్యం అయిపోయిందీ, కొత్త జ్యోతిష్యం వచ్చిందీ' అని మాస్టరు సి.వి.వి. గారు బీజప్రాయంగా మాట్లాడిన మాటలన్నిటికీ, వ్యాఖ్యలు మనకి మాస్టరు జ్వాలాకూల్ రచించిన గ్రంథాలలో ఉంటాయి. చాలా ఆశ్చర్యం వేస్తుంది. అంటే ఒకే దివ్యప్రణాళికకి మహాత్ములందరూ కలసి పనిచేస్తారు.

ఇంట్లో వంట ఏం చేస్తున్నారో పిల్లలకేమిటీ, తినేటప్పుడు చూసుకుంటే చాలదూ? అలాగే మనకి ఏం చేసి పెడుతుంటే బావుంటుందో అది వాళ్లు చేస్తుంటారు. సూర్యుడు నుండి సూర్యుడే పని చేయట్లేదు, వరుణుడు కూడా పనిచేస్తున్నాడు. అలాగే చంద్రుడి నుండి చంద్రుడే పనిచేయట్లేదు, శుక్రుడు, వరుణుడు, ఇంద్రుడు పనిచేస్తున్నారు. అందుచేత సూర్య చంద్రులనుండి మనకు అందుతున్నది వరుణగ్రహ ప్రభావము. అందుకే రకరకాలుగా, విపరీతంగా మార్పులు జరుగుతాయి. 'గ్రహాల పనులు మారినాయి. ఇదివరకు చేసే పనులు అవి చేయడం లేదూ, వాటికి కొత్త పనులు ఇచ్చారు, అందుకని నీ జాతకాన్ని నువ్వు మూసెయ్యి, నీ జీవితాన్ని ఇవాళ నుండి నేను నడిపిస్తానూ, నీ జాతకాన్ని నువ్వు చూసుకోకు' అని మాస్టరు సి.వి.వి. గారు చెప్పారు. ఇట్లా మనకి గ్రహముల యొక్క తీరుతెన్నులు మారుతుంటాయి. వాటి యొక్క functions మారుతుంటాయి.

మన గురుపూజల్లోనే మన Functions మార్చుకోమూ! అలాగే! మార్పు అనేది refreshing గా ఉంటుంది. Change is refreshing.

అట్లా దేశకాల పరిస్థితులను బట్టి జీవులకి, భూమికీ ఎది సౌఖ్యమో, శ్రేయస్సో దానికి సంబంధించి గ్రహములు కూడా వారి వారి కర్తవ్యాలని మార్చుకుంటూ ఉంటాయి. ఈ రోజు శని గ్రహము నుండి కూడా వరుణుడు పనిచేస్తున్నాడు. చాలా గ్రహములు నుండి వరుణుడే పని చేస్తున్నాడు. వరుణుడు ఎవరు? అగస్త్యుడే! ఆయన అంశావతారమే మాస్టరు సి.వి.వి. గారు. అందుచేత ఈ ప్రజ్ఞ నీలో పదార్థము నందు మార్పు తెస్తుంది. మిత్రప్రజ్ఞ జీవులకి సంబంధించి ఉంటే, వరుణ ప్రజ్ఞ వారి వాహికలకు సంబంధించి ఉంటుంది. అందుకే How can the statue can be stable unless the stage is stable అని మాస్టరుగారు అన్నారు. అందుచేత ఆయన నీ శరీరాన్ని repair చేస్తాను అన్నారు.

ప్రజ్ఞ ఎప్పుడూ ప్రజ్ఞే! ప్రజ్ఞకి చేయాల్సిన మార్పులు ఏమున్నాయి? విద్యుత్తుకు చేయాల్సిన మార్పులు ఏముంటాయి? బల్బుకు చేయాల్సిన మార్పు ఉంటుంది. సరిగ్గా వెలగాలి. అందుచేత వాహికలను నేను సరిదిద్దుతానురా అన్నారు. "నీ శరీరాన్ని సరిదిద్దుతాను. లోపల ఉల్లిపాయ పొరలా ఉన్న కోశాలన్నిటినీ శుభ్రపరుస్తాను. సూక్ష్మదేహాన్ని అమరిక చేస్తాను. దివ్యానుభూతులు కలిగిస్తాను". అని చెప్పారు. అంతే తప్ప జీవులకి పరిణామం కలిగిస్తాను అని చెప్పలేదు. I am a Master Mechanic. బండి repair చేస్తాను. బండి repair చేస్తే జీవుడు బావుంటాడు. బండిలో ఇరుక్కుపోయాడు కదా! అందుకే మాస్టరుగారి కార్యక్రమమంతా పదార్థమునందు త్వరిగతిని పరిణామం కలిగించుట. పదార్థము చాలా పరిణామం చెందుతూ వస్తోంది. ఇప్పుడు ఖనిజములు

పరిణామం చెందుతున్నాయి. వృక్షాలు పరిణామం చెందుతున్నాయి. ఈ జన్యువుల మార్పిడి కథ కూడా కుంభరాశి సంబంధమే! వరుణగ్రహ ప్రభావమే! ఎందుకంటే Inter Penetrating Energy Uranus అని చెప్తారు. దేన్నుండయినా చొచ్చుకొనిపోయి, లోతుల లోనికి పోయి దాన్నంతా సరిచేసి వచ్చేటటువంటి చాలా నిశితమైన ప్రజ్ఞ వరుణ ప్రజ్ఞ.

వరుణ గ్రహము కుంభరాశికి అధిదేవత. అందుచేత కుంభరాశిలో పనిచేసే ప్రజ్ఞ వరుణ ప్రజ్ఞ. మనకు వరుణ గ్రహము, కుంభరాశి ఇవన్నీ చాలా ముఖ్యమైన విషయాలు. అందుచేతనే పదార్థాలలో మార్పు, అన్నీ తేలిక అయిపోతున్నాయి. తేలిక అవడమేమిటి అన్నీ సూక్ష్మలోకాల్లోకి వెళ్ళిపోతున్నాయి. అన్నీ సూక్ష్మం చేస్తున్నారు కదా! ఇవాళ మీకు ఉత్తరాలు లేవు. Post Cards, Inland Letters, Covers లేవు. అన్నీ సూక్ష్మపదార్థంగా E-mail వస్తున్నది. పాశ్చాత్త్యదేశాల్లో పెద్దపెద్ద పోష్టాఫీసులన్నీ మూసేసారు. పూర్వకాలంలో పోర్టు పక్కనే హెడ్ పోష్టాఫీసులు ఉండేవి. ముంబాయి, మద్రాసులలో పోష్టాఫీసులు హార్బర్ పక్కనే ఉంటాయి. ఎందుకంటే నౌకల ద్వారా గుట్టల గుట్టల ఉత్తరాలు పంపుతూ ఉంటారు, వస్తుంటాయి. అలాంటిది ఇప్పుడు పోస్టుమేన్ లకి పనిలేదు. పోస్టుమేన్ ఇప్పుడు అంతరిక్షంలో నుండి వచ్చేశాడు. భూమి మీద ఇప్పుడు ఎక్కడ ఏం జరిగినా మనం ఇప్పటికిప్పుడు చూడవచ్చు. ఇవన్నీ ఏంటంటే మనం సూక్ష్మంలోకి వెడుతున్నాం.

అంతేకాదు ఇప్పుడు టెక్కట్స్ కూడా అలాగే వస్తున్నాయి. మనచేతిలో టిక్కెట్ లేకపోతే, ఏది ఏది అనుకుంటాం, టికెట్

ఉంది కాని నీకు కనబడదు. ఫలాన నంబరు నాది. P.N.R. Number పేరు ఇది అని చెప్పి నా టికెట్టు ఎక్కడుందో చూడు అంటే వాడు కంప్యూటర్‌లో చూస్తే వస్తుంది. నొక్కకపోతే ఎక్కడ ఉంది? ఇన్నిన్ని పుస్తకాలున్నాయి. ఏలిస్.ఏ. బెయిలీ పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. అన్నీ చిన్న సి.డి.లో ఉన్నాయి. మొత్తం బ్లావెట్స్కీ వాఙ్మయమంతా ఒక్క సి.డి.లో ఉంది. ఏమిటిది? ఆలోచించండి. ఇది కుంభరాశి ప్రభావము.

అలాగే నీవు కూడా! ఇంత మనిషివి కనిపిస్తున్నావే! నిజానికి నీవు ఇంతే! అది ఉపనిషత్తు చెప్పింది. *'అంగుష్ఠ మాత్రోపురుషః'* అని. నువ్వు "నీ బొటనవేలంతేరా ఉన్నదీ", అని. మీకు, మీ ఇంటికి పోల్చి చూసుకోండి. పరిమాణంలో ఎంత తేడా ఉందీ? అలాగే మీ నిజస్వరూపానికి, మీ భౌతిక శరీరానికి పరిమాణం అంత తేడా ఉన్నది. మరి ఇంత శరీరంలో ఉండేది వేలెడంత అంటే అన్నీ సూక్ష్మంగా అయిపోతున్నాయి. నిన్ను సూక్ష్మంగా చేయడానికి నేను వచ్చాను. నీ శరీరంలోని ధాతువులన్నీ తేలిక పరుస్తాను అంటే నిన్ను మాయం చేస్తాను అన్నారు. నీ శరీర ధాతువు లన్నిటినీ నేను తేలిక పరుస్తాను. ఆయన మాట్లాడినవన్నీ తీసిచూస్తే, ఓ పిచ్చాయన మాట్లాడినట్లుంటాయి. సరిగ్గా ఎవరికీ అర్థం కావు. ఎన్నో కోర్సు ఇచ్చారు. అవన్నీ చేసేసుకుంటాం, చదివేసుకుంటాం, కాని వాటి యొక్క అవగాహన లేదు.

1945 ముందర పుట్టిన శరీరానికీ, 1945 తర్వాత పుట్టిన శరీరానికి తేడా ఉన్నది. అలాగే 1962 తర్వాత పుట్టినవారు, అంతకు ముందు పుట్టిన వారికన్నా ఇంకొంచం సున్నితమైన

ధాతువులతో పుట్టారు. ఎందుకనీ? అప్పుడు మనకు అష్టగ్రహ కూటమి వచ్చింది. అది ఆధారంగా కుంభరాశి ప్రజ్ఞని ఇంకొంచం ప్రవేశపెట్టారు. 62లో పుట్టినవారి శరీరధాతువుల కన్నా 72లో పుట్టినవారి శరీరధాతువులు ఇంకొంచం సున్నితం. 76 మరి కొంచం సున్నితం. 88 మరి కొంచం సున్నితం. అట్లా శరీరాలలో మార్పులు తెస్తున్నారు. అందుకనే ఇంతంత కంచాల అన్నం తినరు. మన తాతయ్యలు తిన్నట్లు మనం భోంచెయ్యగలమా? గట్టిగా నాలుగు ముద్దలు తినేప్పటికే అయిపోతోంది! పని తక్కువ చేస్తున్నారా! చిన్నపిల్లలు అన్నం తినడమే లేదని తల్లులు బాధపడి పోతుంటారు. వాళ్ళు తినరు అంతే. వాళ్లు తినడానికి పుట్టలేదు.

మనం పొట్టకూటికై పుట్టితిమి. 'పొట్టకూటికై పుట్టితిమని సరిపెట్టి నిదుర పోకండి, పుట్టినందులకు రంగని దర్శనం పురుషార్థము సుమండి' అని చిన్నప్పుడు ఒకపాట ఉండేది. అలా వాళ్ళు పొట్టకూటికి పుట్టలేదు. వాళ్ళ మేధస్సో! ఏమిటో ఇంతింత చదువులు అని అంటూంటాం. అది మనకీ! వాళ్ళకవన్నీ చాలా సులభం. ఏమైందీ? నీ ధాతువుల్లో మార్పు వస్తోంది. నీ మెదడు పదార్థములో మార్పు వస్తోంది. నువ్వు తేలిక అవుతున్నావు. ఆయన, మొత్తం జాతినే పైకి లేపడానికి వచ్చాడు. భూమిని తేలిక చేస్తా నన్నాడు. శని సరిగ్గా పని చేయట్లేదు. దాన్ని కొంచెం rectify చేయడానికి వచ్చాను అని అన్నాడు. శుక్రగ్రహానికి rectification చేస్తున్నానన్నాడు. ఇట్లా మాట్లాడతుంటే పిచ్చి ఏమన్నా పుట్టిందేమో, ఆ పిడుగు శబ్దానికి లోపల అంతా తేడా పడిపోయిందేమో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు అని అనుకోమనండీ! అంతేకదా! జరుగుతున్నది కూడా అదే.

అదే సంవత్సరం విమానం కనిపెట్టారు. విమానం విమానం అంటే, నీ మొహం విమానం ఏమిటీ, నువ్వే విమానం అని చెప్పాడు. నీవే విమానం లాగ ఎగరగలవు కదా అని. మహాత్ము లంతా సూక్ష్మ శరీరంతో అదే చేస్తున్నారు. నీకూ ఆ స్థితి వస్తుంది. దానికోసమే ఈ యోగం మీకు ఇస్తున్నాను అన్నారు. యోగం ఎప్పుడు ఇచ్చారు? మాస్టరుగారిచ్చిన యోగం మన ఎలా నిర్వర్తించు కోవాలి? అసలు మాస్టరుగారు ఎవరు? అసలు ఆయన దిగివచ్చిన సందర్భములో అప్పుడుండే ఆ సన్నివేశమేమిటి?

పురాణపురుషుడు దిగివచ్చే సన్నివేశం గురించి మాస్టరుగారు "పురాణ పురుషుడు" పుస్తకంలో ఎంత అద్భుతంగా చిత్రీకరించారు? అంతటి వెలుగు రావడానికి ఎంతటి ప్రయత్నం జరిగింది. అలా మరి ఇంతటి పని జరగడానికి మొత్తం ఈ యుగపురుషుడే రావాలి కదా! యుగాన్ని ప్రారంభం చేయాలి కదా! అలాంటి వెలుగు, పంచభూతాలతో చేయబడిన మామూలు జీవుడిలో ప్రవేశించగలదా! పేలిపోతాడు. ఎవరినైతే దివ్యజ్ఞాన సమాజం వారు అందుకని, అనుకొని తయారు చేశారో, అక్కడ కాక అది ఎక్కడో దిగిపోయింది.

ఇక్కడ ఈయన పుట్టడమే కాదు, మేడం బ్లావెట్స్కీ శరీరంలో ఉండగా ఓసారి వెళ్ళి ఆమెను దర్శించి వచ్చాడు. ఆమె అడయారు లోని మర్రిచెట్టు కింద కూర్చొని ఉపన్యాసం చెప్తుంటే, తాను వచ్చి వెనకాల కూర్చొని ఒకసారి చూస్తే, ఆవిడ నిశ్చలం అయిపోయింది. Stunned for a moment. అప్పుడు ఒక నవ్వు నవ్వి వెళ్ళిపోతారు ఆయన. ఎందుచేత, తన గురించి ఒక పరిచయం ఆమెకి కలిగించాలి. ఎందుకంటే ఆమెతో ఆయనకి పని ఉన్నది. ఆమె

సూక్ష్మశరీరాన్ని, తర్వాత వెంకమ్మగారి శరీరంలో ప్రవేశపెట్టి పనిచేసుకున్నారు. వెంకమ్మగారి శరీరంలో మేడం బ్లావెట్స్కీ సూక్ష్మ శరీరాన్ని చేర్చడం చేతనే ఆ వెంకమ్మగారిద్వారా experiments చేసుకోగలిగారు సి.వి.వి.గారు, ఆయనకు అటువంటి పద్ధతి ఉంది. అరవిందమహర్షి కూడా సి.వి.వి.గారి ఆశీర్వచనం తీసుకొనే, పాండిచ్చేరి వెళ్ళి కూర్చున్నారు. ఇటువంటివన్నీ చాలా ఉన్నాయి. ఈయన ఒక యుగపురుషుడు.

ఆ దిగివచ్చిన యుగపురుషుడు మనలో కుంభ చైతన్య ప్రజ్ఞ ప్రవేశపెడదామనుకున్నారు. కాని మన ప్రజ్ఞ ఎక్కడో మూలాధారంలో తలకిందలుగా కిందపడి ఉంది. తల్లి యోనిలోంచి తలకిందులుగానే బైటకి వచ్చాం కృష్ణుడు ఎలా వచ్చాడండీ? తలకిందులుగా రాలేదు. కాళ్లతో వచ్చాడు. తేడా మరి తేడాయే. మామూలుగా మనం, శరీరంలో మూలాధారంలో ఎక్కడో తలకిందులుగా ఉంటాం ఎందుకంటే అన్నీ ఇంద్రియ వ్యామోహాలే మరి! భూమి, భూ సంబంధమైన విషయాలపట్ల ఆరాటం పోక అటు తిరిగి ఉంటాం. అక్కడ ఉన్నవాణ్ణి ఇటు తిప్పి, శీర్షాసనం నుండి ఉద్ధరించి వాణ్ణి నెమ్మదిగా పైకి తెచ్చుకోవాలి. మన బొడ్డు వరకు మనం వచ్చాం. ఎందుకనీ? మనకి కోరికలూ అవీ ఉన్నాయి కాబట్టి. ఆ బొడ్డు నుండి కంఠానికి పట్టుకొని వచ్చి, కంఠం నుండి ఫాలము పై భాగం వరకు అంటే ఆజ్ఞాచక్రము నుండి ఫాలము పై భాగం వరకుండే ఈ మార్గాన్ని కుంభమార్గం, కుంభరాశిమార్గం లేదా మరణ రహస్యం తెలిసిన మార్గము అంటారు. ఈ మార్గము నుండి పైకి వెడితే ఇది మార్కండేయుని మార్గము. ఇలా వెళ్లి

మార్కండేయుడు ఆజ్ఞ వరకు చేరి, మరణ రహస్యం తెలిసికొని బ్రహ్మమును చేరాడట. అటు నుండి ఒక గంధర్వుడు దిగి వస్తాడుట. అతడు ధేనుడు అనే గంధర్వుడు. ఇతడు ఏమీ లేని స్థితి నుండి ఏదో ఉన్న స్థితిలోనికి అన్నీ దింపుతుంటాడు. అంతవరకు పట్టుకు పోవాలి. అందుకని ఆయన కుంభరాశి ప్రజ్ఞ.

ఆయన ఉపదేశం ఎక్కడ ఇచ్చారు? ఏ నెలలో ఇచ్చారూ? మే 29న కదా ఉపదేశం ఇచ్చారు. అదే మన 'మే కాల్'. అది ఏ రాశికి సంబంధించినది? మిధునరాశికి సంబంధించినది. అంటే అది జెమిని. అది వాయుతత్త్వపు రాశి. కుంభరాశి, మిధునరాశి, తులారాశి వాయుతత్త్వపు రాశులు. తులలో ఇరుక్కున్న జీవుల్ని, అక్కడ నుండి ఉద్ధరించి, ఊర్ధ్వముఖం పట్టించడానికి ఆయన కుంభం నుండి మిధునానికి వచ్చారు. మనల్ని తుల నుండి మిధునానికి తీసుకువెడతారు. అందుచేత మన యోగానికి వాక్శుద్ధి చాలా ముఖ్యం.

శంకరాచార్యులవారు చెప్పారు మూడు శుద్ధులు కావాలని. దేహశుద్ధి, వాక్శుద్ధి, చిత్తశుద్ధి. అందులో వాక్శుద్ధి సత్సాధనకు చాల ముఖ్యం. మాటలలో మడతలు పెట్టేవారికి, మాటలతో మభ్యపెట్టేవాళ్లకి యోగం లేదు. వాక్కు నీకు శుద్ధి ఎంత కలిగించ గలదో అశుద్ధిని కూడా అంతే కలిగించగలదు. అందుకని మాస్టరుగారు విశుద్ధిచక్రం వరకు దిగివచ్చి, తులనుండి నిన్ను పైకి లాగడం కోసం 'మే కాల్' నాడు ఉపదేశం ఇచ్చారు. మహాత్ములంతా అలాగే మిధునమాసంలో ఉపదేశం ఇచ్చారు. మోజస్ అలా ఇచ్చారు. జీసస్ అలా ఇచ్చారు. మాస్టరుగారు

అలా ఇచ్చారు. జ్వాలాకూలుడు మిధున మాసాన్ని అధిష్టించి ఉన్నాడు. ప్రపంచానికి చాలా ఉపదేశములు చేస్తున్న మైత్రేయ మహర్షి ఆ మాస ప్రజ్ఞగా ఉన్నాడు. ప్రస్తుతము మైత్రేయుని బదులు జ్వాలకూలుడు ఉన్నాడు. 31 మార్చి నుండి 29 మే వరకు 60 రోజులు ఒక ఋతుకాలము తనలో దిగిన ప్రజ్ఞను మాస్టరుగారు రకరకములుగా దానితో ప్రయోగములు చేశారు. వచ్చిన ప్రజ్ఞని పట్టుకొని ఊర్ధ్వలోకముల నుండి ప్రాణములు కిందకు ఎలా తీసుకురావచ్చు అని కొన్ని ప్రయోగాలు. ఆ ప్రజ్ఞని పట్టుకొని శని గ్రహానికి ఎలా వెళ్ళవచ్చు, శుక్రగ్రహానికి ఎలా వెళ్ళవచ్చు, ఆ ప్రజ్ఞ ఆధారంగా సూక్ష్మశరీరాన్ని ఎలా నిర్మాణం చేయవచ్చు, ఆ ప్రజ్ఞ ఆధారంగా జీవుడికి మరణాన్ని ఎట్లా దాటించవచ్చు, అదే ప్రజ్ఞ ఆధారంగా బ్రహ్మమును ఎలా దర్శనం చేయవచ్చు, ఇవన్నీ 60 రోజులలో రకరకములైన ప్రయోగాలని చేస్తూ నోట్స్ రాసుకున్నారు.

అవన్నీ మనకి సంబంధించినవి కావు.మనం ఏం చేయాలో ఆయన ఒకటి ఇచ్చారు. ఆయనకోసం ఆయన రాసుకున్నారు. తేదీ వేసుకున్నారు. సమయం వేసుకున్నారు. బ్రహ్మం పేరు ఆయన M.T.A. అని పెట్టుకున్నారు. నాకు M.T.A. చెప్పారు అని రాసు కున్నారు. ఏమీలేదు, ఆయనే, ఆయన ప్రజ్ఞలో ఊర్ధ్వముఖంగా వెళ్ళినప్పుడు ఆ బ్రహ్మప్రజ్ఞ యందునప్పుడు ఆయనకి తోచినవి అన్నీ ఆయన రాసుకున్నారు. అవన్నీ చాలా mystical గా ఉంటాయి. ఆలీడియర్, ఆక్సీడియర్ అంటారు. మనకవన్నీ అవసరం లేదు. ఆయన చెప్పింది మనం చేయాలి. అందుచేత ఋతుకాలం ఆయన ఈ వచ్చిన ప్రజ్ఞతో, ఓ Scientist వలె రకరకముల ప్రయోగములు

చేసి దాని యొక్క తీరుతెన్నులు తెలుసుకున్నారు. దానికి ప్రధానమై నటువంటి గమ్యములుగా మనకి రెండు ఇచ్చారు. మరణాన్ని దాటడం, బ్రహ్మాన్ని పొందడం. దానికి సంబంధించిన యోగాన్ని మనకి అందించారు.

మాస్టరుగారి గురించి, ఏమిటేమిటో మాట్లాడుతుంటాం, మనకి ఏం తెలుసు? నేనొకసారి మన మాస్టరుగారిని, విశాఖపట్టణములో, సముద్రతీరంలో కూర్చున్నప్పుడు, మీరు ఎంతమంది గురించో ఎన్నేన్నో విషయాలు చెప్పారూ, సి.వి.వి.గారి గురించి మాట్లాడరేం అని అడిగాను. అది మాట్లాడగలిగిన విషయం కాదోయ్! ఎంత తెలిపితే అంత తెలుసుకోవడమే అన్నారు. నాకు కొంత అయినా అవగాహన ఇస్తారా అంటే మూడు, నాలుగు వాక్యాలు చెప్తాను అంతకాన్నా చెప్పలేను అన్నారు. చెప్పండి, అంటే "ఇక్కడ ఇసుక రేణువులలో నువ్వు ఒక రేణువుని తియ్యి అన్నారు." "అదేమిటండి" అన్నా! "అదంతే" అన్నారు. "ఇంతింత అని చెప్పడానికి వీల్లేదోయ్" ఆయన గురించి అన్నారు. ఆయన కాలిగోటికి సమానం ఈ భూమి" అన్నారు. ఇది గుర్తు పెట్టుకో, సాధన చేస్తుంటే నీకే తెలుస్తుంది. అంతేగాని చెప్పగలిగింది కాదు.

"రెండవది..... మళ్ళీ కృష్ణుడే వచ్చాడనుకో! నీకు కృష్ణ చైతన్యాన్ని అనుభూతి చెందితే ఎలా ఉంటుందో అదే ఇది, ఇదే అది అని తెలుసుకో. మాస్టరుగారి అనుభూతి కూడా అదే! మాస్టరు సి.వి.వి. పుస్తకంలో రాస్తారు. అందుచేత అటువంటి పరమోత్కృష్ట మైనట్టి చైతన్యానికి మాస్టరుగారు వాహికగా నిలిచారు. మనం మొదట నమస్కారమ్స్ మాస్టర్ అంటాం కదా! అది ఎవరూ? ఆ

తత్త్వమే! దానికి మొదటి వాహిక మాష్టరు సి.వి.వి. రెండవ వాహిక మాస్టరు యమ్.యన్. మూడవ వాహిక మాస్టరు ఇ.కె. వీలుంటే మీరు కూడా నాలుగవ వాహిక కావచ్చు. అందుచేత ఇది ఇంత మహత్తరమైన విషయం. దాన్ని ఎట్లా నిర్వర్తించుకోవాలి, అనేది మాష్టరుగారు దాన్ని ఏ విధంగా తీర్చి దిద్ది మనకి భృక్తరహితతారక రాజయోగముగా మలచి ఇచ్చారో, అది మనం నిర్వర్తించుకుంటే మనలో ఏం జరుగుతుందీ అనేది మనం తర్వాత తెలుసుకుందాం. పాశ్చ్యాత్త సోదరులకు 16, 18 సంవత్సరాలుగా బాగా విపులంగా వివరించడం జరిగింది. ఎందుకంటే మాస్టరుగారి గురించి మాట్లాడాలంటే సంవత్సరంలో రెండే అవకాశాలు. ఒకటి మే కాల్, రెండవది ఆగష్టు 4. మిగతా సమయంలో మనం మాట్లాడుదామనుకున్నా ఆయన అనుమతి ఇవ్వరు. మూడవది డిసెంబర్ కాల్.

ఇంతకన్నా వారి గురించి మనం ఆలోచించినా అందని విషయంగా ఉంటుంది. అంటే ఆయన అనుమతిస్తేనే మనం మాట్లాడగలం. ఆయన అనుమతిస్తేనే మనం ప్రార్థన చేసుకోగలము. ఇవాళ సాయంత్రం ప్రార్థన వద్దులే అని మనం అనుకుంటాం కదా! అది మనం అనుకోవడం కాదు. ఈ వెధవకి, ఈ వేళ సాయంత్రం ప్రార్థన కుదరదు. వీలుపడదు నేనివ్వను. ఎందుకని? పొద్దున్నుండి సాయంత్రం వరకు నీ ప్రవర్తన కారణంగా సాయంత్రం ప్రార్థన చేయని బుద్ధి నీకు కలుగుతుంది. నా విషయంలో నిర్ణయం నాదేరా, నీదేం లేదు, అని చెప్పారాయన, నువ్వు గురుపూజలకు రావాలన్నా, మాస్టర్ నమస్కారమ్స్ అనుకోవాలన్నా అది నా

అనుగ్రహమే అని చెప్పిన వారు మాస్టరుగారు. ఈ అవతారిక ఘట్టమును కొంచెం జాగ్రత్తగా అవగాహన చేసుకోవాలి. ఎందుకంటే దీనినే అందుకొని రకరకాలుగా ప్రయోగాలు చేస్తూ అందిస్తున్నారు. ఈ విషయాలన్నీ Aquarian Master అనే గ్రంథంలో ఉన్నాయి. మనకి పరమగురువులు మాస్టరు సి.వి.వి. ఆయన ఎవరు, ఆయన ఏం చేయడానికి వచ్చారు, ఏమిచ్చారు, మనల్ని ఏం చేసుకోమన్నారు ఇవన్నీ మనకు తెలియాలి. ఇది యోగమార్గము. యోగం ప్రధానంగా నడవాలి. ఇతరములైన పాండిత్యములన్నీ దానికి అనుపానంగా ఉండాలి. లేకపోతే పడవవాడిలాగ మునిగిపోతాం. మునిగేలోగా తేలి ఒడ్డుకు చేరుకుంటే బావుంటుంది.

'సమత్వం యోగ ముచ్ఛతే' అంటే ప్రకృతి పురుషుల యొక్క సమానత్వం. అదే మనకి అర్ధనారీశ్వర తత్త్వంగా ఇచ్చారు. అందుచేత మనం యోగము నుండి అవస్థితి చెందటానికి కారణము మనలో పదార్థం యొక్క మొగ్గు ఎక్కువ వుండటమే. ప్రజ్ఞ వైపుకన్నా పదార్థం వైపు మొగ్గు ఎక్కువ వుంటుంది. ఎందుకంటే క్రింది 3 లోకముల పదార్థం ఎక్కువ మందంగా వుండేట్లుగా, బలంగా వుండేట్లుగా స్వామిత్వం వహిస్తుంది. పై 3 లోకములు ప్రజ్ఞ ఎక్కువ కావటం చూపిస్తుంది. పై మూడూ, క్రింది మూడు రెండింటిని అనుసంధానం చేసే బుద్ధి లోకము రెండు ప్రజ్ఞలకు సరిసమాన స్థితిలో వుంటుంది. రెండూ ప్రకృతి పురుషులకు అదే బుద్ధి లోకం, అదే వెలుగు. వెలుగులో పదార్థమున్నది. కానీ సూక్ష్మంగా వుంటుంది. మనయందు కూడా వెలుగు వున్నది, సూక్ష్మంగా వుంది. కానీ పదార్థం యొక్క సాంద్రత ఎక్కువగా

వుండటం చేత మనలోని వెలుగు కనపడటం లేదు. మనలోని వెలుగు మనకే గోచరించుటలేదు.

మనం తేజోమూర్తులము, దివ్యస్వరూపులము అని ఎవరైనా చెప్పినా కూడా నమ్మబుద్ధి కాదు. కారణమేమిటంటే, బాగా మందం పెరిగిపోయింది. శరీర సాంద్రత పెరిగి పోయింది. అందుచేత యోగమున స్థిరపరచడానికి పదార్థంలో కొంత అమరిక చేస్తే కొంత మార్పు మనలో చక్కగా ఈ పదార్థం ఆధారంగా ఆ తత్త్వము వెలుగుతుంది. ఎందుచేతనంటే పరమ పురుషుడికి ప్రకృతియే శరీరము. అందుచేత ఆయన కనపడితే వెలుగుగానే కనిపిస్తాడు. అంటే ఆమె దేహంగానే ఆయన కనిపిస్తాడు. కేనోపనిషత్తులో చాలా బాగా ఈ విషయాన్ని చర్చిస్తారు. అందుచేత శివుడు కనబడితే, శివుడు కనబడటానికి రూపం కావాలి అది వెలుగు రూపంగానైనా రూపమే కదా! అందుకే నామ రూపాత్మక జగత్తు అంతా కూడా అమ్మ అధిష్ఠించి వుంటుంది అంటారు. అందుచేత మనలో పదార్థాన్ని మెరుగు పెట్టుకున్నాం అనుకోండి, పెట్టుకుంటే మనలో వెలుగు కనిపిస్తుంది. ఎందుకంటే ఈ భౌతికమైన పదార్థం కూడా 7 స్థితుల్లో వుంటుంది. ప్రకృతికి 7 అవస్థితులు వున్నాయి. దాని ప్రకారమే ప్రజ్ఞ అందులో వుంటున్నపుడు దాని యొక్క బాటలో వుంటుంది.

బాగా మందంగా వున్నటువంటి ఒక పాత్రలో ఒక దీపం పెడితే మనకు ఏమీ కనపడదు. ఆ పాత్ర యొక్క సాంద్రత బాగా తగ్గించుకుంటూ వెడితే లోపల నుంచి వెలుగు గోచరిస్తుంది. అందుచేత నేను దేహమును సరిదిద్ది యోగమునందు మిమ్మల్ని

స్థిరపరుస్తాను అని మాస్టరుగారు చెప్పారు. అంటే ఆయన శరీరాన్ని మరమ్మత్తులు చేయడానికి పూనుకున్నారు. మనం శరీరాలలో ఒక రకమైన పరిణామము ఈ కుంభయుగం వచ్చిన దగ్గర్నించి జరుగుతూ వస్తున్నదని, ఏ ఏ సంవత్సరాలలో ఎంతెంతో అవి మెరుగుపడుతూ వస్తున్నాయి, ఎంత చురుకుగా దేహములు వుంటున్నాయి, ఎంత తక్కువ పదార్థమయమైన ఆహారాన్ని తీసు కుంటూన్నాం, ఇటువంటివన్నీ తెలుపుకుంటూ వచ్చాను. ఎందు చేతనంటే అన్నమయ కోశమునకు, ప్రాణమయ కోశము బలాన్నిస్తుంది. అది కారణమంగా తిన్నది అరుగుతుంటుంది. ఇపుడు మనకొచ్చేటువంటి, ఇవ్వబడినటువంటి దేహాలకి ఇదివరకటి లాగా తిండి పెడితే కుదరదు. ఒక దున్నపోతు తిన్నట్లు ఆవు తినదు కదా, అలాగే ఒక గేదె తిన్నట్లు లేడి తినదు కదా ఎందుచేత అంటే శరీరం యొక్క సాంద్రతని బట్టి తక్కువ అవుతున్న కొద్దీ పదార్థ మయమైన ఆహారం తక్కువ తీసుకోవాలి.

అలాగే మనకి నీటిలోంచి ప్రాణమున్నది. గాలిలో ప్రాణ మున్నది, సూర్యరశ్మిలో ప్రాణమున్నది. ఈ ప్రాణము సూక్ష్మ ప్రాణము. ఆ ప్రాణములో మనకి ఎక్కువ ఆసక్తి కలిగి ఈ పదార్థమయమైన ఆహారం ద్వారా పొందే ప్రాణము నందు కొంత అనాసక్తి కలగడం అనేది ఈ కాలంలో వస్తున్న మార్పు. అది మాస్టరుగారు చేసిన మార్పు. మన శరీరంలో కోశాలు చెప్పాను. అన్నమయ కోశము, ప్రాణమయ కోశము ఈ రెండింటి మధ్య మనకి సూక్ష్మ శరీరం ఒకటి వున్నది. ఆ సూక్ష్మ శరీరమును అంటిపెట్టుకుని కామము కూడా వున్నది. కామశరీరం ఒకటి

వున్నది, కామము తగుమాత్రంగా నిర్వర్తించుకుంటే అనుభూతి వుంటుంది. అది మోతాదు మించితే ఆ శరీరం పెరిగి ప్రాణానికి అవరోధం కలిగిస్తుంది. ప్రాణానికి అవరోధం కలిగిస్తే అన్నమయ కోశానికి ప్రాణం యొక్క సరఫరా వుండదు.

అలాగే మనకి విజ్ఞానమయ కోశనమునకు, మన ప్రాణమయ కోశమునకు మధ్య మనోమయ కోశము వున్నది. అక్కడ భావములు అవీ అవరోధములే. ఈ కామమయ కోశాన్ని కామలోకం అంటాము. అక్కడ కోరికలు మనకి అవరోధములుగా వుంటాయి. ఈ అవరోధాలు తీసివేసి, మనకి చక్కగా పలుచనయిన కాంతి వంతమైన వెలుగుని అనుభూతి చెందే శరీరాన్ని ఏర్పాటు చేస్తాను అని మాస్టరుగారు చెప్పారు. దానికి కావలసిన ప్రాణమును కొనివచ్చి దేహమును సరిదిద్దుతాను అని చెప్పారు. ఆ ప్రాణమును కొనిరావడంచేతనే శరీర కోశములలో కొంత మెరుగుదల కన్పిస్తుంది. అందుకని మాస్టరుగారు ముందు మనతో చేసే పని ఏమిటంటే శరీరమును తీర్చిదిద్దుట.

శరీరమునకు నాడుల నుండి ప్రవహిస్తున్న వెలుగు ప్రసారం ఏదైతే వుందో అది అన్ని చక్రముల నుండి ఈ పంచభూతాత్మకమగు శరీరంలోకి చక్కగా ఏ అవరోధం లేకుండా ప్రాణము సరఫరా అయ్యేట్లు, ప్రవహించేట్లు చూస్తాను అని చెప్పారు. అందుచేత మాస్టరుగారు మన కిచ్చిన ప్రేయరు, ధ్యానము కాదు అది ప్రార్థనే. అది ఆయన ప్రార్థన అనే అన్నారు. ఏమిటి ప్రేయరు అంటే Master please Rectify and Develop our System. ఈ System (శరీరం) వున్నదే, దీనిని Rectify చేస్తానన్నారు. అందుచేత

ఈ యోగమును గమనించవలసిన విషయం ఏమిటంటే శరీరము నందు జరుగు మార్పులు, ఆ మార్పుల వలన ఏమి జరుగు తుందంటే మనలోకి ప్రతినిత్యం ప్రసరించే సూర్యుడి వెలుగు అవరోధములు లేకుండా అన్ని ధాతువులకి అందుతుంది. అలాగే సూర్యుడి నుంచి ప్రాణము కూడా ప్రవహిస్తున్నది. ప్రాణము, తెలివి రెండూ ప్రవహిస్తున్నాయి.

అలాగే గాలి నుండి కూడా మనకి ప్రాణము అందుతూ వున్నది. అది కూడా శరీరం చక్కగా అందుకోవడానికి వీలుపడు తుంది. కారణం ఏమిటంటే సూక్ష్మ శరీరం గనుక పటిష్టంగా వున్నట్లయితే మనం యోగంలో చెప్పుకునే షట్చక్రములన్నీ కూడా సూక్ష్మ శరీరానికి సంబంధించినవే. అవన్నీ Etheric Centres. అందుకుని సూక్ష్మ శరీరం పటిష్టంగా వుంటే విశుద్ధి నుండి మూలాధారం వరకు వుండే 5 చక్రముల ద్వారా పంచభూతములు మనలోకి ప్రవేశానికి అవరోధం లేకుండా వుంటుంది. అపుడే దేహం పుష్టిగా తయారు కావడానికి వీలుపడుతుంది.

అందుచేత  సూక్ష్మశరీరానికి పటిష్టత ఏర్పరచాలి. 'సూక్ష్మ దేహము అమరత్వం గావించి'- సూక్ష్మ దేహానికి అమరత్వం అంటే ఈ భౌతిక దేహము పడిపోయినా అది నిలచి వుండేటంతగా దాన్ని పటిష్టం చేయడం అనేది మాస్టరుగారి యోగంలో భాగం. సూక్ష్మ శరీరం పటిష్టంగా వుంటే షట్చక్రములు చాలా చురుకుగా పనిచేస్తాయి, వికసిస్తాయి. అవి చక్రములుగా కాకుండా పద్మము లుగా వికసిస్తాయి. చక్రములుగా వున్నపుడు అందుకున్న ప్రజ్ఞ ఏదైతే వున్నదో అది వృత్తాకారంగా తిరుగుతుంటుంది. పద్మములు

అయినపుడు అది వికసించి ఏదైతే సూర్యుడి నుంచి, వాయువు నుంచి, వేడిమి నుంచి, నీటి నుంచి మనము అందుకుటున్నామో దాన్ని మన శరీరానికి అందింపచేస్తాయి. అలా అందింప చేయ టానికి సూక్ష్మశరీరాన్ని పటిష్టం చేయాలి.

ఎపుడైతే సూక్ష్మ శరీరంలోకి శక్తి ప్రవేశిస్తుందో సూక్ష్మ శరీరంలోని షట్చక్రములు ఎపుడైతే చక్కగా విచ్చుకుంటాయో అపుడు మన గ్రంథులన్నీ చక్కగా స్రవిస్తాయి. ప్రతి వాఙ్మయంలోను మన గ్రంథులను ధేనువులు అంటారు. అవి స్రవించాలి. అవి వాన జల్లు కురిపిస్తాయి. అన్ని గ్రంథులు స్రవించగలవు. కానీ ప్రస్తుత మానవునిలో కొన్ని గ్రంథులే స్రవిస్తున్నాయి. అవి కూడా అడ్డగోలుగా వున్నాయి. అంటే మనకి స్వాధిష్టాన కేంద్రానికి సంబంధించిన గ్రంథులు అవకతవకగా స్రవిస్తుండటం వల్ల జబ్బులు వస్తున్నాయి. Hormonal disturbances, Endocranial disturbances, Internal secretions ఈ గ్రంథులన్నీ కూడా లోపల స్రవిస్తాయి. అవి దేహానికి పుష్టినిస్తాయి. లోపల స్రవించేవి స్రవించకపోతే పుష్టి వుండదు. అనాహతము అసలే స్రవించదు. మూలాధారం స్రవిస్తే భౌతిక దేహము చక్కగా లేత మొక్కవలె వుంటుంది. ఆ మూలాధారం సరిగ్గా స్రవించలేదనుకోండి, అన్నీ ఎక్కడి కక్కడ వంగవు. అన్నీ నొప్పులే అన్ని చోట్లా అన్నీ పట్టేస్తుంటాయి.

అందుచేతనే భౌతికమైన పదార్థం మూలాధార కేంద్రం నియమిస్తూంటుంది. అది సరిగా స్రవించాలి. స్వాధిష్టానము సరిగా స్రవించకపోతే మనకి రకరకముల రోగములు వస్తాయి. ఆడవారికి సంబంధించిన జబ్బులు, మగవారికి డయాబిటీస్

ఇటువంటివన్నీ వస్తూంటాయి. అలాగే మణిపూరకము. అన్నిటికీ మించి విశుద్ధి. దాని స్రవం మనకి సరిగా లేదు. ఎందుకంటే మన కెవరికి మాటే బాగుండదు. మాట ఎందుకు బాగుండదు, మనసు ఈర్ష్య, అసూయ, రాగము, ద్వేషము, కామము, క్రోధము, మదము, మాత్సర్యం అనే వాటితో నిండిపోయి వుంటుంది. వాటికి సంబంధించినవే మాటల్లో కుంటిమాటలు గాను, ఇతరులను బాధించే మాటలుగాను వస్తూంటాయి. ఏదో వంకర మాట మాట్లాడ కుండా వుండే పద్ధతే లేదు. ఎక్కువ అసూయ కలిగిన వారికి గొంతు నొప్పి వస్తుంది. అంతేకాదు, దానికి సంబంధించిన థైరాయిడ్ గ్లాండ్ అవకతకలతో స్రవిస్తుంటుంది. ఈ అవకతవకల వలనే శరీరంలో క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయి. Sacral Centre నుంచే Cancer పుడుతోంది అని మాస్టర్ జ్వాలాకూల్ వ్రాసారు.

అలాగే థైరాయిడ్ పుడుతోంది. కారణం ఏమిటంటే వాడికి మాట్లాడటం చేతకాదు. ఏది భూమి మీద అనుభవించాలో ఎటువంటి కోరిక వుండాలో తెలియదు. ఎటువంటి భావములు వుండాలో తెలియదు. ముందు చెప్పుకున్నాం కదా Learn how to Desire, Learn how to Think అవి లేవు. అందుచేత ఈ ధేనువులు, ఈ ఆవులన్నీ వట్టి పోయాయన్నమాట. అవి సరిగా పాలు ఇవ్వటం లేదు. అసలు స్రవించవలసిన అనాహత గ్రంధి స్రవించనే స్రవించదు యోగులకు తప్ప. అలాగే మనకి ఆజ్ఞ దగ్గర భ్రూమధ్యంలో స్రవించవలసిన గ్రంధి స్రవించదు. కేవలము యోగులకే షట్ గ్రంథులు స్రవిస్తాయి. అందుకని వారి శరీరం తుష్టి, పుష్టి కలిగి వుంటుంది, సుగంధములు వెదజల్లుతూ వుంటుంది.

కాబట్టి అమరికలు ఎక్కడనుంచి జరుగుతాయంటే సూక్ష్మశరీరం పటిష్టంగా వుంటే జరుగుతాయి. మొత్తం మన శరీరంలో జబ్బులన్నీ కూడా ఏ ఏ కేంద్రము సరిగా పని చేయట్లేదో దాన్ని ఆధారంగా ఆయా జబ్బులు వస్తాయని Esoteric Healing లో వ్రాస్తారు.

అందుచేత మనకి సూక్ష్మ శరీరానికి పటిష్టం కలిగిస్తే దేహం నాలుగు కాలాల పాటు వుంటుంది. నీ యోగమునకు అంతరాయము కలిగించదు. యోగానికి మొట్టమొదటి అంతరాయం అనారోగ్యం అని పతంజలి మహర్షి చెప్పారు. ఆరోగ్యం అనే విషయంలో జ్వాలాకూల్ మహర్షి ఏమి చెప్పారంటే, ప్రపంచంలో ఈ భూమి మీద ఆరోగ్యం అనేటువంటి విషయము లేనేలేదు. నీవు చేయవలసిన కర్తవ్యానికి నీకు అడ్డుపడనంత, నీ యోగమునకు అడ్డుపడనంత ఆరోగ్యం వుంటే అదృష్టవంతుడవే అన్నారు. ఎందుకంటే భూమికే జబ్బులున్నాయి. భూమి చుట్టూ వుండే పంచభూతాల నిండా అనారోగ్యం వ్యాపించి వున్నది. ఈ సందర్భంలో ఈ భూమి మీద వుండేవాడికి అంటే నీకు జబ్బు లేకపోవడం అనే ప్రశ్నే లేదు అని చెప్పారు.

అందుచేత నీకుండే అనారోగ్యములో నీ యోగమునకు అంతరాయము కలగనంత పటిష్టత్వం నీ దేహానికి నేను ఏర్పరుస్తాను. నీ ఆయుర్దాయం తత్కారణంగా పెరుగుతుంది. అపుడు నీవు యోగమునందు నిలవటానికి కావలసిన సాధన సంపత్తికి వలసిన సమయం దొరుకుతుంది. అందుకే సద్గురువు దగ్గరకు వెడితే ముందు ఆయుష్షు, ఆరోగ్యం ఆ తర్వాత ఈశ్వరత్వం ఈ మూడూ కలిగేట్లుగా ఆశీర్వదిస్తారు. మాస్టరుగారు 'నేను దేహాన్ని

సరిచేస్తాను' అంటే ఈ దేహాన్ని భౌతికమైన దేహాన్ని సరిచేయటానికి లోపల వున్న సూక్ష్మమైన కోశములను సరిచేస్తే అది బాగుపడు తుంది. దీన్నెంత సరిచేసినా ఒకటే, లోపల సరికావాలి. లోపల సరికావాలంటే నీవు ప్రార్థనలో కూర్చుంటే నేను చేసిపెడతాను అన్నారు. చేసిపెడితే ఆ కేంద్రములలో కొంత తాను ఇచ్చిన శబ్దతరంగములు, మహావాక్యముగా ఇచ్చునటువంటి శబ్దతరంగ ములు కొంత అలజడి కలిగించి అవసరమైన మార్పును ఈ షట్చక్రములలో ప్రత్యేకించి ముందు క్రింది చక్రములలో అంటే, విశుద్ధి నుండి మూలాధారం వరకు వుండే చక్రములలో కావలసిన మార్పులన్నీ చేస్తారు. ఇది ఒకటి లోపల జరిగే కార్యక్రమము.

నీ లోపల నీలోతులలో ఏమేమి జరుగుతున్నదో గమనించు చుండుము. అంటే అది ఒక విద్యుత్ ప్రవాహములాగా లోపల పనిచేస్తుంటే, ఈ సుషుమ్నలో మనకి ఆ 15 నిమిషాలో, 20 నిమిషాలో ఒక Feeble current pass అయినట్లుగా వుండటం చేత ఇవన్నీ సర్దుబాట్లు జరుగుతుంటాయి. ఆ సర్దుబాట్లు జరిగితే ఈ 5 చక్రముల నుండి పంచభూతముల ద్వారా అందుకునే ప్రజ్ఞ చక్కగా గ్రంథులకి అందజేయబడతాయి. అపుడు ఆ గ్రంథులు లేక ధేనువుల నుండి శరీరమునకు కావలసిన తుష్టి, పుష్టి ఏర్పడుతూ వస్తూ వుంటుంది.

మరి ప్రభాకరశాస్త్రిగారికి ఒక పూటలో ఆ పని మాస్టరు సి.వి.వి. గారు చేసినట్లుగా ప్రభాకరశాస్త్రిగారే వ్రాసారు మాస్టార్ యమ్.యన్. గారి విషయంలో చూస్తే అటువంటివి వారు ఎంతమందికో, ఎన్నో రకాలుగా చేసి చూపించారు. అందుచేత

ఆ ప్రజ్ఞా ప్రసారం 'మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్స్' అనే వాక్యం మనం పలికినపుడు ఆ ప్రజ్ఞాప్రసారం వలన ఈ రకమైన విద్యుత్ మనలో ఉద్భవించి, ఒక స్విచ్ వేసినట్లుగా 'గుయ్' మనే శబ్దం చాలా సూక్ష్మంగా మనలో వినిపిస్తుంది. అది ఎంతసేపు విని పిస్తూంటే అంతసేపు మనం కనులు తెరవలేము. అది వినిపించక పోతే కనులు తెరుస్తాము. అది మాస్టరుగారి లెక్క ప్రకారం 15 నిముషాల నుంచి 45 నిమిషాల వరకు జరుగుతుంది, అంతకన్నా జరగదు అని చెప్పారు. 45 నిమిషాలు గరిష్ఠ పరిమితి. 15 నిమిషాలు కనిష్ట పరిమితి.

ఆ విధంగా రోజూ ప్రొద్దున, సాయంత్రం మరమ్మత్తులు చేస్తూ వుంటే నీ శరీరము యోగమునకు అర్హత సంపాదించు కుంటుంది. అపుడు శరీరంలోనే భాగమైన విజ్ఞానమయ కోశమును మాస్టరుగారు వికసింపచేసి మన చేత దివ్య జ్ఞానంలోకి ఒక ప్రవేశం అందింప చేస్తారు.

ఈ విధంగా ఈ ప్రార్థన మనకి బాగా జరగాలంటే బాహ్య ప్రపంచంలో చెప్పిన పద్ధతిలో కొంత ముక్కుకి తాడు వేసుకోవాలి. అన్నీ ముట్టుకోకూడదు, అన్నీ ఎంగిలి చేయకూడదు. అంటే ఆహార వ్యవహారములుంటాయి. చూశారా, ఎక్కడికి వెళ్తున్నావు, నీ కాళ్ళతో ఎక్కడకి వెళుతున్నావు. కర్తవ్యమా కాదా కర్తవ్యం కాకపోతే వెళ్ళకు. శ్రేయస్సా ప్రేయస్సా. చేతులతో ఏం ముట్టుకుంటున్నావు. కర్తవ్యమా కాదా. చేతులు ఎలా వినియోగిస్తున్నావు? ఇలా పంచ కర్మేంద్రియ ములు, పంచేంద్రియములు వీటన్నిటినీ కూడా వినియోగంలో నియమమే దీక్ష. అలాగే వాక్కు మాస్టరుగారు మిథునం వరకూ

దిగి వచ్చి ఇక్కడ ఇస్తారు కంఠంలో మీరు మహావాక్యం పలికేటపుడు దాని యొక్క తరంగములను మీరు ఇక్కడ (కంఠంలో) అనుభూతి చెందాలి. మీరు మాట్లాడుతున్నపుడే మామూలుగా కొంత తరంగ ముల యొక్క అలజడి వుంటుంది. Friction వుంటుంది. అది మనము మాట్లాడుతున్నప్పుడు దానిలో వుండే భావాన్నిబట్టి అది మనకి పుష్టి నివ్వడమో లేక రోగాన్నివ్వ డమో చేస్తుంది. అందుచేత ఒక మహావాక్యాన్ని, మంత్రాన్ని పలికేటపుడు అంటూ వినాలి. వింటే స్విచ్ వుంటుంది. అక్కడ వుంది on చేయడానికి.

మాస్టరుగారు మే 29న ఉపదేశం ఇవ్వడానికి కారణం ఏమిటంటే తాను కుంభము నుండి మిథునమునకు దిగి వచ్చి తులలో ఇరుక్కుపోయినటువంటి, అంటే కోరికలతో భౌతిక ప్రపంచములో ఇమిడి పోయిన జీవుడిని ఊర్ధ్వంగా పిలుస్తారు. అది మే కాల్. The Master May Call and lift You up. May He lift up the Earth to the Kings of Beauty. అందుచేత ఆ విధమైన పిలుపు మనము ఆయన్ని పిలిస్తే ఆయన మనని పైకి తీసుకువెళ్తారు. అపుడు మనం హృదయంలోకి వచ్చి కూర్చోవచ్చు. అందుకని మంత్రాన్ని స్ఫూర్తివంతంగా ఉచ్ఛారణ చేయాలి. Master Namaskaram అన్నా, నమస్కారమ్ మాస్టర్ అన్నా పూర్తి భావన ఈ విశుద్ధిలో ఆ తరంగముల యొక్క అనుభూతి పొందేట్లుగా అక్కడ మనసు చేర్చాలి. మనసుతో అనాలి. అలా అని అటుపై హృదయమునందు మాస్టరుగారి దర్శనం చేయవచ్చు ఊహాత్మకం గానే. అది ఊహయే ముందు, లేదంటే భ్రూమధ్యంలో దర్శనం చేయవచ్చు.

దానికి ముందు అక్కడ ఆ రోజు దైనందిన కార్యక్రమం ఎలా నిర్వర్తించుకున్నావో దాన్ని బట్టి ప్రార్థన జరగడం, జరగక పోవడం వున్నది. నువ్వు ప్రార్థన మానేయడం కాదు. నేను నీకు అనుమతి ఇవ్వడం లేదు ప్రార్థన చేయటానికి అని. సాయంత్రం పూట ప్రార్థన చాలా మటుకు మానేస్తూ వుంటాం కదా. నువ్వు మానడం కాదురా నాకిష్టం లేదు నీవు చేయడం. ఎందుకంటే నీ ప్రవర్తన ఈ రోజుకి బాగోలేదు. "ప్రార్థన చేసేటువంటి చేతన కలిగి వుండేట్లుగా నీవు ప్రవర్తించలేదు. అందుచేత నీకు ప్రార్థన నిరాకరింపబడినది తప్ప నువ్వు ప్రార్థన నిరాకరించలేదు గుర్తు పెట్టుకో అని.

ఎందువలన అంటే ఆయన ప్రార్థన చేయటానికి ముందు రెండు నియమాలిచ్చారు. ప్రార్థన మూడో నియమం. ప్రార్థన చేయటానికి ఇచ్చినటువంటి రెండు నియమములు బాహ్య ప్రపంచంలో మనం పరచుకుపోకుండా ఒక నియతితో, చెప్పినట్లుగా గుంజకి కట్టివేసిన పశువువలె ఎక్కువ దూరం పోకుండా ఆ పరిధిలోనే తిరిగేట్లుగా జీవించడానికి 2 నియమాలు ఇచ్చారు. అవి 1. ఏ విషయంలోను చెయ్యి దేహి అన్నట్లు పెట్టక అన్నారు. "నీవు నావాడివి." ఏ రోజున అయితే నువ్వు నా నామం పలికావో ఆ రోజు నుంచి నీవు నా వాడవు. నీ సమస్తమైన విషయములు అంటే కేవలం ఆముష్మికమే కాదు, ఐహికమునకు కూడా సంబంధించిన బాధ్యత నాది. నీ మొత్తం జీవితం బాధ్యత నాది. అందుచేత "నీకు ఏదైనా కావవాలంటే నాకు చెప్పుకో" తప్ప బయట అడుక్కు తినక అని చెప్పారు.

ఏమీ అడగవద్దు నీక్కావలసింది నీ దగ్గరకు వస్తుంది. నీ దగ్గరకు నీవు కోరుకున్నది రాలేదు అంటే అది నీకవసరం లేదని గుర్తుపెట్టుకో. ఆలస్యమైందిట అంటే అది కూడా నా సంకల్పమే అని భావన చేసుకో. అందుచేత జరుగుతున్నదంతా నేనే చేస్తుంటాను. ఎపుడైతే నీవు నా నామమును ఉపదేశంగా అందు కున్నావో, ఆ రోజు నుంచి నీకు జరిగేదంతా నేనే జరిపిస్తాను. కాబట్టి జరుగుబాటుకి నీకు ఏ మాత్రం లోటు వుండదు. ఆ విశ్వాసం నీకు వుండాలి అది కూడా నేనే కల్పిస్తాను అన్నారు. ఇలా మనం ఎంత చేయి చాపడం మానేస్తే అంత మనకి కర్మ పెరగడం మానేస్తుంది. పుచ్చుకున్నదల్లా కర్మే. ఇచ్చినదల్లా కర్మ రాహిత్యం. ఋక్తం రహితం కావాలంటే బాగా అప్పులు చేసి వచ్చినవాడు ఇంకా అప్పులు పుచ్చుకుంటూ వుంటే ఎట్లా? అందుకని ఈ ప్రపంచం నుండి పుచ్చుకోవలసినదేమీ లేదు, ఈ ప్రపంచానికి ఇవ్వడమే అంటాడు భగవంతుడు శ్రీ కృష్ణుడు భగవద్గీతలో. 'పరహితము పరమ ధర్మము' పరులకు హితము చేయవలెను అని భాగవతంలో చెప్పారు. 'యజ్ఞార్థం కురు కర్మాణి' అని. యజ్ఞార్థం కోసం చెయ్యి స్వార్థం కోసం కాదు.

ఏపని చేసినా అందులో నీ కేమిటి అని చూసుకోకుండా చేసుకుంటూ వెళ్ళిపోవాలి. అపుడు మనకి ఇంక ఆగామి లేదు. అంటే పెంచుకునే కర్మ ఏమి లేదు. అది కాక ఇక ఇచ్చుకుంటూ పోయామనుకోండి. అది పరహితం.

యోగము యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి? మనందరికీ భౌతికలోకంలో వున్నటువంటి భౌతికమైన విషయములందు ఆసక్తి

కలిగి వున్న వారికి పదార్థం సహజంగా ప్రజ్ఞకన్నా ఎక్కువ బరువు కలిగి వున్నది. సరిసమానంగా లేదు. అమ్మవారు ఎక్కువ అయ్యవారు తక్కువ. అదేమిటి తక్కువ అంటే, ఏమీలేదు ఆయన నిద్రపోతూ వుంటాడు. అంటే కాళీ వున్నదనుకోండీ బొత్తిగా మీద ఎక్కేస్తుంది. ఆయన్ని క్రింది పడుకోబెట్టి ఆవిడ మీద నిల్చుంటుంది. అంటే మాదే మొత్తం అన్నట్లుగా వుంటుంది. అలాగే యశోదా కృష్ణులను తీసుకున్నారనుకోండి, కొంచెం ప్రకృతి ఒడిలోకి ప్రజ్ఞ చేరిందట అని అర్థం. అంటే హృదయంలో చేరటం. హృదయంలో ప్రజ్ఞ కొంచెం అలా మేల్కొంచటాన్ని యశోదా కృష్ణులుగా ఇస్తారు.

బొత్తిగా పదార్థమే స్వామిత్వం వహించి ప్రజ్ఞ ఎక్కడో మరుగున పడిపోయింది. అంటే Conscience అంటారు చూశారా, అది లేదన్నమాట బొత్తిగా మనకి అది ఖాళీ. యశోదా కృష్ణ అంటే హృదయంలో మేల్కొంచారని అటుపైన అర్ధనారీశ్వరుడు అయ్యాడట అంటే సగం సగం. అటుపైన వెంకటేశ్వరస్వామి అంటే ఆయన హృదయంలో ఆమె ఇమిడిపోయింది ఇలా 4 స్థితులు చెపుతారు యోగంలో. అందుకని మీరు సమాంతరంగా ఈ బాహ్య ప్రపంచం లోకి అటుపోయి ఇటుపోయి, ఇంక అక్కడుందిట అని అక్కడకెళ్ళి సంపాయిద్దాం, ఇక్కడకెళ్ళి సంపాయిద్దాం, అది పోగేద్దాం, ఇక్కడ ఆక్రమిద్దాం ఇలా వెళ్ళిపోయే Horizontal moment వుందే అది పదార్థాన్ని పెంచుతుంది. పుచ్చుకుంటూ వస్తే మణిపూరకంలోకి వెళ్ళిపోతారు.

దేవుడ్ని పుచ్చుకున్నవాడు గజాసురుడు కదా, నా పొట్టలో వుండమన్నాడు కదా! వాడి ననుగ్రహించడానికే పొట్ట చీల్చుకు

వచ్చాడు ఆయన. ఆ తరువాత ఏమైంది గజాసురుడుడికి, నాలో నువ్వు వుండు అని అనలేదు. నీ పనికి నన్ను వినియోగించుకో మన్నాడు. అది కదా మార్పు, గజాసురుడు నా చర్మం నువ్వు వాడుకో అంటే, నా శరీరం నువ్వు వాడుకో, నాబుర్రకాయ నువ్వే వాడుకో అంటే తీసుకెళ్ళి పెట్టాడు కదా. ఏనుగు చర్మం తను కట్టుకున్నాడు, ఏనుగు తల కుమారుడికి పెట్టాడు. కాబట్టి ఇపుడు ఏమైంది తల, శరీరం రెండూ కూడా దైవకార్యానికే వినయోగ పడేటట్లు గజాసురుడు ఉద్ధరింపబడ్డాడు. ఎపుడు? నన్ను నువ్వు వాడుకో అన్నప్పుడు. నిన్ను నేను వాడుకుంటా అన్నపుడు అది వేరు. ప్రస్తుతం ఆయన్ని మనం వాడుకున్నట్లుగానే మన జీవితాలు నడుస్తున్నాయి కదా. నాకోసం నువ్వు తప్ప, నీకోసం నేను అని కాదుగా. అందుచేత ఇది అర్థం చేసుకోవాలి.

ఎందుకంటే పదార్థానికి సమాంతర ప్రవాహం వున్నది నీరువలె. గ్రీష్మ ఋతువులో అదే నీరు ఊర్ధ్వ ముఖంగా అదృశ్యంగా తెలియకుండా ఆకాశానికి చేరుతుంది. అలా ఆకాశం చేరటం వలనే తర్వాత వచ్చిన వర్షఋతువులో అది క్రిందికి వస్తుంది. లేకపోతే ఎక్కడ నుంచి వస్తుంది ఆకాశంలోంచి? అందుకని మనం ఊర్ధ్వగతి చెంది, మళ్ళీ అటునుంచి నిర్మలమైన జలంగా క్రిందకి రావచ్చు. లేకపోతే ఉప్పునీరే. ఈ ఉప్పునీరే కదా ఊర్ధ్వంగా వెళ్ళేది. అందుచేత మాస్టరుగారు ఏమి చెప్పారంటే నీకున్న దాంట్లోనే వుండు నీక్కావలసింది పైనుంచి వస్తుంది. పై నుంచి అంటే నువ్వు అడక్కుండా నీకు ఏర్పాటు అవుతుంది. అది యమ్.యన్. గారి జీవితం అలాసాగింది. ఆయన ఎన్నడూ ఎవరినీ ఫీజు అడగలేదు.

ఎన్నెన్ని ఉత్సవాలో, 800 గజాల ఇల్లు. వెనకాల ఆగ్నేయంలో పెద్ద గాడిపొయ్యి, ఎప్పుడూ అక్కడ అన్నం, పులుసు, పప్పు, కూర నాలుగు పెద్ద పెద్ద గిన్నెలు ఉడుకుతూనే వుండేవట. ఎంతోమంది వచ్చి భోజనం చేస్తూండేవారు. అక్కడే యోగం చేసుకుంటూ వుండేవారు. ఆ పక్కన చెరువులో స్నానం చేసి అక్కడే పడుకుంటూ వుండేవారు. మరి ఎంత దివ్యంగా సాగిపోయిందో, అలా సాగదు. మాములుగా, ఫీజులడిగే వాళ్ళకి అలా సాగదు. అడక్కపోతే మాస్టరుగారు సంతోషించి నీవు ఊహించిన దాని కన్నా ఎక్కువ ఇస్తారు. అది మాస్టరుగారి యోగంలో నేను ప్రత్యేకంగా అనుభూతి చెందిన విషయం. నీవు కోరకు, నీకు ఏదన్నా బలీయంగా వుంటే ఆ కోరిక నాకు చెప్పుకో చెప్పుకుంటే నేను ఏమి చేస్తానంటే, అది నీకు శ్రేయస్సు కలిగించేది అయితే తీరుస్తాను. అది శ్రేయస్సు కలిగించనిది అయితే నీకు ఆ కోరిక మీద వుండే పట్టు తీసేస్తా. రెండూ ఒకటే.

ఒక మసాలా దోశ తిందామనే తీవ్రమైన కోరిక వుండటం, తిందామనేది బొత్తిగా మర్చిపోవడం రెండు ఒకటే కదా. తిన్నాకూడా మళ్ళీ తిందాం అనిపించవచ్చు. అసలు మర్చిపోతే ఇక అసలు గొడవేలేదు. ఇక దాని జోలికే మన మనస్సు పోలేదనుకోండి, ఇలా ఆయన కామ శరీరాన్ని చక్కగా సర్దటానికి ఈ మార్గం ఇచ్చారు. నిజంగా ఇది ఋషులిచ్చిన మార్గమే. ఎందుకంటే మనకి మొదట్నుంచి ఇచ్చింది తపస్సు, స్వాధ్యాయము, పరహితము మూడే. Those three are Meditation, Study and Service.

Study అంటే పుస్తకాలు చదవమని కాదు స్వ-అధ్యాయము అంటే నిన్ను నీవు అధ్యయనము చేయి. అంటే ఏమిటి? నీ

ఆలోచనలు, నీ కోరికలు ఎలా వున్నాయి, దైవం గురించి నీకు ఏదన్నా భావన కలుగుతుందా, దాన్ని గురించి ఏదన్నా సోదా చేద్దాం అని అనిపిస్తుందా, నీ దైనందిన కార్యక్రమాలు ఎట్లా నిర్వర్తించుకుంటున్నావు, ఇదీ స్వాధ్యాయము అంటే. నీ గురించే గ్రంథాల్లో కూడా చెపుతారు. అందుకని అది కూడా చదువుతావు. ముందర స్వాధ్యాయము అంటే నిన్ను నీవు చదువుకోవాలి. "నీ పుస్తకం చదువు". మామూలు పుస్తకాలికేమి, నీ పుస్తకమే కనిపిస్తుంది ఆ పుస్తకాల్లో జాగ్రత్తగా చదువుకుంటే అదీ స్వాధ్యాయము అంటే. అందుచేత ఆ విధంగా మనకు పెద్దలు ఇచ్చారు. అదే మాస్టరుగారు సులువుగా ఏమి చేశారంటే ఇలా నువ్వు చెయ్యి చాపక, ఉన్నంతలో ఇస్తూండు రూపాయి వుంటే కాని ఇవ్వు. రూ॥ 10/- లు వుంటే ఒక రూపాయివ్వు. రూ॥ 100/-లు వుంటే, రూ॥ 10/-లు ఇవ్వు. అంతే తప్ప పుచ్చుకుందాం అని చూడక. నీకేం కావాలో నేను చూస్తా. Inflow నేను చూస్తా. Outflow మాత్రం నువ్వు చూస్కుంటుండు అని చెప్పారు. ఎక్కడా దాన్ని ఆపక కూడ బెట్టక, పోనిస్తూండు. వస్తూంటుంది, అది అయిపోవడం అంటూ వుండదు అన్నారు. ఇది యజ్ఞార్థ కర్మ.

ఇలా చేయటంలో ఏమవుతుందంటే మనలో వుండేటటువంటి ధన సంజ్ఞకి విప్పారడం వస్తుంది. ఋణ సంజ్ఞ తగ్గుతుంటుంది. Negative అంటే Receptivity. Negivity is receptivity కదా. To receive is feminine or negative to give. ఉత్తరధృవం అనుకోండి అంతా అంతరిక్షం నుంచి ప్రజ్ఞ అంతా అలా భూమికి Distribute చేస్తూంటుంది. దక్షిణధృవం అంతా పోగు చేసుకుంటుంది. మరి

ఉత్తరధృవంలోనే మన ఉత్తరధృవం అంటే ఈ శిరస్సు పైన వున్నది. అందుచేత ఈ ఇచ్చి పుచ్చుకోవడం అనేది చూశారూ ఈ వ్యాపారంలో నువ్వు పుచ్చుకోవటం కన్నా ఇచ్చుకోవడం అనేది ఎక్కువైతే నీకు తెలియకుండా కర్మక్షాళనం అయిపోతుంది. అదే ఆయన భృక్తరహిత మార్గం. అందుచేత నువ్వు ఏదన్నా పట్టుకు దాచుకున్నా కూడా పట్టుకుపోవడానికి ఆయనే పంపిస్తాడు మనుష్యుల్ని.

మాస్టరుగారి మార్గంలో నీ దగ్గర వుండకూడనిది నీకుంటే అది పట్టుకుపోవడానికి ఏవడో ఒకడు వస్తాడు. అది దానంగా ఇవ్వకపోతే అప్పుగా పట్టుకుపోతాడు. అది దానంతో సరిసమానంగా అయిపోతుంది. ఎందుకంటే తిరిగిరాదు. కాకపోతే, వ్యథ వుంటుంది ఇంకా ఎపుడో వస్తుందని, కాని రాదు. అందుకని అలా ఆయన తమాషాగా భృక్తాన్ని రహితం చేస్తారు. అలాగే జబ్బుల విషయంలో గాని, సమస్యల విషయంలో గానీ, ధనం విషయంలో గానీ, ప్రతి విషయంలో కూడా నీవు ఇటు చూడక నీవు అటే చూడు. నీ దృష్టి ఊర్ధ్వమై వుండాలి. ఇటు కేవలం కర్తవ్యమే మిగలాలి. ఇటు కర్తవ్యం మిగలడం కోసం ఇటు నుంచి అటు వెళ్ళటానికి వెసులు బాటు కలిగించడానికి ఈ నియమం ఒకటి ఇచ్చారు. ఈ నియమాన్ని పాటించడం బట్టి వుంటుంది మనకి ప్రార్థన జరగడం. పదిమందికి చేస్తున్నాం అనుకుంటూ వాడిచేత చేయించుకుంటున్నామా అన్నది కూడా చూసుకోవాలి. సేవ చేస్తున్నామా సేవ చేయించుకుంటు న్నామా అనేది గుర్తు పెట్టుకోవాలి.

ఎప్పుడూ కూడా మనం చేసి పెట్టేది మనం చేయించుకునే దానికన్నా ఎక్కువ వుంటే, అంటే కప్ప బావిలోంచి మూడు

అడుగులు పైకి ఎగిరి రెండు అడుగులు క్రిందకి పడితే ఫర్వాలేదు ఒక అడుగు పైకి ఎక్కినట్లే. అలా కాక మూడు అడుగులు పైకి ఎగిరి నాలుగు అడుగులు క్రింద పడిందనుకోండి, నిష్పత్తి ఇచ్చి పుచ్చుకోవడంలో 3:4 అయితే క్రిందకి వెళ్ళిపోతుంది. ఇంత యోగంలో వుంటూనే తెలియదు క్రిందకి వెళ్ళిపోతున్నామని. యోగం జరగదు. అంతా అస్తవ్యస్తంగా వుంటుంది జీవితం. నిష్పత్తి 4:3 వుందనుకోండి క్రమశః విడుదల వస్తుంది. మనకి మాస్టరుగారు ఏమిచ్చారంటే మాస్టర్ సి.వి.వి. ఇచ్చినవే Spiritual Psycology ధ్యానాలు. Let Horizontals Meet Verticles అని ఇచ్చారు. ఈ Horizontal ఏమిటి? Vertical ఏమిటి? Horizontal అంటే ప్రజ్ఞ ప్రసారం ఇలా సమాంతరంగా బాహ్యంలోకి ప్రవహించడం. ప్రొద్దునే లేచిన దగ్గర్నుంచి ఒకటే పరుగు కదా. పరుగే పరుగు ప్రపంచంలోకి. దైవం పేరున, గురువు పేరున కూడా పరుగే! ఇట్లా, ఎలాగూ పరిగెడతావు నీవు. అలవాటు, నీ కది అభ్యాసం. ఆ పరిగెట్టిన తర్వాత పరిగెత్తి ఇస్తుండు అన్నారు. పరిగెత్తి వెళ్ళి ఇవ్వు, పరిగెత్తి వెళ్ళి తెచ్చుకోకు. అన్ని చోట్లకు వెళ్ళి అన్నీ పోగేసుకు రాకు. అన్ని రకాలుగా పేడ బెల్లం పోగేసుకు వస్తే ఏమిటండి ఉపయోగం? ఉన్నవన్నీ ఇచ్చుకుంటే ఇంటికి వచ్చేసరికి తేలిక పడిపోతాం. అదీ ఆయన చెప్పేది. అలా వెళ్ళి పోయావంటే తిరిగి రాలేవురా అని చెప్పారు కదా.

అందుకని నీన్ను ఈ గుంజకి ఈ విధంగా కట్టేస్తారు. అంతకాన్న పోలేవు మళ్ళీ తిరిగి వస్తావు. తిరిగి రావాలంటే ఇచ్చుకుంటూ పోవాలండి. ఇచ్చుకుంటూ పోవడమంటే డబ్బులనే

కాదు ఇతరులకు ఉపయోగపడుతూ పోవాలి. అందుకనే మన మాస్టరుగారు కూడా 'యోగము అంటే ఉపయోగమే' అని ఒక నిర్వచనం కూడా ఇచ్చారు. ఒక స్థితిలో అలా చేస్తూంటే ఏమౌ తుంది? నీ ప్రజ్ఞ తొందరగా ఇంటికి పోదాం అంటుంది. ఊరికే బజార్లో అక్కడా, ఇక్కడా అల్లరి చిల్లరగా తిరిగేవాడు ఇంటికి ఒక పట్టాన రాడు గానీ, ఏదో పనిమేరకు చూసుకునే వాడు తొందరగా ఇంటికి వస్తాడు. చీట్లపేక ఆడేవారు, క్లబ్బులకు వెళ్లేవారు, త్రాగుడికి పోయేవారు, వాళ్ళు అర్ధరాత్రి దాకా ఇంటికిరారు కదా. అవన్నీ అక్కర్లేనీ పనులే కదా. అంటే అక్కర్లేని పనిలో బాగా ఇమిడిపోయి అదే అంతా అనుకుంటూ భ్రమలలో, భ్రాంతులలో జీవించేవాడు ఇంటికి రాడు, రాలేడు. ఇలా బజార్లలో తిరుగుతూ వుంటాడు. ఏది భావము అంటే ఆలోచనలు, కోరికలు, బైట పనులు. ఈ మూడింటితో సతమతం అయిపోతూ ఇంటికే రాడు వాడు. వాడిని ప్రకృతి ఇంటికి తెచ్చుకుంటుంది నిద్ర రూపంలో, అలా తెచ్చుకుని సాపు చేసి మళ్ళీ ప్రొద్దున పంపితే ఇహ పో బజారులోకి అంటే ఊరకుక్క టైపులో వుంటారు. అంతా మామూలే కదా! అదే జాతికుక్క అయితే గేటు దాటదు. మనం చెప్పుకున్నాం కుక్క కథ. అందుచేత వుండటం అనే దానికి యజ్ఞము, దానము, తపస్సు వంటి అభ్యాసాలు ఈ అవకాశం ఏర్పరుస్తాయి అన్నాడు శ్రీకృష్ణుడు.

భగవద్గీతలో చెప్పారు '*యజ్ఞార్థం కురు కర్మాణి*' అని, కర్తవ్య నిర్వహణే తప్ప ఫలాన్ని ఆశించకు అని చెప్పారు. మళ్ళీ ఆ కర్మ నిర్వహణలో '*మా కర్మఫలహేతుర్భూః*' అందులోంచి ఏదో తెచ్చు కోకు. '*మాతే సంగోస్తు కర్మణి*', అది జరిగిన తర్వాత అదేదో

బాగా జరిగితే దానికి అలా జిగురేసుకుని అతుక్కుపోకు. అది మనం చేసిన పనులకు మనమే అతుక్కుపోతుంటాం బాగున్నాయని. అందుచేత నీ నుంచి పుట్టుకు వచ్చిన కర్మలకి నువ్వు అతుక్కు పోనక్కర్లేదు సత్కార్యాలకి. ఎలాగూ అతుక్కోవు తప్పించుకు తిరుగుదా మనే చూస్తావు. వాటిని చేసేటపుడు వంకర వద్దు వాటిలో ఫలితాలు వద్దు. చెయ్యాలి కాబట్టి చేయ్యాలి. అది ఒక యజ్ఞం అంతటితో అయ్యిందా? ఇచ్చుకుంటూ పో అన్నాడు దానం. మాస్టరుగారు చెప్పినదేంటంటే, ఈ బయట ప్రపంచం నుంచి త్వరగా లోపలకు రావాలి అనే బుద్ధి నీకు ఎపుడూ వుండటం కోసం.

ఈ మొత్తం అంతా దైవం యొక్క స్వరూపమే, అంతర్యామి రూపమే 'విశ్వం విష్ణుః' అంటోంది విష్ణు సహస్రనామం. '*విష్ణుండు విశ్వంబు, విష్ణుని కంటెను వేఱేమియును లేదు.*' అంటూ మొదలు పెడతాడు సూతుడు భాగవతం. కాబట్టి దాన్ని ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకు దర్శిస్తుంటాం, చూస్తుంటాం, వింటుంటాం. ఈ చూసేది, వినేది నన్నే అని గుర్తు పెట్టుకోమన్నారు. నన్నే అంటే? అసలు దేవుడి పేరు 'నేను'. మన పేరు నేను. శరీరం పేరు నేను అన్నింటికీ ఒకటే. ఒకే నేను ముగ్గురు కవల పిల్లలకి పెట్టేశారన్న మాట. పురుషోత్తముడి పేరు నేను, అక్షరపురుషుడి పేరు నేను, క్షరపురుషుడి పేరు 'నేను'. నేను బజారుకుకి వెళ్ళాను అంటే ఏమిటి వెళ్ళింది? ఇదేగా. నేను ధ్యానం చేస్తున్నాను అంటే జీవుడిగా నేను. 'నేను నేనైన నేను' అంటే దేవుడిగా ఇలా వున్నాయి కదా. అంటే అహమస్మి, సోహమస్మి, బ్రహ్మోహమస్మి ఈ మొత్తం నేనుగానే దర్శనం చేయమని భగవద్గీత చెప్తోంది. 'ఈశ్వరస్సర్వ భూతానం

హృద్దేశే అర్జునతిష్ఠతి'. 'ఈశావాస్యమిదం జగత్' అన్నీ వున్నాయి కదా. ఎన్ని ఉంటే ఏమి లాభం? గుర్తు రావాలి.

అది గుర్తు వస్తోందో లేదో ప్రొద్దున్నించి సాయంత్రం వరకు మన వాళ్ళు కనపడ్డారనుకోండి, వాళ్ళందరూ ఒకే మాస్టరుగారి యొక్క రూపాలు అనుకుంటే సాధనలో వున్నట్లు, అలా కాదనుకుంటే ఏదో వున్నట్లు. "పూల కుండీలో కూడా ఇట్లా చూడటం నేర్చు కోవాలి. 'ఉతత్వః పశ్యన్నదదర్శ వాచం ఉతత్వ శృణ్వన్న శృణోత్యేనామ్' అని సరస్వతీ సూక్తంలో మనకి వస్తుంది. నన్ను చూస్తూనే వుంటారు నన్ను చూడరు, నన్ను వింటూనే వుంటారు నన్ను వినరు అని ఘోషిస్తోంది దైవం. అందుచేత మాస్టరుగారు ఏమన్నారంటే ప్రొద్దున్న నుంచి సాయంత్రం వరకు లేచి చూస్తావు కదా, వింటుంటావు కదా, నన్ను ఎంతసేపు చూస్తున్నావు అంటారు. అదొక సాధన.

అసలు ఇంటావిడ కనబడగానే మర్చిపోతాం ఇంటావిడని చూడగానే ఇంటావిడే గుర్తుకు వస్తుంది. ఇంటావిడ రూపంలో మాస్టరుగారు వచ్చారని ఎవరికైనా గుర్తుందేమిటి? ఇంటాయన్ని చూస్తే ఇంటావిడకి గుర్తుకు వస్తారా మాస్టరుగారు? కష్టం. అక్కడుంది సాధన అంతా. ఇంటాయనకి ఇంటావిడ మాస్టరుగారు. ఇంటావిడకి ఇంటాయన మాస్టరుగారు. ఇద్దరికీ పిల్లలు మాస్టరుగారు. తల్లి తండ్రులు మాస్టరుగారు. పని మనుషులు మాస్టరుగారు. ఇక్కడ మొదలు పెట్టాలి. మొదలు పెట్టి బయటకు వెళతాం అక్కడంతా మాస్టరుగారు, ఇది ఒక నియమం. అలా మనకి చేసి చూపించారు మాస్టరుగారు. అందుకే మొన్న వ్రాసిన

పుస్తకానికి ఏ పేరు పెట్టాలంటే, 'మన మాస్టరుగారు' అని పేరు పెడదాం అన్నాను. ఎందుకంటే మనకందరికీ ఆయనే కదా 'మాస్టరుగారు'. ఆయన అలా నడిచి చూపించారు. ఎవరు కనబడ్డా అదే కదా, 'ఓం ఇతి ఏతత్' అదే ఇది. అదే ఇదిగా వుందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.

'ఇతి ఏతత్' అంటే, అదే ఇదిగా వున్నది అని. ఆ మధ్య సినిమాలో కూడా అదే వాడారు అదే ఇది అని. అదే ఇది అంటే ఎంతమందికి అర్థం అవుతుంది? అది ఉపనిషత్తు వాక్యం. వాడు తెలిసి వాడాడో, తెలియక వాడాడో బ్రహ్మాండంగా వాడాడు. అలా మనకి అదే ఇది. నిన్ను ఇబ్బంది పెట్టేవాడు కూడా అదే అని చెప్పారు మాస్టరుగారు, అదీ తమాషా. పెళ్ళాం ఇబ్బంది పెడుతోంది అనుకోండి, మాస్టరుగారే ఇబ్బంది పెడుతున్నారు. పెళ్ళాం కాదు, ఏదో వున్నది నీకు. నిన్నే ఎందుకు ఇబ్బంది పెట్టింది, మిగతావాళ్ళకి వాళ్ళ పెళ్ళాలు ఇబ్బంది పెట్టడం లేదే. అందుకనే మన మాస్టరుగారి దగ్గరికి వెళితే, నీకే ఎందుకు వచ్చిందిరా ఈ కష్టం అనేవారు. ఇది నీకే ఎందుకు జరుగుతోందంటావు, అంటే అది ఖర్మం అని చెప్పడం. మాస్టరుగారిని చూడు, మాస్టరు గారిని పెంచు. నీకుండే సమస్యల్లో మాస్టరుగారుని దర్శనం చేస్తే అది దాన్ని అక్కడికక్కడ తమాషాగా పరిష్కారం చేసేస్తారు. అందుచేత రూపం నేను. జీవుల ప్రవర్తనల్లో నన్ను చూడు. దీన్ని నువ్వు ఎంత చేయగలవో అంత యోగంలో ప్రవేశించటానికి అర్హత సంపాదిస్తావు. ఈ రెండు దీక్షలు చేయి అపుడు ప్రార్థన చేయి. అపుడు చూడు రుచి. ఆ రుచి వేరు, అంతకు ముందు రుచి వేరు.

మాస్టరుగారు సర్వ ప్రయోజనములకు ప్రేయరు ఒక్కటి చాలు అన్నారు. ఇపుడు నేను మీకు చెప్పిన నియమాలు రెండూ మన మాస్టరుగారికి మాస్టరు సి.వి.వి. గారు ఇచ్చినవి. ఆ రెండూ నియమాలు మనం ప్రతినిత్యం చేయటానికి చూడాలి. అపుడు మనకి ఏమవుతుందంటే మనలో అందరి యందు 'అందరిలో అంతరాత్మ దేవుని ప్రతి రూపమే'. ఏదో ఇవన్నీ చదువుతుంటాం. కానీ ప్రవర్తనలో మార్పు రాదు. అలా మనం పెంచుకుంటూ పోవాలి. ఇవాళ ఒకరినే చూడగలిగాం, రేపు ఇద్దర్లో చూస్తాం, ఎల్లుండి ముగ్గురిలో... అలా ఏదో 10 ఏళ్ళకో, 15 ఏళ్ళకో, 25 ఏళ్ళకో ఏదో కాస్త పదిమందిలో చూడగలిగే బుద్ధి వస్తుందా, రాదా? 'అభ్యాసం కూసు విద్య' అన్నారు కదా! కూసు అంటే చిన్న పిల్ల అని అర్థం. కూచి అని కన్నడంలో వున్నది. కూచి అంటే చిన్నది. అభ్యాసం చేస్తే ఎంత విద్య అయినా చిన్న విద్య అయిపోతుంది. చిన్న పిల్ల తాడు మీద నడుస్తోంది సర్కస్‌లో. చిన్నపిల్ల కాబట్టి నడుస్తుందా. పెద్ద వాళ్ళూ నడుస్తున్నారు. భుజాలమీద అటొకటి, ఇటొకటి, నెత్తిమీద ఒకటి పెట్టుకొని. అదెలాగండి, ఏమిటీ దానికి రహస్యం? అభ్యాసమే.

అందుచేత ఈ రెండు అభ్యాసములు మనకి ప్రతిరోజూ అభ్యసించటానికి ఒక అవకాశంగా భావించాలి. అలా భావిస్తే మనలో త్వరితగతిన మార్పు వస్తుంది. ఈ రెండు సూత్రాలు, బాహ్యకర్మ నుండి కావలసిన సాధన సంపత్తి అంతా భగవద్గీతలోనే వున్నది. ఎందుకంటే మకరం గురించి చెప్పాను, ఆ మకరం పట్టిందంటే ఇక ఆ పట్టుకు అంతే లేదు. అటు తిరిగితే ఇటు

వదులుతుంది. మరి అటు తిరగనిస్తుందా, తిరగనివ్వదే ప్రార్థన చేయటానికి టైము ఏదండీ అంటారు. మరికొంతమంది చాలా సేపు చేస్తూంటారు. తపస్సులు చేస్తున్నారు. మరి వారికెలా వీలు పడింది? మనకెందుకు వీలుపడలేదు. పదార్థంలోకి మనం చొచ్చుకు పోవడం వలన దాని యొక్క సాంద్రత మనలో పెరిగిపోతుంటుంది. ఈ రెండు నియమాలతో ముందు పలుచబడుతుంటాం.

రకరకాల యజ్ఞాలు పెట్టారు. అన్నీ ఇచ్చుకుంటూ పోయే యజ్ఞం పెట్టలేదు ఎవ్వరు. ఉన్నదంతా ఇచ్చుకుంటూ పోతాం. ఎందుకు అట్లా ఇచ్చుకుంటూ పోవడం? ఇచ్చుకున్న కొద్దీ కర్మరాహిత్యం పెరుగుతుంది. పుచ్చుకున్న కొద్దీ కర్మ పెరుగుతుంది. అందుకని ఉత్తరధృవం వైపుకి పోవాలంటే ఇచ్చుకుంటు పోవాలి. దక్షిణధృవం వైపుకి పోవాలంటే పుచ్చుకుంటూ పోవాలి. యోగంలో పైకి లేస్తారట. ఎలా లేస్తారు? ధనసంఖ్యని చేస్తే ఇలా వుంది. మరి అంతా వైజ్ఞానికం. యోగం అంతా చాలా శాస్త్రీయమైనటు వంటి విషయం. అందుచేత ఒక్కొక్క సద్గురువు ఒక్కొక్క రకంగా దీక్ష ఇస్తారు. మొత్తం అంతా ఆయన బాగా పట్టి చూసి ఎంత సులువుగా వీళ్ళకి అందిస్తే బాగుంటుంది, అని వాళ్ళ ప్రయత్నం. వాళ్ళ ఆరాటం. పాఠ్య పుస్తకాలున్నాయి. అవి చదువుకుని పరీక్షలు వ్రాయవచ్చుగా. మధ్యలో టీచర్లెందుకు? తెలుగు వాచకం వున్నది, లెక్కలకు వాచకం వున్నది. వాచకాలన్నీ చదువుకుని పరీక్షలు వ్రాయవచ్చుగా బడిలో టీచరు ఏమి చేస్తాడు? టీచరు ఆ వాచకంలో ఉన్నటువంటి విషయాలను నీకు సులభంగా ఆకళింపు అయ్యేట్లు చేస్తాడు కదా. అలా పరమగురువులు, సద్గురువులు వారంతా

ఔపోసనపట్టి ఎంత సులువుగా ఈ విద్య అందించాలి అని ఆలోచించి అత్యంత సులువుగా అందించడానికి ప్రయత్నం చేస్తుంటారు.

అందుచేత ఒక్కొక్క సద్గురువు తాను ఇచ్చే మహావాక్యంతో పాటు దీక్ష ఇస్తారు. దీక్షలేని జీవితం, శిక్షణ లేని జంతువులాంటిదే. ఒక ఎద్దుకి గానీ, దున్నపోతుకు గానీ, పిల్లికి గానీ, ఒక కుక్కకి గానీ, ఒక పావురానికి గానీ శిక్షణ ఇస్తే చాలా చక్కగా ప్రవర్తిస్తుంది. మరి శరీరం జంతువే వాహనమే. అందుకని శిక్షణ ముందు కావాలి, అదియే దీక్ష. ఆ దీక్ష జరిగిన తర్వాత మహావాక్యం జీవుడికి అంటే అది అక్షరపురుషుడి నుండి క్షరపురుషుడు కాస్త విసురుబాటుగా నువ్వు అట్లా వుండరా అని చెప్పవచ్చు. అక్షర పురుషుడిని చూడండి, మనం కారు దిగి లోపలకి వస్తాం కదా, స్కూటరు దిగి లోపలకి వస్తాం కదా, చెప్పులు వదిలేసి లోపలకి వస్తాం కదా. అట్లా కాస్త నవ్వు కూర్చో, నేను లోపలకి వెళతాను అంటే వెళ్ళనిస్తుంది. లేకపోతే వెళ్ళనీయదు. ఎందుకంటే లోపల కూర్చున్నా బయట విషయాలేగా. హృదయంలో కూర్చోండి, అది ఊహించండి అంటారు. అది హృదయంలో వుంటేగా అది బజారుకు పోతుంది, ఆఫీసుకి వెళుతుంది, ఎక్కడెక్కడికో పోతుంది. అదేంటి అంటే, దానికి శిక్షణ లేదు ఊరకుక్కలాగ. జాతి కుక్క అయితే కూర్చో అంటే కూర్చుంటుంది. నుంచో అంటే నుంచుంటుంది. బయటకు వెళ్ళు అంటే బయటకు వెళుతుంది. బంతి వేస్తే తెచ్చి వస్తుంది. అంతా శిక్షణే. ఈ శరీరానికి శిక్షణ కోసమే దీక్ష. అందుకని ఈ దీక్ష. మనకు సద్గురువు ఏదిస్తే అది తు.చ. తప్ప కుండా ఆచరించాలి. అందులోంచి లబ్ది పొందటం అనేది అజ్ఞానం.

ఏమిటి లబ్ధి? ఒక లబ్ధి ధనము. ఇంకొక లబ్ధి కీర్తి. మరియొక లబ్ధి అనుయాయులు. మనచుట్టూ చాలామంది చేరతారు కదా. ఎక్కువ మంది చేరుతున్న కొద్దీ మనకి బాధ్యత ఎక్కువ అవుతోందని తెలుసుకో అని మన మాస్టరుగారికి దేవాపి మహర్షి గారు చెప్పారు. పదిమంది మనచుట్టూ చేరితే వాళ్ళతో కులాసాగ కబుర్లు చెప్పటం కాదు. వాళ్లు ఎందుకు చేరారు? నీ ప్రవర్తన బట్టి చేరారు. కాబట్టి నీవేమి చేయాలి ప్రవర్తనని ఇంకా పెంచాలి. పెంచితే వాళ్ళకీ స్ఫూర్తి కలిగి, వాళ్లు అట్లా ప్రవర్తించాలి. అంతే తప్ప వాళ్ళని వాడుకోవడం, వాళ్ళని మన పనుల కోసం తిప్పుకోవడం, వాళ్ళని వినియోగం చేసుకోవడం అయితే గురువు శిష్యుడవుతాడు. శిష్యుడు గురువు అవుతాడు. ఎందుకని ఈయన ఋణసంజ్ఞలోకి ప్రవేశిస్తాడూ, వాళ్ళు ధనసంజ్ఞలోకి వస్తారు. అంటే గురువుగారికి శిష్యుడు ఎక్కువ చేసాడుట అంటే గురువుకన్నా పెద్దవాడు అయిపోయాడు. గురువు లోబడిపోతాడూ కూడా కదా. Obligatory కర్మ అంటారు. జ్వాలా కూల్ మహర్షి. అందుచేత ఈ విధంగా ఈ 2 నియమాలు ముఖ్యంగా చేసుకుంటేనే ప్రార్థన యొక్క రుచి తెలుస్తుంది.

మనం ఈ 2 నియమాలు ఏ మాత్రం చేస్తున్నాం అని చూసుకోవటానికి మాస్టరుగారు డైరీ పెట్టుకోమన్నారు. ఏవో పెద్ద పెద్ద విషయాలు మనకి పరమగురువులు చెప్పేస్తారని కాదు. ఈ ప్రాథమికమైన విషయాలు వ్రాసుకో. ఈ రోజు పుచ్చుకున్న దెంత? ఇచ్చినదెంత నిష్పక్షపాతంగా వ్రాయి. నీకే ఇతరుల కోసం కాదు డైరీ. ఈ రోజు ఎంతమందిలో చూడగలిగాం దైవాన్ని, లేక మాస్టరు గారిని ఎంతమందిలో విస్మరించాం వ్రాసుకోవాలి. అందుకు డైరీ.

అటుపైన ప్రార్థన. నీ యొక్క ప్రయత్నం కూడా దానికి అనుపానంగా పనిచేస్తుంది. మాస్టరుగారు ఒకపక్క లోపలనుంచి శుభ్రం చేస్తూంటే నీవు బయట నుంచి మురికిఅంతా తెచ్చుకుంటూ వుంటుంటే, బాగా శుభ్రం చేస్తాడట అని పేడ పెంట తెచ్చి ఇంట్లో వేస్తుంటే ఎట్లా, దానికి వ్యతిరేకంగా నువ్వు పని చేస్తూ నీవు యోగంలో వున్నాననుకుంటే ఎట్లా? మనకి తెలియక మనం నిర్వర్తించుకునే యోగానికి మనమే అవ్యతిరేకంగా పని చేస్తూంటాము. అందుచేత ఈ రెండు దీక్షలు చాలా ముఖ్య మవుతాయి. వెనక్కి తిరిగి చూస్తే పదిమందికి పెట్టిందే వుండాలి. పది మందికి చేసిందే వుండాలి. ఎంతమందిలో వీలుంటే అంత మందిలో మాస్టరుగారిని చూడటం మొదలు పెట్టాలి.

మన భాగవత మూర్తులందరూ ఇదే చేశారు. అందరిలోనూ ఆయన్నే చూశారు. ఉన్నది ఇచ్చుకుంటూ పోయారు. ఇచ్చుకుంటూ పోతే వస్తూ వచ్చింది. దివ్యశక్తి దగ్గరకు వస్తుంది. నువ్వు ఇది బయటకు తోసేస్తుంటే అది దిగి రావడానికి చోటు వస్తుంది. ఇంట్లోకి రండి అని ఇంటి నిండా సామాన్లు పెడితే ఎక్కడకి వస్తాడు లోపలకి రండి లోపలకి అంటే, లోపల అంతా గోడౌను లాగా వుంటే లోపలకి ఎలా వస్తాడు? అందుకని పదార్థం మాయం అయినటువంటి మనస్సులోకి దైవం ఎలా చొరబడతాడు, అవదు కదా. కాబట్టి మనం ఈ 2 దీక్షలు బాగా గుర్తు పెట్టుకోవాలి. మీకు తెలియదని కాదు ఇటువంటి సమయంలో మళ్ళీ మళ్ళీ చెప్పుకోవాలి. కాబట్టి చెప్పుకుంటున్నాం. అటుపైన ప్రార్థన మీరు ఉచ్చారణ చేయండి.

మాస్టరుగారు ఏమన్నారంటే నన్ను స్మరించండి అన్నారు. స్మరించి నన్ను ఒక్కసారి నీయందు స్థాపితం చేసుకో హృదయములో. నేను నీ హృదయంలో కూర్చుని ఇలాంటి వీరాసనమే వేసుకుని నిన్ను ఆశీర్వదిస్తున్నట్లు భావన చేసుకో. అటుపైన కళ్ళు మూసుకో. హృదయంలో గురువును ఎలా దర్శించాలి, తన్ను తాను ఎలా దర్శించాలి అనేది జ్వాలాకూల్ మహర్షి Letters on Occult Meditations అనే పుస్తకంలో చాలా బాగా ఇచ్చారు. ఆయనేం చెపుతారంటే అది ఊహే, అయినా చాలా రమ్యంగా వుంటుంది. కాబట్టి నీ గురువు ఇచ్చిన మహావాక్యం నీవు పలికిన తర్వాత, నీ హృదయం అనేటువంటి గుహ, అది బంగారపు గుహ. ఎందుకంటే, అది సింహరాశికి సంబంధించినది. కాబట్టి ఆ గుహలో ఒక వేదిక ఏర్పాటు చేసుకో. నీవు మహావాక్యం చదివే సందర్భంలో నీవు హృదయంలో ఆ బంగారపు గుహలో కూర్చుని ఆ మహావాక్యాన్ని పలుకు. పలికి, వాక్యం పూర్తయి నువ్వు నమస్కారము పెట్టుకునే సందర్భంలో నీవు అనుసరిస్తున్నటువంటి సద్గురువు ఆ వేదిక మీద, ఆ పీఠం మీద కూర్చున్నట్లుగా భావన చేసుకో. భావన చేసి ఆయన ఆశీర్వచనం తీసుకో. స్ఫూర్తి కోసం షోడశ ఉపచారములతో పూజ చేసుకో. ఆయన బంగారపు గుహలో కూర్చుని బంగారపు కాంతితో కన్పిస్తాడు. నీవు బంగారు కాంతితో కన్పిస్తావు. నిన్ను కూడా చూడమంటారు ఆయన.

ఎందుకంటే అదే నీ నిజ స్వరూపము. ఇది దాని తొక్కు, తోలు, అది కొబ్బరి, ఇది పీచు, అందుచేత అందులో ఆయన్ని అలా దర్శనం చేసి నీ కన్నా నాలుగు రెట్లు పెద్దవాడుగా పరిమాణం

వున్నట్లుగా ఆయన్ని చూడమంటారు. ఎందుకంటే అది అంతే సత్యం. ఒక వేలెడంత అయిపోయావు. నీ రూపంతో నువ్వు అక్కడ కూర్చున్నావు, ఆయన వేదిక మీద కూర్చున్నారు పీఠం మీద, ఆయన పాదాల దగ్గర నీవు కూర్చున్నావు. ఆయనకి పాదపూజ చేస్తున్నావు. అందుకే పాదుకాస్తవము శంకరాచార్యుల వారు ఇచ్చినది. అటుపైన ఆయన్ని పరిపూర్ణంగా నఖశిఖపర్యంతం నీవు దర్శనం చెయ్యి మీరు నన్ను యోగ మార్గంలో ప్రవేశపెట్టి ఉద్ధరించండని కోరుకో. నీలోని రుగ్మతలు ఏమన్నా వుంటే అవి సరి చేయమని కోరుకో. అలా కోరుకోమన్నారు సి.వి.వి. గారు Master please rectify and develop my System అన్నారు. అలాగే Health Adjustments. చాలా ఇచ్చారు ఆయన. నీకేమైనా వుంటే అక్కడ చెప్పుకో, అటుపైన యోగము.

ముందు రెండు దీక్షలు బాగా పరిపూర్ణం ఐతే ఇక చెప్పుకోవటాలు ఏమి వుండవు. అయితే అపుడు ఆయన్ని నీవు దర్శించి, ఆయన కనులలోకి చూసి, కనులు మూసుకున్నట్లుగా భావన చేయి. లోపల ఎలాగు మూసుకునే వుంటావు. ఈ క్షరపురుషుడు అక్షరపురుషుడిని లోపల దర్శిస్తున్నట్లు, లోపల కెళ్ళావు కదా. అంతర్ముఖమైనటువంటి స్థితిలోనే అంతఃకరణ శరీరంలో అక్షర పురుషుడు ఒకడుంటాడు. ఈ హృదయం నుండి శిరస్సు వరకు అక్షరపురుషుడి యొక్క గృహము వున్నది. అందులో దైవం కూడా దిగుతాడు. నరనారాయణులు ఇద్దరూ వుండే గుహ అది. ఇది క్షరపురుషుడికి సంబంధించినది. ఇందులోకి అక్షర పురుషుడు దిగుతాడు. కానీ దైవం దిగడు. ఇది పూర్తయి మొత్తం అంతా

అయిన తర్వాత తిరిగి వస్తే అపుడు అణు వణువునా దైవమే వుంటాడు.

అందుకని ఈ క్షరపురుషుడు అక్షరపురుషుడిని దర్శిస్తూ అతడిని అంగుష్టమాత్ర పురుషుడుగా చూస్తూ ధ్యానం చేస్తూ వుంటే ముందు అతనితో యోగం జరుగుతూ వుంటుంది. యోగము అంటే దేహాత్మ, జీవాత్మ, పరమాత్మ. లేక క్షరపురుషుడు, అక్షరపురుషుడు, పురుషోత్తముడు. అసలు పురుషోత్తమ ప్రాప్తి క్షరపురుషుడుకి లేదు. అక్షరపురుషుడికే వుంది. అందుచేత నీవు లోపల నిన్ను దర్శించు. నీతో పాటు నీ సద్గురువు, నీకు మార్గదర్శకత్వం వహిస్తున్న వారిని దర్శించు. అటుపైన ఆ గుహలో కళ్లు మూసుకు కూర్చో, కూర్చుంటే బాహ్యవిషయాల నుంచి కొంత కర్మరాహిత్యము ఒక పక్క జరుగుతూ వుంటూంది. భృక్తం రహితం అయిపోతూంటే ఈ మనస్సు లోపలే ఎక్కువ వుండటానికి ప్రయత్నం చేస్తుంది. బయటకు పోదు.

త్వరగా ఇంటికి పోదాం అనుకుంటాడు బుద్ధిమంతుడు. అర్ధరాత్రి అయినా ఇల్లు చేరడు బుద్ధిహీనుడు. అలాగే తర్వగా ఇంటికి పోదామంటే, ఇక్కడికి పోవటంగా తయారువుతుంది నీకు. అంటే పనులుంటే చూసుకోవటం మళ్ళీ లోపల కళ్ళు మూసుకు కూర్చోవటంగా వుంటుంది. నేను మాస్టరుగారిని అలా చూసాను. చాలా సార్లు కారులో ప్రయాణం చేస్తూంటే నేను డ్రైవింగు చేస్తూంటే, ఆయన ప్రక్కన కూర్చునేవారు. వెనకాల మనవాళ్లు కూర్చుని వుండేవారు. ఏదో మంచి మాటలు నాలుగూ వినిపిస్తున్నపుడు ఆయన మాట్లాడుతుండేవారు. అవి పిచ్చి మాటల్లోకి వెళ్ళగానే ఆయన నిద్రపోతున్నట్లు పడుకునేవారు. ఎందుకంటే ఈ జనంలోకి

ఆయన వెళ్ళడం అవసరం లేదు కదా. ఇలా చాలా సార్లు చూసి మీరు మాటి మాటికీ నిద్రపోలేరు కదా. మీరు ఏమిటి సోऽహం చేసుకుంటూ లోపలకి వెళ్ళిపోతున్నారా అని అడిగితే, అవునయ్యా అన్నారు.

మనం వుండవలసినది అక్కడ. గుర్తుపెట్టుకోండి యోగ సాధకులకు హృదయం అనేటువంటి గుహలో ప్రవేశించడం. అక్కడ వుండేటువంటి కళ, రంగుని, వర్ణాన్ని 'రుక్మము' అన్నారు, బంగారము అన్నారు. సింహరాశి యొక్క రంగు కూడా బంగారము అందుకని శ్రావణ మాసంలో బంగారం కోనుక్కో మన్నారు. బంగారం కొనుక్కోవడం అంటే ఈ గుహలో బంగారం కొను క్కోవాలి. అది చూసుకోవాలి. ఇక బయటకి వెళ్ళి ఒక చిన్న బంగారం కొన్నాం, లేకపోతే ఒక తులం బంగారం కొన్నాం, లేకపోతే ఈ కొంచెం కొన్నాం. ఈ గాజు కొనుక్కున్నాం. ఇది కాదు కొనుక్కోవలసింది. మనమే బంగారం అని మనకి అభ్యాసం చేత సత్యం అని తెలుస్తుంది. అదలా వుండగా అందులో నువ్వు ఉండగా నీకు బాహ్యస్మృతి తగ్గుతుండగా అంతఃస్మృతి పెరుగు తుంటుంది. పెరుగుతుంటే అక్కడ మాస్టరు గారే నీకు కావలసి నటువంటి సమస్తమైనటువంటి విషయాలను బోధిస్తానన్నారు.

నీకు ఎప్పుడు ఏది అవసరమో అది లోపల నేను బోధిస్తానని చెప్పారు. ప్రభాకరశాస్త్రిగారు వ్రాసింది చదువుకోండి. అది పూర్తి పేజీ కూడా లేదు. కానీ, సమస్తం అందులోనే వున్నది. అది సత్యం. నీకు లోపల నుంచే అన్నీ చెపుతారు. అదీ, నీవు హృదయ మును చేరినపుడు మాత్రమే, ఎందుకంటే అక్కడ నీవు బుద్ధి

లోకంలో వుంటావు. అక్కడ నీవు అక్షరపురుషుడవు. అందుచేత అక్షరపురుషుడుగా పురుషోత్తముడిని ధ్యానం చేయాలి. తప్ప క్షరపురుషుడిగా కాదు. రథం ఏ విధంగా కృష్ణుడిని ఆరాధన చేయలేదో, అర్జునుడు ఏవిధంగా చేయగలడో, అలాగే శరీరంతో కాదు దైవన్ని ఆరాధన చేయడం. శరీరం ఒక సాధన అందులో నుంచి నీవు లోపలకి ప్రవేశిస్తే, లోపల అంతఃకరణ శరీరం వున్నది. యోగం అంతఃకరణ శరీరానికి సంబంధించినది. అక్కడకి వెళితేనే యోగం.

అది ప్రాణాయామం ద్వారా చేరవలసిందని పతంజలి మహర్షి చెపుతారు. ధ్యానం ద్వారా చేరవచ్చు. సద్గురువులు వారు గ్రహించిన దాన్ని సులువుగా ఇటు తీసుకు వస్తారు. మనస్సు ఎక్కడ రమ్యత వుంటే, ఎక్కడ అందం వుంటే, ఎక్కడ ఆకర్షణ వుంటే అక్కడ చేరిపోతూ వుంటుంది. అందుకని ఈ గుహని నీవు ఎంతో చక్కగా, ఎంతో అద్భుతంగా ఊహించుకో అందులో నిన్ను కూడా ఊహించుకో. పూర్తిగా బంగారం పూసేసుకున్నట్లు, ఆ వేదిక బంగారం, ఆ వేదిక మీదకి దిగి వచ్చే గురువు నీకన్నా నాలుగింతలు ఎక్కువ పరిమాణం ఉన్నట్లు ఊహించుకో. ఆయన కనులలోనుంచి ప్రజ్ఞ నీ కనులలోకి ప్రసరిస్తున్నట్లుగా భావించి కనులు మూసుకో. అలా కనులు మూసుకుంటే నీకు ఇక బాహ్యస్మృతి లేక, అంత రంగంలో ఆ బంగారపు కాంతిలో నీవు వుంటూ వుంటే నీకు క్రమశః నీ శరీరం కూడా తేలిక అయి ఊర్ధ్వగతి చెందుతూ వుంటుంది. అంటే ఊర్ధ్వగతి చెందటం అంటే ఏమైందంటే

హృదయం నుండి వంద నాడులు క్రిందకి చేతనను ప్రవహింప చేస్తుంటే ఒక్కటి పైకి వెళ్తుందని, దాన్నే ముఖ్యప్రాణమని అంటారు.

ఆ ముఖ్యప్రాణాన్నే హనుమంతుడని కూడా అంటారు. ఆయన మహేంద్రగిరి నుంచి దూకుతాడు కదా. మహేంద్రగిరి అంటే విశుద్ధిచక్రం. అందుచేత ఆ విధంగా ఆ ముఖ్యప్రాణము ఊర్ధ్వముఖంగా వెళుతుంది. నీవు అందులో పైకి వెళుతున్నట్లుగా వుంటుంది. యోగంలో చెపుతారు 'చిత్రిణి' అనేటువంటి నాడి పట్టుకుని జీవ ప్రజ్ఞ ఊర్ధ్వముఖం అవుతూంటుంది, తేలిక అవుతున్న కొద్దీ, మనం ముందుకు సాగుతున్న కొద్దీ మనకి రకరకములైన జ్ఞానములు లోపల నుంచి సద్గురువు యొక్క ఆశీర్వచనంగా వికసిస్తాయి. పుస్తకాలు చదివి జ్ఞానం సంపాయించలేము. ఎందుకంటే బుద్ధిలోకం నుంచి గ్రంథం అవగాహన చేసుకోవటానికి, మనోలోకంనుంచి గ్రంథం అవగాహన చేసుకోవటానికి సహస్రం తేడా వున్నది. మనస్సు కన్నా బుద్ధికి వెలుగు ఎక్కువ. ఆ వెలుగు ఏది? నీ సహజమైన వెలుగు. జీవుడి వెలుగు అది. జీవుడు దైవాంశయే. వైవస్వతుడి వెలుగు, నీవు వివస్వతుడవు.

ఇపుడు నీవు చేరవలసింది అహం కదా. 'ఇహం వివస్వతే *యోగం ప్రోక్తవాన్ అహమవ్యమ్'* ఆయన్ని చేరుకోవటానికి అది అలా ఊర్ధ్వగతి చెందుతుంటుంది. అది ఉత్తరప్రయాణం పెద్ద వాళ్ళందరూ ఉత్తరంగా వెళ్ళిపోతారు కదా. చివరకి శంకరాచార్యుల వారైనా ఉత్తరంగా వెళ్ళిపోయారు. ఉత్తరంగా వెళ్ళడం, అంటే మూలాధారానికి వెళ్ళడం. నైఋతికి అంటే ఇంకా క్రిందకి వెళ్ళడం, వాయువ్యం అంటే ముక్కుల దగ్గరకు రావడం. ఇట్లా మనలోనే

దిశలన్నీ వున్నాయి. అది అలా వుండగా ఇలా వెళుతుంటే జ్ఞానము లోపల నుంచి బీజప్రాయంగా నీకు అందుతూ వుంటే, నీకు బయట సన్నివేశాలలో, దానికి సంబంధించినవి నీ చేతికి వస్తాయి. రానవసరము కూడా లేదు. రామకృష్ణపరమహంసకి రాలేదు. అవసరం లేకపోయింది. రాకుండానే, బ్రహ్మజ్ఞాని అయినటువంటి వివేకానందుడికి రామకృష్ణుడు ఎపుడూ ఒక వింతే. ఈయనికి ఏమి తెలుసు? ఏమి తెలియదు? అనేది వివేకానందుడికి అంతు పట్టలేదు. ఆయనికి తెలియనిది లేదు. ఆయన ఏమీ తెలిసినట్లుగా వుండడు. ఇది మిస్టరీ. ఎందుకు మిస్టరీ? లోపలున్నంచి అమ్మ అన్నీ చెప్పేస్తుంటుంది ఆయనకి.

ఈ బయటకి చదువుకున్న వాళ్ళకన్నా లోపల చదువుకున్న వాళ్ళంతా పుస్తకాలు చదువుకుని జ్ఞానులు కాలేదు. జ్ఞానులైన తర్వాత వాఙ్మయాన్ని అవగాహన చేసుకొని వాఖ్యానాలు ఇచ్చారు కదా. అందుచేత మార్గం అది. ఈ రోజుల్లో అన్నీ అచ్చేస్తారు. ప్రతిదీ ఏదో చదివేద్దామనుకుంటారు. ప్రతివాడూ ఏదో మాట్లాడ తాడు. Meditation అంటాడు. ఎక్కడ Meditation? 16 నియమాలు నీ యందు పరిపూర్ణంగా స్థితి గొంటే తప్ప, నువ్వు అసలు ధ్యానమే చేయలేవు. ప్రాణాయామము చేస్తున్నాను అంటాడు. చేసేది కాదు అది జరిగేది. ప్రాణ ప్రవృత్తులు స్తంభించాలి. చిత్తవృత్తి నిరోధం జరిగినపుడే శ్వాసనిరోధం కూడా జరుగుతుంది. స్పంద నాత్మకమైన చైతన్యంగా నీవు ఆ బంగారు రూపంలో ఆ వేలెడంత వుంటావు. అలా జ్ఞానసముపార్జన చేస్తున్న కొద్దీ ఏమవుతుందంటే నీలో స్ఫూర్తి పెరుగుతుంది. స్ఫూర్తి పెరిగినకొద్దీ బయట

కార్యక్రమాలలో నీ Effectiveness పెరుగుతుంది. ఎంత Effective అంటే అలా ఏర్పరుచుకు పోతూంటావు నీ Effective తో. It is an Electromagnetic Radiation ఒకటుంది నీ నుంచి. You are both Magnetic and Electronic అందుకని నీ నుంచి విస్తారంగా లోక శ్రేయస్సుని కలిగించే కార్యక్రమాలు జరుగుతూంటాయి.

అంతకు ముందు మనం చేసేవన్నీ కూడా భృక్తరహితం కొరకే. ఇపుడు చేసేవి ఇంకోరకం. దాని తీరే వేరు. అప్రయత్నంగా అయిపోతుంటాయి పెద్ద పెద్ద పనులు. మాస్టరు జ్వాలాకూల్ మహర్షి ఒక మాట చెపుతారు out of small duties properly performed will emerge larger responsibilities culminating in world service అన్నారు. అంటే చిన్న చిన్న కర్తవ్యాలు సరిగా నిర్వర్తించుకుంటే బాధ్యత పడేవాడికే ఇంకా కొన్ని బాధ్యతలు ఇస్తారు. పని చేసే వాడికే పని చెపుతారు. పని చేయని వాడికి వాడు అంతరాయం కలిగించకుండా వుండటానికి తిండి పెడతారు. అరవంలో ఒక సామెత వుంది పని చేసేవాడికి పని ఇవ్వు, పని చేయని వాడికి తిండి పెట్టు. ఎందుకంటే వాడు అంతరాయం కలిగించడు. లోపల నీలో నిజముగా జ్ఞానము చక్కగా ఆకళింపు అయి, నువ్వు ఆ విజ్ఞాన కోశంలో పెరుగుతున్న కొద్దీ విజ్ఞానమయ కోశంలో నీ యొక్క effectiveness, నీ యొక్క ఉపయోగము సమాజంలో ఎక్కువ అవుతుంది. ఈ ఎక్కువ అవడం అప్రయత్నంగా అవుతుంది. శ్రమ వుండదు. ప్రయత్నం వుండదు. ఎందుకంటే దైవం యొక్క స్ఫూర్తితో నిర్వహింపబడుతుంటాయి. నీలో స్ఫూర్తి

పెరిగి నీకుగా ఎన్నో దీక్షలు స్వయంగా అందుకుంటావు. అలా నువ్వు స్ఫూర్తిలో పెరుగుతుంటావు, ధ్యానంలో పెరుగుతావు, సేవా కార్యక్రమాల్లో నీ యొక్క సమర్థత పెరుగుతుంది. అలా measure చేస్తాం మిమ్మల్ని మేము అని చెప్పారు పరమగురువు జ్వాలాకూల్. అలా నీవు ఊర్ధ్వగతి చెందుతూ ఏమైంది ప్రాణము, అపానము సమానము చేరి సమాన వాయువు ఉదాన వాయువుని పట్టుకుని ఊర్ధ్వ ముఖంగా వెళ్ళి ఈ ఆజ్ఞలో వుండేటువంటి న్యాస వాయువు ద్వారా ప్రపంచంలోకి ఒక్కసారి శరీరంలోంచి బయటకు వచ్చేటు వంటి స్థితి వస్తుంది.

'ప్రాణాపాన వ్యానోదాన సమానసప్రాణ' అంటూ వుంటాము. ప్రాణము అపానము హృదయంలో నిరోధించబడతాయి. అది కారణంగా సమాన వాయువు స్పందనాత్మకంగా వస్తే అది పట్టుకుని ఉదాన వాయువు ఆధారంగా మనం పైకి వెళ్తాం. ఇవన్నీ యోగంలో వాళ్ళు అలా మెట్లు ఎక్కిస్తారు. ఇక్కడ సద్గురువు తానే నీవు చేసే పని ఆధారంగా తానే స్వయంగా ఎక్కిస్తాడు. ప్రతి చోటా తాను దర్శనం ఇస్తాడు. చూడండి కుమారస్వామికి ఆయన గురువు గారు వినాయకుడు వెళ్ళిన చోటల్లా ముందు కన్పిస్తూంటాడు కదా. 'ఇదేమిటి అన్నయ్య అపుడే ఎలా వచ్చాడు'. అన్పిస్తుంది. రావటడం ఏమిటి పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతూంటే, నీకన్నా ముందే వుంటాడు నీ గురువు ఎపుడూ. నువ్వు ఒక మెట్టు ఎక్కగానే మళ్ళీ ఒక ఆశీర్వచనం ఇస్తాడు. అలా చిట్టచివరి వరకు. ఇక ఆ చివర Wish you best of luck అంటాడు. ఆయన కాపాడుకుంటూ తీసుకు వెళతాడు.

అలా నీవు ఈ భ్రూమధ్యం చేరి అక్కడ నుంచి ఆజ్ఞకి ప్రయత్నం చేస్తూంటావు. అపుడు ఈ గ్రంథి స్రవిస్తే నీకు దారి బయటకు వస్తుంది. ఆ దారిలోంచి నీవు దర్శిస్తే అపుడు అది నేను, ఇది కాదు. ఇది నా వాహనం. అది నేను, అది శాశ్వతం. అది నరుడు. అది నశించనిది, అది అక్షరపురుషుడు. అది ఎప్పటికీ వుంటుంది. అది మళ్ళీ శరీరంలోకి వచ్చినా దాని కది గుర్తుంటుంది. దీన్నే ఇపుడు పరమగురువులు 3rd Initiation అంటారు. మనవాళ్ళు చిరంజీవత్వం అంటారు.

ఇంతవరకూ కథ నడిపించి ఆ తర్వాత కథ మళ్ళీ నడిపిస్తానన్నారు ఆయన. ముందు అమరత్వం ఆ తర్వాత బ్రహ్మత్వం. ఎందుకంటే అపుడు నీవు మళ్ళీ శరీరంలోకి వచ్చినా నీకు గుర్తుంటుంది. ఎలా గుర్తొస్తుందంటే పదేళ్ళకే వస్తుంది. బాబా గారికి 14 ఏళ్ళకి గుర్తు వచ్చేసింది కదా నేను సాయిబాబాని అన్నారు. ఎందుకని శరీరం మీద పూర్తిగా జీవుడికి స్వాధీనం వచ్చేంతవరకూ అలా వుంటాడు. శంకరాచార్యుల వారికి 8వ ఏటనే గుర్తువచ్చింది. అలా 8, 10, 12, 18, 21, 24 వీటికి మళ్ళీ కొన్ని అంకెలు, సంఖ్యలు వున్నాయి. అలా గుర్తు వస్తుంది. నీవు ఎంత పరిణితి చెందాతావో అంత తొందరగా గుర్తు వస్తుంది. మహా అయితే చిట్టచివరికి గుర్తుకు వచ్చేది, సగం చేసి వదిలేసిన వారికి 49 ఏళ్ళకన్నా గుర్తుకు వస్తుందిట. అలా మనకి భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. సగం చేసి చచ్చిపోతే ఎట్లా అంటాడు, అర్జునుడు సగం చేసి చచ్చిపోతే మళ్ళీ వస్తావు, మళ్ళీ అక్కడనుంచి మొదలెడతావన్నాడు. ఇలా పూర్తి చేసుకుని వస్తే త్వరగా మొదలెడ

తావు. అపుడు బ్రహ్మత్వం కోసం నీ ప్రయత్నం పెరుగుతుంది. అరుణాచలం వెళ్ళిన రమణ మహర్షికి, ఆయన వెంకట్రామన్ కదా అపుడు. ఆయనకి అలా దర్శనం అయింది తన గురించి. తనకి పదహారు ఏళ్ళ అపుడు జ్వరం వచ్చింది, జ్వరం వస్తే దేహం వదిలి బయటకు వచ్చేసింది తెలివి తప్పుతుంది. ఆయనకి కనపడింది. ఓహో మనం ఇది కదా ఆ శరీరం కాదు కదా అను కున్నాడు. అది తెలియగానే జ్వరం కూడా పోయింది. నాకు అంతా అయిపోయిందనుకున్నాడు. వెళ్ళి అరుణాచలం కొండల్లో వుండే గుహల్లో కూర్చుని తపస్సు చేసుకున్నాడు. దేని గురించి? బ్రహ్మత్వం గురించి, అమరత్వం వచ్చిన వాళ్ళందరూ బ్రహ్మత్వం పొందిన వాళ్ళు కాదు.

దేవతలందరికీ నేను తెలియదుగా అన్నాడు శ్రీకృష్ణుడు. ఓ అర్జునా! ఈ దేవతలందరికీ నేను తెలియదు అన్నాడు. దేవతలకే తెలియకపోతే మాకెట్లా అంటే, వాళ్లు నీలాగా సృష్టి మొదలైన తర్వాత ఎక్కడో దారిలో వచ్చిన వాళ్ళేగదా అన్నాడు. ఎవరికి తెలుసు? ఋషులకి తెలుసు. నేను తెలిసినవాళ్లు ఈ దేవతల్లో కొంతమందే వున్నారు అన్నాడు. అందరూ మిగతావాళ్ళు మనుష్యు లేగా. అందుకనే వాళ్లు తప్పులు చేస్తూంటారు, క్రిందపడి పోతూంటారు. ఏవో క్రిందకి వచ్చి వేరే జన్మలు ఎత్తుతుంటారు. అందుచేత దేవతలుసైతం అమరులైనంత మాత్రాన బ్రహ్మత్వం రాదు. దేవతలందరూ అమృతం స్వీకరించినా చావమని తెలిసినా మరి రాక్షసులంటే భయంగానే పడుంటారుగా, బ్రహ్మత్వం చెందిన వాళ్ళకి అది లేదు. అమరత్వం నుండి బ్రహ్మత్వానికి మళ్ళీ కథ

వున్నది. అంటే ప్రస్తుతం కథ అమరత్వం వరకూ కుంభయుగంలో వున్నది. ఇది ఒక అవకాశం.

కుంభ యుగములో జీవుడు దాదాపు చాలా దూరం వరకూ వచ్చినట్లే. 300 ఏళ్ల క్రితం విమానంలాగా యంత్రంలా ఎగర వచ్చుంటే ఎవరన్నా ఒప్పుకునేవారా లేదు కదా మరి ఇప్పుడో... అలాగే మాస్టర్ సి.వి.వి. గారు 240 సంవత్సరాల తర్వాత మనుష్యులు ఎగురుతారు అని చెప్పారు. అపుడు ఒప్పుకో బుద్ధి కాదు గానీ, ఇపుడు ఒప్పుకుంటున్నాం. అంతే కాదు మనిషి ఇక్కడ అదృశ్యమై మరొక చోట మళ్ళీ దృశ్యం తాలుస్తాడు. అంటే, మనం పంపించిన ఉత్తరం fax ద్వారా ఎలా వెళ్ళింది? ఇది ఇక్కడే వుందిగా, అక్కడ మరి ఉత్తరం వచ్చిందిగా. అలా electronic media ద్వారా ఆ ఉత్తరాలు వెళ్ళిపోతున్నాయిగా. ఇలా అణువులు కట్టుకోవడం దేహం ఏర్పరచుకోవడం, మళ్ళీ అణువులని లీనం చేయడం, మళ్ళీ అదృశ్యమవడం, ఈ Appearance and Disappearance అనే కథ వున్నదే, not untrue being to be and not to be ఆ సత్య స్థితి కుంభరాశికి సంబంధించినది. ఆ కుంభ చైతన్యం కూడా ఆ కుండకి ఇటు నీళ్ళు వస్తాయి. అటేమీ వుండదు. అటు నీళ్ళు లేవు. ఇటు నీళ్ళు రావడం ఏమిటి అంటే ఏమీ లేనట్లుగా వుండే చోటునుండి వున్నట్లుగా ఈ సృష్టి అంతా ఎలా దిగివచ్చింది? అలాగే నువ్వు ఎలా దిగి వచ్చావు ఈ రహస్యా లన్ని ఆ కుండలో వున్నాయి. దాన్ని Aquarian Pass అంటారు. దాన్నే జనన మరణముల యొక్క దారి అని చెపుతారు. ఇటు వస్తే పుట్టావు, అటు వెళ్తే వున్నావు. ఇక్కడ వున్నట్లు అక్కడ వున్నట్లు

వుండవు. అక్కడ వున్నా, ఇక్కడా వున్నావు. అక్కడ సూక్ష్మంగా వున్నావు. ఇక్కడ స్థూలంగా వున్నావు. అందుచేత ఈ రహస్యాలన్నీ గుర్తుపెట్టుకోండి. మాస్టరు సి.వి.వి. గారు చెప్పారు. ఈ పద్ధతిలో సాధన చేసుకుంటే మనక్కూడా తెలుస్తాయి. అందుచేత ముందు మీకందరికీ అమరత్వం ప్రసాదించటానికి వచ్చాను నేను. అటుపైన బ్రహ్మత్వానికి ఇంకా కార్యక్రమం వున్నది. అమరులందరూ కూడా బ్రహ్మత్వం కోసం ప్రయత్నం చేయడం కాక భోగలాలసులై మళ్ళీ నేల మీద మానవ రూపం ధరిస్తారు. అందుకే పెద్దలు ఏమి చెపుతున్నారంటే, అమరత్వం వరకు ఆగక, బ్రహ్మత్వం కోసం వెళ్ళమంటారు. ఇది ఒక కథ. ఇది యోగమునకు సంబంధించిన కథ.

యోగమునందు మాత్రమే ఇలా స్థూలమయినటువంటి లోకాల నుంచి సూక్ష్మలోకాలకు, అక్కడ్నుంచి సూక్ష్మతరము అయినటువంటి లోకాలకు, అటు నుంచి సూక్ష్మతరము అయినటువంటి లోకాల లోకి అలా దారి. ఈ దారి అంతా కూడా గురుపరంపర ఆవరించి వున్నది. వారే సనక, సనందన, సనత్కుమారాదులు, నారద, పరాశర, శక్తి, శుక, వ్యాస, మైత్రేయాదులు. ఈ పరంపర అంతా మనకి సహాయం చేయడానికి అన్ని చోట్లా వ్యాపించి వున్నారు. కాబట్టి గురుపరంపరని ఆ విధంగా భావన చేయాలి. మాస్టర్ సి.వి.వి. ఈ విధంగా ఈ యోగానికి మార్గా నిచ్చారు. మీకందులో జరిగేటువంటి నియమాలు కూడా అవే వస్తాయి. కాకపోతే ఒక సూక్ష్మమైన పద్ధతుల్లో ప్రవేశపెట్టేట్లుగా ఆయన ఇచ్చారు. మనం మనస్ఫూర్తి కొద్దీ మనం నడుం బిగించి మళ్ళీ ఇందులో ఎంత

ముందుకు పోవాలో ఎవరికి వారు ఇది చూసుకోవలసిన విషయం. విషయం బాగుంది కాబట్టి ఆ కాస్తా చెప్పుకుంటే బాగుంటుంది.

మాస్టరు సి.వి.వి. గారి స్ఫూర్తితో మనం ఈ విషయాన్ని ముచ్చటించుకోవడం జరిగింది. మీరు మీ స్ఫూర్తిని బట్టి మరింత దీక్ష బూని మార్గంలో నడవండి. అదే విధంగా ఇతర సద్గురువులను అనుసరించే వారెవరన్నా వుంటే, వారి సద్గురువుని కూడా ఆ విధంగానే హృదయంలో భావన చేసి ముందుకు పోండి. వారి భౌతిక రూపమే రూపము కాదు. వారికి అవి కాక మరి రెండు శరీరములున్నవి. బంగారుమయ శరీరం, వజ్ర శరీరం వున్నాయి. ప్రతి సద్గురువుకి మూడూ దేహము లుంటాయి. Diamond body వజ్రాంగ శరీరము, Golden body బంగారు దేహము, Body of flesh and blood భౌతిక శరీరము. ఈ 3 శరీరాల నుంచి పని చేస్తారు. అందుకు ఎవరైనా ఆ విధంగా సద్గురువుని ఆరాధనతో, స్ఫూర్తితో వారందించిన బోధనలను పఠనం చేసుకుంటూ, వారు ఇచ్చిన దీక్షను అనుసరిస్తూ ముందుకు సాగవచ్చు.

స్వస్తి

## OTHER BOOKS THROUGH
# MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |

**BOOKS :**

| | | |
|---|---|---|
| 14. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 15. | THE AQUARIAN MASTER | E/G/S |
| 16. | SOUND –The Key & its Application | E/G/S |
| 17. | ASHRAM LEAVES | E/G/S |
| 18. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 19. | VENUS –The Path to Immortality | E/G/S |
| 20. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |

| | | |
|---|---|---|
| 21. | SHIRDI SAY SAYINGS | E/G/S |
| 22. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 23. | THE MASTERS OF WISDOM | S |
| 24. | MEDITATION & GAYATRI | S |
| 25. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 26. | ON HEALING | E/G/S |
| 27. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 28. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 29. | THE AQUARIAN CROSS | E/G/S |
| 30. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 31. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 32. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 33. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 34. | JUPITER –The Path of Expansion | E/S |
| 35. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 36. | AMANASAKUDU | T/K |
| 37. | VRUTRASURA RAHASYAM | T |
| 38. | THE DOCTRINE OF ETHICS | E |
| 39. | DHANAKAMUNI KATHA | T |
| 40. | ANTARDARSANA DHYANAMULU | T |
| 41. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 42. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 43. | ASANGUDU | T |
| 44. | SARASWATHI - THE WORD | E |
| 45. | MANA MASTERU GARU | T |
| 46. | GEETOPANISHAD | T |
| 47. | SRI LALITHA | T |
| 48. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 49. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 50. | Katha Deepika | T |